వీ క మ్సీ వా రి

చి హ్నా ము

వి. సి.

[స్థాపితము: 1893]

నాణ్యమైన

రత్నములకు

సవరం బంగారు

ఆభరణములకు

గ్యారంటి

* ప్రశస్తమైన పనితనము

* అందమైన తయారు

వీకమ్సీ ఛబిల్‌దాస్ అండ్ సన్సు

ప్రఖ్యాత నగల వ్యాపారులు. రత్న వ్యాపారులు

చైనాబజారు :: మదరాసు.

## ఈ సంచికలో కొందరు రచయితలు

నార్ల
చలం
కుటుంబరావు
కృష్ణమూర్తి
శ్రీ. శ్రీ.
గోఖలే
దీక్షితులు
క. స.
సముద్రాల
శిష్ట్లా

మొదలైనవారు.


ఇప్పుడే వెలువడినవి!

### చలంగారి ఉత్తమ రచనలు

# బిడ్డల శిక్షణ

బిడ్డల పెంపకం విషయంలో తల్లితండ్రులకు అత్యంత సహకారి.
వైజ్ఞానిక రచన: వెల. **1—8—0**

# స్త్రీ

ఆధునిక సాంఘిక వ్యవస్థలో స్త్రీని ఎదుర్కొనే సమస్యలన్నీ యధార్ధ దృష్టితో సమగ్రంగా చర్చించబడినవి. వ్యక్తులైన స్త్రీ పురుషు లందరూ తప్పక చదవవలసిన రచన: వెల. **2—0—0**

### యువ బుక్ డిపో
ఆచారప్పన్ వీధి :: గవర్నరుపేట
### మద్రాసు :: బెజవాడ

# తినబోతూ ....
# రుచులడుగుతారా?



★

భోజనం చేసేవారికి కల్తీలేని నెయ్యి చేతిమీద పడుతుందనే ధైర్యం ఎంతో తృప్తినిస్తుంది.

పాక కళ మూడు వంతులు మంచి నెయ్యే ననవచ్చు.

రకరకాల నూనెలు కలిపిన చవుకబారు నెయ్యి అగ్నిమాంద్యమూ, నిస్సత్తువా మొదలైన జాడ్యాలకు దారితీసి భోజనం చెయ్యటమే ఒక బాధగా పరిణమించటం జరుగుతుంది.

నియమంగా స్వచ్ఛమైన నేతినివాడేవారు డాక్టర్ల బిల్లులమీద చేసే ఆదాకాక ఆరోగ్యాన్ని అధికంగా కాపాడుకో గలుగుతారు.

పల్లెటూళ్లవారు నిత్యమూ అనుభవించే ఈ సదుపాయం పట్టణవాసాల వారికిలేదు; కనుకనే పట్టణవాసులు పల్లెలవారినిచూసి అసూయపడతారు.

మద్రాసు పౌరుల కీ కొరత తీర్చటానికి మేము సిద్ధంగా ఉన్నాము. స్వచ్ఛమైన నేతికొరకు మీ యిబ్బందీ పడనపసరంలేదు. మావద్ద విచారించండి.

★ పది సంవత్సరాలకుపైగా మేము మద్రాసు పౌర ప్రముఖులకు అచ్చమైన నెయ్యి అందించి వారి ఆదరాభిమానాలకు పాత్రమై ఉన్నాము. యదార్థంగా మా వ్యాపారం ఇంతగా అభివృద్ధి చెందటానికి కారణం మేము విడువకుండా మద్రాసు పౌరులకు చేసిన సేవయే:

★

## బి. వి. రావు

★

పురుశవాకం, ట్రిప్లికేన్, మైలాపూర్.

Phone No. 4002

# ఈస్ట్ అండ్ వెస్ట్

**పురాతనమై, గౌరవము పొందిన ఇండియా భీమా కంపెనీలలో ఇది ఒకటి**

ఈ విషయం అంకెలే చెప్పుతాయి . . .

| | |
|---|---|
| అమలులో ఉన్న జీవితభీమా | రు. 3,50,00,000 |
| కంపెనీ యావదాస్తులు | 85,00,000 పైన |
| ఆదాయం | 18,00,000 ,, |
| జీవిత నిధి | 60,00,000 ,, |
| చెల్లించిన క్లైములు | 25,00,000 ,, |

## ది ఈస్ట్ అండ్ వెస్ట్ ఇన్సూరెన్సు కంపెని, లి.

ఈస్ట్ అండ్ వెస్ట్ బిల్డింగ్, అపోలోస్ట్రీట్, ఫోర్టు, బొంబాయి.

జీవితము...అగ్ని...నావిక...దుర్ఘటన

శ్రీ వి. వి. నాగరెడ్డి
చీఫ్ ఏజంట్
ఆదోని

శ్రీ జె. యస్. రెడ్డి
బ్రాంచి సెక్రటరీ
ఈస్ట్ అండ్ వెస్ట్ బిల్డింగ్
377, ఎస్‌ప్లనేడ్, మద్రాసు.



**ఉబ్బసముతో బాధపడువారికి నా సలహా ఇదే**



"తాత్కాలికంగా ఉపశమనము కలిగించే మందులను వాడడం చాలా వెర్రితనం."

అప్పటికప్పుడు వెంటనే గుణమిచ్చుటయే గాక, ఉబ్బస వ్యాధియొక్క మూలకారణములను రూపుమాపి శాశ్వతంగా నయము చేయునది పురోహిత్‌వారి శ్వాసహరి మాత్రమే. శ్వాసహరిని వాడుట ప్రారంభించిన వెంటనే, దగ్గుపోయి, శ్వాస ధారాళమగుటయేగాక, జీర్ణకోశము, ఊపిరితిత్తులు క్రమేణ బలపడి, ఉబ్బసము పూర్తిగా తగ్గిపోవును.

ఉబ్బసము, ఊపిరినలుపకుందుట, నడుము నొప్పి, గొంతుకలో నవకలిగించు దగ్గు, మొదలగు గుండెజబ్బులకు శ్వాసహరి (నీలిరంగు ప్యాకెట్టు) ను వాడుడు. మలబద్ధకము, పులితేపులు, వీటిచే బాధపడు ఉబ్బస వ్యాధిగ్రస్తులగువారు శ్వాసహరి కాంపౌండు (ఎరుపురంగు ప్యాకెట్టు)ను వాడుడు.

అందరు కెమిస్టులవద్దను, **3, 6, 12** ఔన్సుల సైజులలో రు. **3-6-0** రు. **5-12-0**, రు. **10-0-0** ధరలు గలిగినవి లభించును,

మద్రాసు స్టాకిస్టులు:– మెసర్సు: అప్పా & కో., చైనాబజారురోడ్డు.

,, అమృత రత్నాకర ఫార్మసీ, గోవిందప్పనాయక్ వీధి

తయారు చేసేవారు:

డాక్టర్ పురోహిత్ ఫార్మసీ,
కొల్హాపూర్.



**PUROHIT**
**SHWAS-HARI**

# చిన్న చిన్న మొత్తములలో డబ్బును దాచుకొనే విధానము

* దుర్దశయందు ఒకజాతికి దాచుకొన్న జాతీయధనముకంటె మించిన రక్షణలేదు.
* కూడబెట్టి అప్పుగా నీయుడు. డబ్బును దాచకుడు లేక ఖర్చుచేయకుడు.
* నేషనల్ సేవింగ్సు సర్టిఫికేట్లే జాతికి భద్రమైన మార్గము.
* మీ డబ్బును నూటికి 50 వంతుల చొప్పున పెరుగనియ్యండి.

రూ. 5 లను రూ. 7½ లుగా; రూ. 10 లను 15 గా; రూ. 100 లను 150 గా; రూ. 1000 లను 1500 లుగా; రూ. 5000 లను 7500 లుగా పెరుగనియ్యండి.

షరా :—(A) (1897 వ సం॥పు జెనరల్ క్లాజెస్ ఆక్టులో నిర్వచింపబడినట్లుండు) స్థానిక అధికారవర్గములును రిజిస్టరుకాబడిన సహకారసంఘములును, లక్షరూపాయలవరకు నేషనల్ సేవింగ్సు సర్టిఫికేట్లలో యిప్పుడు తమ ధనమును పెట్టుబడి పెట్టవచ్చును.

(B) ఈడువచ్చిన కక్షిదారు, మైనరు, ఐక్యపర్చబడిన సంస్థ లేక ఇతర సంఘము తరపున షెడ్యూల్డు బ్యాంకులును, రాష్ట్రీయ సహకార బ్యాంకులును ప్రతి సంవత్సరములోను రూ. 5000 ల వరకు ధనమును పెట్టుబడి పెట్టవచ్చును.

(C) నేషనల్ సేవింగ్సు సర్టిఫికేట్లను ఏ కాలమందైనను హామీగా ఒక గవర్నమెంటు ఉద్యోగికి పరివర్తన చేయవచ్చును.

(D) ఈ సర్టిఫికేట్లను కలిగిన రాబడిపన్ను కట్టేవారియొక్క "మొత్తపురాబడి"లో వీటివలనవచ్చిన వడ్డీని చూపనవసరములేదు. అనగా యితర మార్గములనుండి వచ్చిన ఆదాయముమీద చెల్లించవలసిన ఆదాయపుపన్ను రేటును ఈ వడ్డీ యేవిధముగాను పెంచదు.

Ads. N. S.—14



# తెలుగు పాటల పోటీ

మొదటి బహుమతి రు. 125/- రెండవ బహుమతి రు. 75/-

మూడవ బహుమతి రు. 50/-

తెలుగులో ఉత్తమమైన మూడు పాటలు, గీతములు రచించిన వారికి మూడు బహుమతు లివ్వబడును. కవిత్వ రచన వృత్తిగా కలవారును, కొత్తవారునుకూడ పోటీచేయవచ్చును. ప్రవేశ రుసుము లేదు. పాటలు ఫలాని విషయమునకు సంబంధించి యుండవలెనను నియమము లేదు. పోటీ నియమ నిబంధనలను వివరించియున్న ఎంట్రీఫారములు కోరినవారికుచితముగా పంపబడును. పోటీకి ఎంట్రీలన్నియు 1945 డిశంబరు 31 వ తేదీన ముగించబడును. బహుమతులు 1946 ఫిబ్రవరి 15 వ తేదీన ప్రకటింపబడును.

## ది గ్రామఫోన్ కంపెనీ లిమిటెడ్,

పోస్టు బాక్సు నెం. 705, కథీడ్రల్, మదరాసు.

A TRIBUTE to Jambu's



MADRAS RACE CLUB
Madras. 19-10-'45.

Messrs. JAMBU & Co.

*Dear Sirs,*

I have used your Jambu Shark Liver Oil, for the past eight months; and I can say that it has a wonderful effect on most of my horses, more especially the horses which were in a naturally weak condition. It has built them up very well indeed, and I would have no hesitation in recommending it to anybody with horses.

Yours faithfully
(Sd) F. BLACK.

SHARK LIVER OIL


Contains Vitamins A. & D.

Packings in 12 Ozs. nd 1 lb. bottles, and 1 gallon tins.
Obtainable Everywhere

P.S.M. Co

JAMBU & CO., T. NAGAR, MADRAS.

# STAR of INDIA



**an outstanding name in the pencil world...**

పెన్సిలు సరిగా రాయకపోయినా, ముక్కువిరిగినా చాలా చిరాకేస్తుంది. ఆలోచన సాగదు. మంచి పెన్సిలు దొరికినప్పుడాలోచనలు ధారాళంగా వస్తాయనటంలో విచిత్రమేమీ లేదు. చక్కగా రాయటానికీ రాసేవారిఆలోచనలు ధారాళంగా దొర్లటానికీ అనుకూలంగా తయారుచేసినవి స్టార్ ఆఫ్ ఇండియా పెన్సళ్లు.

## స్టార్ ఆఫ్ ఇండియా పెన్సళ్లు

## అత్యుత్తమమైనవి

ALWAYS
-BUY-
INDIAN

MADRAS PENCIL FACTORY Madras.

ADS MP.

# ఆంధ్ర జ్యోతి

సచిత్ర మాస పత్రిక

సంపాదకుడు: చక్రపాణి

సాలుచందా 5—0—0. సాధారణ ప్రతి 0—6—0.

* ఆంధ్రజ్యోతి ఆంధ్రదేశంలో ప్రఖ్యాతిగన్న రచయితల రచనలతో ప్రతి మాసమూ 1-వ తేదీ వెలువడుతుంది. సాధ్యమైనంతవరకు ప్రతి రచనా సచిత్రంగా ఉంటుంది. ఆంధ్ర దేశానికి సంబంధించిన సమస్యలకే ముఖ్యంగా ప్రాముఖ్యత ఇస్తుంది.

* ఆంధ్రజ్యోతి పాఠకులు చందాదారులుగా చేరటం మంచిది. చందాదారులకు కాపీ నమ్మకంగా అందుతుంది. ఆంధ్రజ్యోతి ప్రచురించే ప్రత్యేక సంచికలన్నీ చందాదారులకు ఉచితం.

* ఆంధ్రజ్యోతికి ఏజంట్లు లేనిచోట్ల ఏజంట్లు కావాలి. షరతులకు మేనేజరుకు వ్రాయండి.

* ఆంధ్రజ్యోతిలో ప్రకటనకు సంబంధించిన వివరాలకు అడ్వర్టైజ్‌మెంటు మేనేజరుకు వ్రాయండి.

మేనేజరు

ఆంధ్ర జ్యోతి

43 ఆచారప్పన్ వీధి :: జి. టి. మద్రాసు.

ఆంధ్రజ్యోతి

.....సచిత్ర మాస పత్రిక.....

సంపాదకుడు : చక్రపాణి

సంపుటి 5] 1 డిశెంబరు 1945 [సంచిక 6

# శ్రీ పట్టాభిగారి జన్మదినోత్సవం

నవంబరు 24 వ తేదీ మన పట్టాభిగారు పుట్టినరోజు. బందరులో ఆ నాడు వారి జన్మదినోత్సవం ఉత్సాహంగా జరిగింది. దేశభక్తుల జన్మదినాలు ప్రజకు పండుగలు. ఇటీవలనే సర్దారు, జవహరుల పుట్టినరోజుల పండగలు జరిగినవి. ఇలాంటి పండుగలు మనకు శ్రీరామనవమి, కృష్ణాష్టమికంటె ముఖ్యమవుతున్నవి. ఆంధ్రులను వెనుకంజ వేయనీయకుండా జాతీయపథంలో నడుపుతున్న పట్టాభిగారికి మా జోహారు! ఈనాటి ఆంధ్రాభ్యుదయంలో పట్టాభిగారి ప్రతిభ ప్రతిచోట గోచరిస్తుంది. ఆంధ్ర రాజకీయ, సాహిత్య, వ్యాపార, పారిశ్రామాది క్షేత్రాలలో ఆయన వేసిన గట్టి పునాదులు యశస్వంతములుగా ఉన్నవి.

ఆంధ్రదేశంలో అఖిలభారత చరఖాసంఘం వేర్లు పోసుకొని, విశాలంగా వ్యాపిస్తోందంటే, అందుకు ముఖ్యకారణం పట్టాభిగారు.

ఇలా, అన్నివిధాలా, ఇకముందు రోజుల్లోకూడా ఆంధ్ర ప్రజాభిమతాలకు ఒక సామలస్యత, రూపు, లక్ష్యం ఇచ్చి ముందడుగు వేయించి, పట్టాభిగారు నాలుగు కాలాలపాటు హాయిగా ఉండాలని మేము కోరుతున్నాము.

వీరివలన ఇంతవరకైన దానికన్న కాగల మహత్కార్యాలు అధికంగా ఉన్నవని ఆంధ్రప్రజ ప్రతీక్ష చేస్తున్నది.

పట్టాభిగారి కివే మా ప్రణామములు.

# ప్రజానాయకుడు జవహర్ లాల్

నవంబరు 14 వ తేదీ మన జాతీయచరిత్రలో ఒక పర్వదినం. అక్టోబరు రెండు. జనవరి యిరవైఆరు, ఆగష్టు తొమ్మిది లాంటిది. పండిత నెహ్రూ యిష్టపడక పోయినా, భారతదేశం మాత్రం 'నెహ్రూ జయంతి' పర్వదినంగా భావించక మానదు.

1889 లో అలహాబాదులో ఆనందభవనంలో నెహ్రూ జననం. ఆయన చెల్లెళ్లు విజయలక్ష్మి, కృష్ణాలు, నెహ్రూకంటె పదకొండేళ్లు చిన్న. అందుచేత పదేళ్లకు పైగా, ఒక్కడే కొడుకుగా పండిత నెహ్రూ అతి గారాబంగా పెరిగాడు. అంత గారాబంగా పెరిగినా తండ్రి దగ్గర నెహ్రూకి విపరీతమైన భయభక్తులు. ఒకసారి మోతీలాలు వ్రాతబల్లమీద రెండు ఫౌంటెన్ కలాలు చూశాడు నెహ్రూ. తండ్రికి రెండు కలాలు అవసరం ఉండదు. అదీగాక ఆ చక్కటి కలం అతన్నాకర్షించింది. అది తియ్యకుండా ఉండలేకపోయాడు. కలం పోయిందని మోతీలాలు యిల్లంతా వెతికించాడు. దొంగ దొరికిపోయాడు. మోతీలాలు ఉగ్రుడైనాడు. అంత ముద్దుగా పెంచిన కొడుకుని శిక్షించేందుకు వెనుదీయలేదు. ఆనాడు తిన్న దెబ్బలు యిప్పటికీ మరిచిపోలేదు పండిత నెహ్రూ. కాంగ్రెసు శాసనాలకు, పద్ధతికి వ్యతిరేకంగా నడిచే కాంగ్రెసు వాదుల్ని, నెహ్రూ కొరడాతో కొట్టినట్లు మందలిస్తాడు. వినయవిధేయతలంటే అతనికంత గౌరవం. యింకొకసారి నెహ్రూ గుర్రపుస్వారీ కెళ్లేడు. అతని పోనీ (గుర్రం) అతన్ని పడతోసి, యింటికి పారిపోయింది. సాయంత్రం స్నేహితులతో సంతోషంగా గడుపుతూన్న మోతీలాలు గుర్రాన్ని ఒంటరిగా చూసి, తక్షణం నెహ్రూని వెతికేందుకు బయలుదేరాడు. అతని మిత్రులుకూడా అనుసరించారు. జవహర్‌లాలుని చూడగానే, వాళ్లు గొప్ప సాహసకృత్యం చేసి బయటపడ్డ యోధుడ్నిలాగ గౌరవించారు.

జ్ఞానం వచ్చిన దగ్గరనుంచీ, నెహ్రూకి బ్రిటిష్ ప్రభుత్వంపట్ల, వారి అత్యాచారాలపట్ల తీవ్రమైన అయిష్టత కలిగింది. ఒకదొర, నల్లవారి నెంతమందిని చంపినా, శిక్షింపబడేవాడు కాడు. అదే, భారతీయుడు ఒక యూరోపియన్ని గాయపరిస్తే కఠినంగా శిక్షించేవారు. హోటళ్ళలోకి, రైళ్ళలోకి తమతో సమానంగా భారతీయుల్ని రానిచ్చేవారుకాదు దొరలు. ఇటువంటివన్నీ బాలుడు నెహ్రూని ప్రభుత్వాన్ని ధిక్కరించేలా చేశాయి. అప్పటినుండీ కూడా, యే భారతీయుడైనా, ధైర్యంగా దొరల్ని యెదిరిస్తే, నెహ్రూ, అతన్ని మనసులో ప్రశంసించేవాడు. ఈ వయస్సులోనే నెహ్రూలో విప్లవబీజాలు నాటబడ్డాయి.

పదిహేనవయేటే నెహ్రూ చదువుకుందికి యింగ్లండు వెళ్ళాడు. హేరో, కేంబ్రిడ్జిలో చదువుతున్నప్పుడు, నెహ్రూ పూర్తిగా విప్లవవాదిగా మారాడు. బ్రిటన్‌లో సామాన్య మానవు డనుభవించే స్వేచ్ఛ, భారతదేశంలో లేకపోవడం అతను సహించలేక పోయాడు. అక్కడనే సర్ స్టాఫర్డ్‌క్రిప్సుతో ప్రధమ పరిచయం. ఆనాటినుండి సోషలిష్టనుకున్న క్రిప్సు, భారతదేశాన్ని ఆ విధంగా మోసపుచ్చటం నెహ్రూ క్షమించలేకపోయాడు. 1942 తరువాత నెహ్రూకి క్రిప్సుపట్ల గౌరవం క్షీణించింది.

పండితనెహ్రూ, కమలాదేవీల వివాహమప్పుడు గాంధీజీ అన్నాడు: వీరిద్దర్నీ బంధించే ఈ వివాహసూత్రం ముళ్ళకంచెలా మారుతుందేమోనని భయంగా ఉంది అని. నిజంగా అది ముళ్ళకంచే అయింది. ఆరోగ్యం బాగా లేకపోయినా, కమలా నెహ్రూ, జైలుకి పతి ననుసరించింది. చివరకు దేశసేవలోనే అతి చిన్నవయసులో ప్రాణా లర్పించింది. త్యాగంలో నెహ్రూ కుటుంబంవంటిది యెక్కడాలేదు. మోతీలాలునుండి, ఇందిరా గాంధీ వరకూ, అందరూ దేశంకోసం సుఖాన్ని, చివరకు ప్రాణాల్నికూడా లెఖ్ఖచెయ్యలేదు. నెహ్రూ యెన్నిసార్లు జైళ్ళకెళ్ళేడో లెఖ్ఖపెట్టలేం. జాతీయవాది నెహ్రూ, అంతర్జాతీయ రాజకీయాల్లో గాంధీజీ గురువు. పెరూనుండి రష్యావరకూ అన్నిదేశాలు అతను వెళ్ళేడు. చరిత్రలో అతను మేధావి. స్పెయిన్‌లో, చీనాలో, (ఈనాడు జావాలో) జరిగిన ప్రజాపోరాటాల్లో నెహ్రూ, ప్రజలపక్షం వహించాడు. భారత ప్రజలు అరవైయేళ్ళనుంచి సాగిస్తూన్న స్వాతంత్ర్య సమరానికి, ఈ పోరాటాలకు సన్నిహిత సంబంధముందని నిరూపించాడు. అన్యాయాన్ని, అక్రమాన్ని అతను యేరూపంలోనున్నా, యేదేశంలోనున్నా ద్వేషిస్తాడు. డిక్టేటరు ముసోలినీని కలుసుకుందికి, నిరాకరించటం, నెహ్రూకి నిర్బంధ విధానంపట్ల నున్న ద్వేషాన్ని తెలియచేస్తుంది.

చిన్నప్పుడు నెహ్రూకి పుట్టినరోజంటే సరదా. ఆరోజున అతన్ని ధాన్యాలతో తూచి అవి బీదలకు దానం చేశేవారు. తరువాత అతి వేడుకగా పండుగ జరిపేవారు. అవన్నీ నెహ్రూకి సరదాగా ఉండేవి. కాని యిప్పుడు ప్రతి పుట్టిన రోజు, నెహ్రూ వయస్సు యెక్కువౌతూందని తెలియచేస్తుంది. యువకరక్తంతో తొణికిసలాడే, యువయోధుడు నెహ్రూ, యిప్పుడు 66 సంవత్సరాల వాడయ్యాడు. కాని గాంధీజీ లెఖ్ఖప్రకారం, యింకా అరవైయేళ్ళకు పైగా, నెహ్రూ భారత జాతీయ నాయకత్వం వహించాలి. స్వతంత్రభారత ప్రజానీకానికి ప్రధమాధ్యక్షుడిగా అలంకరించాలి. ప్రజానాయకుడు నెహ్రూకి 'ఆంధ్రజ్యోతి' ప్రణామాలు!

# పూర్ణ స్వరాజ్య సంపాదన

ప్రభుత్వ నిషేధాజ్ఞ తొలగిపోయి దేశమంతటా తిరిగీ రాష్ట్రీయ, తదితర కాంగ్రెసు సంఘాలు పాటున బడుతున్నవి. కేంద్రశాసన సభ ఎన్నికలు, రాష్ట్రశాసన సభ ఎన్నికలు, —వీటిలో కాంగ్రెసు పోటీచేయటము కాంగ్రెసు సభ్యులను చేర్చటము—ఇవే కాంగ్రెసుకు వెంటనే కర్తవ్యముగా తోస్తున్నవి.

వీటికేగాని, మరే పనులకైనా గాని కాంగ్రెసు అఖిలదేశ వ్యాప్తమైన సంస్థగా చాకచక్యంతో కార్యకుశలంగా మెలగటం చాలా అవసరము. కాంగ్రెసు సంస్థాపనలోను, నిత్య వ్యవహారములోను లోటుపాట్లు అనేకం యిప్పుడు బాగా గోచరిస్తున్నవి. కాని యీ లోషాలు యీనాడు కొత్తగా కలిగినవి కావు. ఇవన్నీ 1942 ఆగస్టు ఉద్యమానికి పూర్వమే ప్రబలి ఉన్నవి. ఈ ఉద్యమంలో యీలోట్లు అన్నీ నదరుగా బైటపడిపోయినవి.

కార్యక్రమాలను నిశ్చయించటానికి కాంగ్రెసు వెనుకాడదు. ప్రజల కార్యోత్సాహమూ కొద్దిపాటిదికాదు. కాని అందుకుతగ్గ సరియైన హంగు కాంగ్రెసుకు లేదు. ఉప్పెన వచ్చినట్టుగా ఉద్యమం వచ్చినప్పుడు ఆవేశభరితమై తల్లడిలటమేగాని కౌశల్యంతో మెలగగల సత్తా అంతగా లేకపోయింది.

ప్రతి ఉద్యమానంతరమూ కాంగ్రెసు నిశ్చయంగా బలపడినదే గాని ఉద్యమానికి ముందు అంత నిశ్చయంగానూ సన్నద్ధమై కాన్పించదు. ఇందుకు ముఖ్యహేతువు దేశం మొత్తం మీదను రాష్ట్రాలలోను కూడా యీ ప్రధాన విషయం పట్టించుకుని పనిచేసినవారు లేకపోవటమే-దీని అంతర్యముగాని, సవ్యమూ, సుస్థూ అయిన సంఘటన అంటే గాని ఆకళింపు అయిన పెద్ద లెందరో లేరంటే ఆశ్చర్యపడవలసినదిలేదు. "40 కోట్లమంది ప్రజలూ వద్దంటే యీ ప్రభుత్వం యెలా సాగుతుంది? ఏడు లక్షల గ్రామాలు స్వతంత్రంగా ఉండగల్గితే మరి కావలసిందేమిటి?" అని యీమొదలుగా అనేకం వింటూ ఉంటాము-కాని ఆ 40 కోట్ల మంది లోను ప్రతి ఒక్కడినీ అలా తయారుచేయడం 7 లక్షల గ్రామాలకు ప్రతి ఒక్క గ్రామాన్ని స్వతంత్రం చేయడం—ఇది కష్టసాధ్యమైన పని. అంటే అందుకు ప్రతి ఊళ్ళోను, ప్రతి వ్యక్తితోను గాఢమైన సంపర్కం ఉండి క్రమశః ఫలించాలి.

పూర్ణ స్వరాజ్య సంపాదనమే కాంగ్రెసు లక్ష్యము-వీలున్నప్పుడు ప్రభుత్వంతో సంప్రదింపులకు దిగటము. అవసరపడితే సత్యాగ్రహ పోరాటంచేయటము ఇది టూకీగా కాంగ్రెసు విధానమని ఉద్ఘాటించారు. సంప్రదింపులకు ఏకోశానా వీలు కన్పించదనేది గూడా గ్రహించారు. కనుక సత్యాగ్రహం శరణ్యం కాక తప్పదు—పోరాటం తప్పదు, ఆ వచ్చేపోరాటమే కడసారిది అంటున్నారు. కాని కడసారి పోరాటమని మాటలతోఉత్సాహపరచటమేగాక నిజంగా పోరాటమే వచ్చేప్పటికీ అంతతో గెలిచి దేశదాస్యాన్ని తుదముట్టించగల సామర్థ్య సన్నాహాలను చూపవలసి ఉంటుంది. ఇది లేకపోవటమే కాంగ్రెసుకు పెద్ద లోటుగా ఉన్నది.

కాంగ్రెసు నియమావళి ప్రకారం మనుష్యులు సమూహంగా కాపరముండే ప్రతి

వేలూరి సదానందం

# కాంగ్రెసు పునస్సంఘటన

చోటా ప్రతి గ్రామంలో, పట్నంలో వాడవాడకూ, తాలూకా జిల్లాలలో, రాష్ట్రాలలో కాంగ్రెసు సంఘాలు ఏర్పడాలి. మన ఆంధ్ర రాష్ట్రంవరకు చూస్తే ప్రతిగ్రామంలోను కాంగ్రె సభిమానులు ఉండవచ్చును గాని కాంగ్రెసు సంఘాలు మట్టుకు అనేక గ్రామాలకు లేవంటే అతిశయోక్తి కానేరదు. సాధారణంగా ఎన్నికల సంరంభంలోను, నాయకుల సంచార క్రమంలోను తప్ప ఆ గ్రామాలకేసి తిరిగి చూడటమే ఉండదు. ఇట్టిస్థితిలో బలం ఎలా వస్తుంది? 18 ఏళ్ళు నిండిన వారందరూ కాంగ్రెసు లక్ష్యమును ఒప్పుకొని సాలుసరి నాలుగణాలు చెల్లిస్తే కాంగ్రెసు సభ్యులు కావచ్చును. కాని 18 ఏళ్లు నిండిన జనాభాలో ఎన్ని లక్షలమందో ఇంకా కాంగ్రెసులో చేరవలసినవారుగానే ఉన్నారు—కాంగ్రెసు సభ్యత్వపు పద్ధతిలోఉన్న పెద్దదోషం ప్రాథమిక సభ్యులు కాంగ్రెసు సంబంధించినంతవరకు స్తబ్ధుగాఉండి పోవటమే—వారితో కాంగ్రెసు సంఘాలకు సభ్యులను చేర్చేసమయంలోగాని పనిపట్టదు-కాంగ్రెసు ఎన్నికలలో పాల్గొనే అభ్యర్థులు పోటీ ఏర్పడితే ఓట్లకై వెళ్ళినపుడు తప్ప కాంగ్రెసు వారి సంపర్కం ఉండదు.

ఓటు ఎంత ప్రధానమైనదో గ్రహించామే గాని ఓటు హక్కుకల వారలతో కాంగ్రెసుకు ఏపాటి సాంగత్యమున్నదో? ఎన్నికల సమయంలో తప్ప మరెప్పుడూ ఆ యావయే ఉండదు. ఓటు హక్కుగల వారినందరనూ కాంగ్రెసులో చేర్చగలిగితే ఎంతో ప్రయోజనమేకాని ఎంతవరకిది సక్రమంగా జరిగింది?

ఈ పనులన్నిటికీ మనుష్యులు ఎక్కువగా కావాలి. కాని మనుష్యులు లేక కాంగ్రెసు పని కుంటుపడిందనుకోను. ఆవిధంగా కాంగ్రెసుకు మంచి బలగమే ఉన్నది; కాని కాంగ్రెసు వ్యవహారాలు జరిగించేవారికి సంస్థాపనకు సంబంధించిన మూల విషయాల అవసరము బోధలేనందునే ఈచిక్కు వచ్చింది.

మూడేళ్ళనుంచి ప్రాథమిక సభ్యుడుగా ఉంటూ నిత్య ఖద్దరుధారియైనవాడు కాంగ్రెసు సంఘాలలో సభ్యుడుగా ఎన్నిక కావచ్చును. మరే అర్హతగాని అక్కర్లేదు. కాంగ్రెసు కార్యనిర్వాహకోద్యోగి కావచ్చును. ఈ సులభ మార్గంవలన ఎన్నో చోట్ల కాంగ్రెసు లక్ష్య విధానములు, విధి కర్తవ్యములు తెలియని వారు కాంగ్రెసు సంఘాలకు అధిపతులు కావటముతప్పక పోతున్నది. అట్టివారి హయాములో పను లెంతచక్కగా జరిగేదీ చెప్పనక్కరలేదు. కాంగ్రెసు సంఘాలు అలంకార ప్రాయంగా ఉంటూవచ్చినవి గాని ప్రజలను ప్రవర్తింపజేసే సంఘాలుగా ఏర్పడలేదు.

ఏటేటా ఎన్నికలు జరుగుతూ ఉన్నందున ఏడాదిలో చాలాభాగం కాంగ్రెసుకు ఆదరబాదరగా సభ్యులను చేర్పించడము, తగూలాడుకోవటము, ఎన్నికలు జరపటము మొదలైన స్వల్పవిషయాలతోనే సరిపోతున్నది గాని అంతకుమించి జరిగేది స్వల్పమే.

కాంగ్రెసు పెట్టుకున్న పనులు మాత్రం బోలెడున్నవి. అవి ఏ కొంతగానో జరుగుతూనేఉన్నవి కాని అనుకున్నంతగా జరగటం లేదు. పైన చెప్పినవన్నీ ఇందుకు కారణంగా చెప్పవచ్చును. కాంగ్రెసు సంఘాలు పరం

పరగా ప్రతి గ్రామంలోను, అన్ని తాలూకాలలో జిల్లాలలో అల్లికగా అల్లుకోవటం అవసరం-ఇది ఏ సంస్థకైనా మొట్టమొదట ఏర్పరచుకోవలసినపని. సరియైన కాంగ్రెసు సంఘాలు సర్వత్రా ఏర్పడిఉంటే అప్పుడు పిలుపుకు పలికేవాళ్ళు, వాకబు చెప్పేవాళ్ళు అంటూ కొందరు ఉంటారు. ఆపైన ఏ పని తలబెట్టినా వెంటనే హంగుకోసం తడుముకో నక్కరలేదు.

అయితే యీ సంఘాలు శాశ్వతంగా ఉండేవికావు. వీటిలోని సభ్యులు ఏటేటా మారిపోతూఉంటారు. వీరు అనేక హేతువులనుబట్టి వస్తూ పోతూ ఉంటారు. కాంగ్రెసు కార్యక్రమం మాత్రం నిరంతరం సాగుతూ ఉండవలసినది. అందుకు నిత్యమైన ఏర్పాటు ఉండాలి. మనుష్యుల మార్పుచేత పని కుంటుపడకూడదు.

ఇందు నిమిత్తం కాంగ్రెసుకు కర్మచారి గణం ఒకటి అవసరం. కాంగ్రెసుకు నిత్య కృత్యంలోఉండే పనులు యీ కర్మచారులు చేస్తారు. ఈగణం పూర్వపు హిందుస్తానీ సేవాదళము మాదిరి దేశమంతకూ లేదా రాష్ట్రానికీ రాష్ట్రానికీ ఏర్పడాలి. ఆంధ్రదేశంలో రాష్ట్రానికంతకూ ఒక్కటిగా ఏర్పడటం వీలు-చొరవజేసి జిల్లాలు చేసుకోదలిస్తే ప్రతిబంధక మేమీలేదు. ఈ గణంలో జేరే ప్రతి కర్మచారికి నెలసరి కొంత భృతి ఏర్పాటుచేయాలి. అది గణ్యతగా జరగాలిగాని అలక్ష్యంగాను అగౌరవంగాను జరగరాదు-అందరికీ ఒకటే పద్ధతిని కాక వారివారి కుటుంబావసరములను గ్రహించి వ్యక్తిగతముగా ఉపకృతిని ఏర్పాటు చేయవలెను- ఈ గణములో జేరువారు నిరంతర కాంగ్రెసు పరులుగా ఉంటారు.

గాంధీజీ వచ్చి సత్యాగ్రహోద్యమాలు నడపక పూర్వంనుంచి కూడా ఆంధ్రదేశంలో దేశానికై కష్టనష్టాలు పడినటువంటి వారున్నారు. అటువంటి పూర్వీకులుగాని అనంతరం ఉద్యమాలలో వచ్చినవారుగాని, ఇపుడు కొత్తగా రాదలచినవారుగాని అందరినీ కర్మచారి గణమునకు ఆహ్వానించవలెను. ఏజిల్లాలో గాని ఏ ఫిర్కాలోను ఉపేక్షించరాదు-కర్మచారుల విధికృత్యములేవో వివరిస్తూ ఒక కార్యక్రమము సమగ్రంగా తయారు చేయవలెను-అన్ని జిల్లాలనుంచి పిలుపందుకొని వచ్చేవారి ఉత్తరాలన్నీ జాగ్రతగా పరిశీలించి ప్రతివారి శీలమూ స్థానికంగా ఉండే పలుకుబడీ, శక్తిసామర్థ్యములు మున్నగునవిచూచి ఎవరు నివసించే ప్రాంతంలోనే వారిని నియమించవలెను-జిల్లాలోని గ్రామాలను, యీ వచ్చే కర్మణ్యులనుబట్టి ఒక్కొక్కరికి యిన్నిన్ని గ్రామాలని ఏర్పాటుచేయవలెను.

ఈ విధంగా కాంగ్రెసు కార్యవిభాగం జరిగితే నిరంతరమూ ఎలాటి భంగిమూలేకుండా కాంగ్రెసు నిత్య వ్యవహారం జరగి వీలుంటుంది.

ఈ కర్మచారిగణము చేయవలసిన పనులు వారు చక్కగాచేసే నిమిత్తము వారినందరనూ తర్ఫీతుచేయాలి. పాఠశాల ఒకటిపెట్టి, కర్మచారిగణము నెరవేర్చవలసిన కార్యక్రమ పాఠము లక్కడ బోధించవలెను. వచ్చిపోయే కాంగ్రె సధికారులవల్ల కర్మచారిగణమునకు ముప్పం కలుగరాదు.

ఈ పనిఅంతా కొంత కాలవ్యవధి ఏర్పరచుకొని ఆసమయంలో నెరవేర్చవలెను. ఇందుకు మూడేళ్ళ పరిమితి పెట్టుకోవటంవీలు. మొదటి సంవత్సరం ఇంత, రెండోసాలు ఇంత, మూడోసాలు ఇంత అని ఏర్పాటుగా కార్యక్రమం నెరవేర్చవలెను.

ఈ అసలు ఏర్పాటు జరిగితేగాని ఏ కార్యక్రమాలూ అమలు జరగవు. నిర్మాణ కృషి గాంధీజీకి అత్యంత ప్రియమని, అది నిర్వహించాలని దేశానికదే మోక్షదాయక మని భావిస్తున్నాము. కాని వాస్తవాని కది ఎక్కడా సరిగా అమలు కాలేదు. ఇందు నిమిత్తం ఆంధ్రదేశంలో కొన్ని సంస్థలు పనిచేస్తున్నవి. కాని అవి విఫలమైనవని ఒప్పుకోక తప్పదు. కాంగ్రెస్ కార్యక్రమం కేవలం రాజకీయమై పోయింది. నిర్మాణకృషి రాజకీయాలను విడనాడిన సేవగా పరిణ మించింది. ఈరెండూ ఒకు పాళ్ళలో కలిస్తేనే గాని సార్థకంకావు. నిర్మాణ కార్యక్రమానికి ఇన్నాళ్ళనుంచీ ఉన్న పెద్దలోటు సమగ్రత లేకపోవటం, రాజకీయాలను పరిత్యజించడం, కాంగ్రెసు నిర్వాహంలో ఉన్న పెద్దలోటు తన రాజకీయ కార్యక్రమానికి అనుగుణంగా నిర్మాణ కార్యక్రమాన్ని సంధించకపోవటము. ఉభయత్రా వైఫల్యం కలిగిందంటే చింతించ నక్కరలేదు. కాని ఇకముందు సవ్యంగా నడుచుకోవాలి.

ఇంకా రైతాంగమును, కార్మిక జనమును విద్యార్థిలోకమును సంఘటించవలసిన పని ఉన్నది. ఈవిషయంలో కాంగ్రెసు అవలం బించే విధానం ముందుగా నిశ్చయించుకోవాలి. కాంగ్రెసు తానై ఆ యావర్గాలకు వేరే సంఘాలు కొత్తగాపెడుతుందా? తన కనుకూ లంగా ఉన్నవాటిని సమర్థించుతుందా? సర్వ జనసంస్థగాఉంటూ జనాభాలో బాహుళ్యంగా ఉండే కార్మికరైతాంగ స్వభావాన్ని ఎక్కు వగా ప్రతిఫలింప జేసుకుంటుందా? ఇందులో యీ చివరచెప్పినది ఉత్తమమైన పద్ధతి తన కనుకూలమైన వర్గసంస్థలను కాంగ్రెసు అభిమానించవచ్చును గాక. కాని తన ప్రయోజనం కోల్పోయి వేరైన సంస్థలలో ప్రవర్తిస్తే కాంగ్రెసు జీర్ణించిపోతుంది. దేశం లోని రైతులకు, కార్మికులకు, దరిద్రులకు కాంగ్రెసే ప్రతినిధి. అలాగే ప్రవర్తించాలి. అలాగే సంఘటన పరచాలి. ఇలా విధాన నిరూపణచేసుకుంటే ముమ్ముందు కార్యనిర్వా హంలో తబావతులేమీరావు. లేకున్నట్లయితే ఆలాగని ముందుగా అనిపించకుండానే కాం గ్రెసులో అంతర్గత పార్టీలకు బీజమేర్పడు తుంది. కాంగ్రెసునే సర్వసమగ్రమైన ఏక సంస్థగా వృద్ధిచెయ్యాలి.

జరగవలసిన పనినిగూర్చి, పద్ధతులను గూర్చి యింకా యింకా చెప్పవచ్చును. ఓజ్మా త్రంగా పైన వివరించడమైనది.

సూత్రప్రాయంగా కర్తవ్య కార్యాలను ఇక్కడ పొందుపరుస్తాను.

1. కర్మచారి గణం ఒకటి ఏర్పడాలి సేవా దళమనండి, వలంటీరు దళమనండి. పేరేదై నప్పటికీ అట్టి ఏర్పాటు అవసరం. ఈగణం గ్రామ గ్రామంలోను ఏర్పడాలి.

2. కాంగ్రెసు సంఘాలు సర్వత్రా వెల వాలి.

3. మూడేళ్ళ పర్యంతంగా కార్యక్రమం ఏర్పాటుచేసికొని క్రమపద్ధతిని పనిచెయ్యాలి.

4. ప్రతి గ్రామంలోనుండే 18 ఏండ్లు నిండిన వయస్కుల నందరనూ కాంగ్రెసులో చేర్పను ప్రయత్నించాలి.

5. ప్రాథమిక కాంగ్రెసు సభ్యులతో నిత్యసాంగత్యముండే ఏర్పాటు చెయ్యాలి.

6. ఓటు హక్కుగల వారినందరినూ ఓటు జాబితాలో నమోదుచేయించి కాంగ్రె సులో చేర్పించాలి. ఓటర్లతో మరింతగాఢ సాంగత్యం ఉండాలి.

7. ప్రతిగ్రామంలోను గ్రామ కాంగ్రెసు సంఘమును ఆ గ్రామస్తులు తమదిగా భావించు కునేలాగున వృద్ధిచేయాలి.

8. గ్రామ, ఫిర్కా, తాలూకా, జిల్లా మహాసభలు ఒకపద్ధతిని రాష్ట్రమంతటా ఏర్పాటుచేసి ప్రతివారము ఎక్కడో ఒక ప్రాంతంలో మహాసభ జరిగేలాగున చూడవలెను.

9. కరపత్రాలు, చిన్న చిన్న పుస్తకాలు, మున్నగు వాటిద్వారా ప్రచారం విస్తారంగా జరిగే ఏర్పాటుచేయాలి. ఇందుకు రాష్ట్రింమీద కాంగ్రెసు ప్రచారణ సమితిపెట్టి ఎప్పటికప్పుడు ముఖ్య విషయాలపై ప్రజలకు సులభవుగా తెలిసేలాగున ప్రకటనలు చేస్తూ ప్రతి కుగ్రామానికీ చేర్పించాలి.

10. నిర్మాణకృషికీ కాంగ్రెసు సంఘాల సాతంత్ర్యమేయము లేకుండా జిల్లాలను ప్రాంతాలుగా విభజించి స్థానిక పరిస్థితులకు నిర్మాణ కార్యక్రమం ఎంతవరకు అన్వయమయేది విచారించి ఆ పనిపాటులు ప్రజలలో నుండే ఉద్భూత మయేలాగున చేయవలెను.

11. కాంగ్రెసు సంఘాలలో కార్యనిరతులు కాజాలనివారిని సహించకూడదు. కాంగ్రెసు సంస్థాపనలో అడుగునుంచి పైకి వెళ్ళేకొద్దీ యిందుకై విధినియమాలు బిగించుకుంటూ పోవటం అవసరం, అఖిల భారత కాంగ్రెసు సంఘ సమావేశాలకు వెళ్ళలేనివారు, హిందుస్థానీ భాష రానివారు సభ్యత్వం వదులుకోవాలి. కాంగ్రెసు సాధారణ సంఘాలలోని సభ్యులకన్న, కార్య సంఘ సభ్యులున్ను, వారికన్న కార్యదర్శి మొదలగు ఉద్యోగులున్ను హెచ్చుగా కాంగ్రెసు నైష్ఠికులూ కర్మిష్ఠులూ కావాలి.

ఇవి సామాన్య సూచనలు. ఏజిల్లాకు ఆ జిల్లా తీసికొని స్థితిగతులన్ని విచారించి, జరగవలసిన పని భారమెంతో, అది ఏలాటిదో, ఉన్న మనుష్యుల బలగం ఎంతో, అవన్ని చూచుకొని కార్యక్రమం నిర్ధారణ చేయవలసి ఉంటుంది. ఇది ఉపన్యాసాల వల్లను సంచారాలవల్లను, సర్క్యులర్ల వల్లను అయేదికాదు. ఇందుకోసం పూనుకొని పనిచేసేవారు ఉంటేనే అవుతుంది. పూర్వంలాగా ఆషామాషీ ప్రయత్నాలుచేసి మనమూ ఏదో చేశాములే, చేయకపోలేదు గదా అని తనివి జెందినట్లుగానే ప్రవర్తిస్తే ఇకముందు కుదరదు-సహించవలసినకష్టాలు, మోయవలసిన భారాలు, నిర్వహించవలసిన కర్తవ్యాలు ముందుముందు అనేకంగా రాక తప్పదు. అందుకై కాంగ్రెసు సంస్థను తీర్చిదిద్ది సజ్జీకరించాలి. రాష్ట్ర కాంగ్రెసు సంఘము, రాష్ట్రకాంగ్రెసు కార్యసంఘమూ ఆయావిషయాలన్నీ సాకల్యంగాను, సావకాశంగాను ఆలోచించుకొని స్థిమితంగా కార్యపద్ధతి నిశ్చయించుకొని కాంగ్రెసువారికి జనసామాన్యానికి కర్తవ్యం బోధించవలసి ఉన్నది. ఈసంఘాల సభ్యులు చిరకాల కారావాస క్లేశంవల్ల శరీర గ్లాని కలిగినా ఉత్కటమైన మానసోల్లాసంలో కొత్త ఊహలతో కొత్త ఆశలతో ఉత్సహిస్తున్నారు. రాష్ట్ర సంఘ సాధారణ సభ సమాలోచనలు జరిపి నిశ్చయార్థం తేల్చవలసినది పోయి కార్యసంఘ నిర్ణయాలకు తలలూపే ఆర్భాటసభ ఫక్కీ యిక పనికిరాదు-విధ్యుక్తం నెరవేర్చవలెను. కార్యసంఘము కూడా ప్రధానాంశములనే పట్టించుకొని నిజముగా కార్యపరమై సాధకంకావలెను.

ఈ రెండు సంఘాలూ ఆంధ్ర కాంగ్రెస్ చరిత్రలో కొత్తదశను ఆరంభించి భవిష్యత్తును ప్రశస్తంగా తీర్చిదిద్ది వచ్చేతరమువారి కృతజ్ఞతను ఆర్జించుకోవలెను.

# కల్లోల ప్రపంచం

యుద్ధం ముగిసింది. కాని, శాంతి ఏర్పడలేదు.

ప్రపంచ కల్లోలం సమసింది. అయినా, కల్లోలితమే నేటి ప్రపంచం.

ఎందువల్ల ?

ఈ ప్రశ్నకు సమాధానాన్ని చెప్పడం దీన్ని అడిగినంతటి సులభంకాదు. "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" అనే అంతర్జాతీయ రాజకీయ సూత్రంలోనే యీ ప్రశ్నకు సమాధానం చాలా వరకు యిమిడివున్నది.

నేను ఈమధ్యనే నా రేడియో ప్రసంగంలో పేర్కొన్నట్టు "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" అనే దాన్ని తెనిగించలేకున్నాము. కొందరు దీన్ని "సమతుల్యవిధానం" అని, "శక్తులతూకం" అని తెనిగించ యత్నించారు. కాని, ఈ తెనిగింపు అంత సనిగాలేదు. అందువల్ల ఈ "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" సూత్రాన్ని ప్రకృతి నుంచి కొన్ని ఉదాహరణలను పేర్కొనడం ద్వారా ఇక్కడ వివరించడానికి ప్రయత్నిస్తాను.

పెద్దచేప చిన్నచేపను ఇట్టే మింగివేస్తుంది. మరొక పెద్దచేపజోలికి అది పోదు.

పిల్లి ఎలుకపైకి దూకి, దాన్ని నోట కరుస్తుంది. మరొక పిల్లిపై అది అంతటి సాహసాన్ని చెయ్యదు.

ఒక పెద్దజీవి ఒక చిన్నజీవాన్ని మట్టుపెట్టడానికి సంకోచించక పోవడానికి కారణం, — ఆ రెండింటి మధ్య "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" లేకపోవడమే. ఇక, ఒక పెద్ద జీవం తనతో సరిసమాన శక్తిగలదాని జోలికి పోకపోవడానికి కారణం,—వాటిమధ్య "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" ఉండడమే.

దీన్నే మరొకవిధంగాకూడా చెప్పవచ్చు. "బలవంతునిదే రాజ్యం" అని అంటారుగదా? కాని, బలవంతుని రాజ్యం ఎవరి పైన ? బలహీనులపైమాత్రమే. సమాన బలవంతుల మధ్య ఒకరిపై ఒకరు రాజ్యంచెయ్యడం పొసగనే పొసగదు. అంటే, సమాన బలవంతులమధ్య "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" వుంటుంది.

ఇంతకంటె "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" సూత్రాన్ని వివరించనక్కరలేదని అనుకుంటున్నాను.

"ఇది చూడగా, అరణ్యానికి వర్తించవలసిన సూత్రంవలె, ఆటవికులు పాలించవలసిన ధర్మంవలె వున్నదే !" అని మీరు అనవచ్చు. నిజమే ! ఇది అట్టిదే ! ఈవిషయాన్ని అంగీకరించడం నాగరీకులమని భావించుకునే మనకు చాలా కష్టంగా వుండవచ్చు. కాని, కళ్ళు మూసుకున్నంత మాత్రాన నిజం కల్లగాదు గదా ?

"బలవంతునిదే రాజ్యం" అనేది జాతీయ జీవితరంగంనుంచి తొలగిపోయి వుండవచ్చు. కాని, అంతర్జాతీయ రాజకీయరంగంలో దీని ప్రాబల్యం ఎంతమాత్రం తగ్గలేదు.

నార్ల


ఏదైనా ఒక దేశం అధిక బలోపేతమైన వెంటనే అది తన ఇరుగుపొరుగు వాటిపై రాజ్యాన్ని చేయడానికి ప్రయత్నిస్తుంది. ఈ




ప్రమాదాన్ని నివారించుకోవాలంటే, ఇరుగు పొరుగు రాజ్యాలుకూడా సమాన బలోపేతమై వుండాలి. దీని తాత్పర్యం,—అది "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" కోసం ప్రయత్నించాలని. ఈ విధంగా "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" వుంటేనే వాటిమధ్య శాంతి; లేకపోతే యుద్ధమే. "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" వల్ల శాంతిని సాధించడం వాస్తవానికి అనాగరిక పద్ధతే అయినా, అది లేనప్పుడు యుద్ధం తప్పనందున, అదే ప్రస్తుతం ప్రపంచ రాజకీయ వేత్తల లక్ష్యమౌతున్నది.

అయితే, "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" అస్థిరమైనట్టిది; చంచలమైనట్టిది. అందువల్ల ప్రపంచశాంతికూడా అస్థిరంగా, చంచలంగా వుంటున్నది. నేడు మానవజాతి లక్ష్యం సుస్థిర ప్రపంచశాంతి అయితే, అది "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" వల్ల లభ్యంకావడం కలలోనివార్త. ఎంచేతనంటే, సుస్థిరశాంతి ఆసూత్రపు స్వభావానికే విరుద్ధం.

సుస్థిరశాంతిని గురించిన అభిలాష ఒక్కటేకాకుండా, "బ్యాలెన్స్ ఆఫ్ పవర్"ను అంతర్జాతీయ రాజకీయ రంగంలో వర్జించాలనడానికి మరొక కారణంకూడా వున్నది. పెద్దచేప చిన్నదానిని మ్రింగవలసిందే. లేకపోతే, పెద్దచేప ఆకలితో మాడిచావాలి. పిల్లి ఎలుకను పట్టవలసిందే. లేకపోతే, దాని కడుపునిండదు. ఇదేవిధంగా కొన్ని శతాబ్దాల క్రితం ఒకదేశం మరొకదేశాన్ని దోచుకు తినడం, ఒకజాతి మరొకదాని రక్తమాంసాలను పిండడం అవసరమై వుండేదేమో! కాని, ఈనాడు భౌతిక జగత్తుపై మానవుడు సాధించిన ఘనవిజయ ఫలితంగా, సమస్త మానవ జాతి సుభిక్షంగా, సంపత్కరంగా జీవించడం సుసాధ్యమౌతున్నది. అయితే, పూర్వపు వాసనలు పోలేదు; పాత సాంఘిక వ్యవస్థ మారలేదు. అంచేతనే ఒక జాతి దాస్యంద్వారా మరొకటి తనశక్తిని సాధిస్తున్నది; ఒకదేశం దైన్యంపై మరొకటి తన సంపత్తి సౌధాన్ని నిర్మించుకుంటున్నది. అందువల్లనే "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" ఈనాడు సయితం ప్రపంచ రాజకీయాలకు ప్రాతిపదికగా వున్నదికూడా.





వర్సయిల్స్ సంధిపత్రంద్వారా ఏర్పరచబడిన "బ్యాలెన్స్ ఆఫ్ పవర్"కు రహస్యంగా ఆయుధసేకరణ కార్యక్రమాన్ని కొనసాగించడంద్వారా, రైన్‌లాండ్, ఆస్ట్రియా, జెకొస్లొవాకియాలను కబళించడం ద్వారా, ఇటలీ, జపానులను తనవైపుకు తిప్పుకొనడం ద్వారా నాజీనియంత హిట్లర్ భంగంకలిగించాడు. కేవలం భంగంకలిగించడమేకాదు. తాత్కాలికంగా దాన్ని తనకు అనుకూలంగా మార్చుకొనగలిగాడు కూడా. అందువల్లనే అతడు 1939 లో యుద్ధాన్ని ప్రారంభించి, 1942 వరకు విజయం తర్వాత విజయాన్ని సాధించగలిగాడు.

హిట్లర్ ప్రాబల్యంతో భగ్నమైపోయిన "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" హిట్లరేమి—అతడితో పాటు ఇటలీ, జపానులేమి—పరాజయాన్ని చెందినా, ఇంకా తిరిగి కుదటబడలేదు. నేడు ప్రపంచం కల్లోలితంగా వుండడానికి ఇదే కారణం.

"బ్యాలెన్స్ ఆఫ్ పవర్" సమస్యదృష్ట్యా నేడు ప్రపంచం మొత్తంపై ఎన్నదగిన రాజ్యాలు మూడే. ఇవి అగ్రరాజ్యత్రయం అని పేర్కొనబడుతున్న యునైటెడ్ స్టేట్సు, గ్రేట్ బ్రిటన్, సోవియెట్ రష్యాలే.

మానవజాతికి సుస్థిరశాంతిని వాగ్దానం చేసి, ఆ వాగ్దానంపైనే ద్వితీయ ప్రపంచ మహా సంగ్రామంలో విజయసాధనకు మిత్రరాజ్య పౌరులచే రక్తనైవేద్యాన్ని పెట్టించి, తిరిగి "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" ప్రాతిపదికగా అంతర్జాతీయ రాజకీయాలను నిర్వహించ బోతున్నట్టు కనబడితే, అప్పటి కింకను జపానుపై సాగవలసిన యుద్ధసందర్భంలో చిక్కులు రాగలవని శాన్‌ఫ్రాన్సిస్కో సమావేశంలో "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" సూత్రాన్ని మభ్య రచడానికి అగ్రరాజ్యత్రయం కొంత యత్నంచేసింది. ఈ యత్నంలో ఆ రాజ్యత్రయం పూర్తిగా కృతకృత్యం కాలేకపోయినా, మిత్రరాజ్యసమితి ప్రణాళికను ఒకదాన్ని నిర్ణయించడంద్వారా సుస్థిర శాంతికి వాస్తవిక ప్రాతిపదికలు క్రమక్రమంగా నిర్మించబడగలవేమో నన్న భ్రమను కొందరికైనా కలిగించింది.



కొత్త త్రిమూర్తులు

... కాని, జపాను పరాజయం ముగిసినంతనే, నటనకు స్వస్తి చెప్పబడింది; ప్రాబల్య సాధనకు నగ్నయత్నం ప్రారంభించబడింది.

యునైటెడ్ స్టేట్సు, సోవియెట్ రష్యా, గ్రేట్ బ్రిటనులలో దేనికి ఏ యే కీలక స్థానాలపై అధికారం వుండాలి? దేనికి ఏ యే దేశాలపై పలుకుబడివుండాలి? దేనిది ఎక్కడెక్కడ పై చెయ్యిగా వుండాలి? ఇవే ఇప్పటి వివాదం; ఇదే ఇప్పటి ఆందోళన; ఇవే ఇప్పటి కల్లోలం.

ఈ వివాదంలోకి ఈ ఆందోళనలోకి, ఈ కల్లోలంలోకి ఇప్పుడు ఇక కొత్త క్లిష్ట పరిస్థితి ప్రవేశించింది కూడా.

"బ్యాలెన్స్ ఆఫ్ పవర్"ను నిలబెట్టడానికి నిన్న, మొన్నటివరకు సైనిక, నౌకా, వైమానిక బలాలే, సైనిక, నౌకా, వైమానికాస్త్రయాలే ముఖ్యసాధనాలు. కాని, ప్రళయం బాంబును కనిపెట్టడంతో పరిస్థితులు మారిపోయినవి. ఇంతకు పూర్వపు సాధనాలు ఇప్పుడైనా కేవలం శుష్కప్రాయమైపోలేదు గాని, వాటిప్రాబల్యం చాలా తగ్గింది.

— కాగా, ప్రళయం బాంబునిర్మాణ రహస్యం ఈనాడు అగ్ర రాజ్యత్రయంలో బ్రిటన్, యునైటెడ్ స్టేట్సులకే తెలుసు. మరికొన్ని నెలల్లో, సంవత్సరాలోగడి స్తే సోవియెట్ రష్యా కూడా ప్రళయంబాంబు నిర్మాణ రహస్యాన్ని కనిపెట్టవచ్చు. కాని, ఈలోపున తమకు లభ్యమైన ప్రత్యేక శక్తిసంపదను తమకు అనుకూలంగా వినియోగించుకొనడానికి బ్రిటన్, యునైటెడ్ స్టేట్సులు పూనిక చూపుతున్నాయి. సోవియట్ రష్యాకు తాము ప్రళయంబాంబు నిర్మాణరహస్యాన్ని తెలపబోమని ఇవి అనడంలోగల కీలకం ఇదే.

ప్రళయంబాంబుకు సంబంధించినంతవరకు బ్రిటన్, యునైటెడ్ స్టేట్సులమధ్య ఏకాభిప్రాయం వున్నప్పటికీ, అవి ఒక్కత్రాటిపైనే నడుస్తున్నాయని అనుకోడానికి వీలులేదు. అగ్ర రాజ్యత్రయంలో యుద్ధకారణంగా ఆర్థిక




బ్రిటిషు పాలసీ

రూపంలో ఎక్కువగా చితికిపోయింది గ్రేట్ బ్రిటనే. యుద్ధానికి పూర్వం అది ఎంత భాగ్యవంతమైనదో నేడు అంత ఋణగ్రస్తమైనదైపోయింది. ఈ దుస్థితినుంచి బయటపడాలంటే, అది తన ఎగుమతుల వ్యాపారాన్ని పెంపొందించుకోవాలి. ఇందుకు ముందుగా చాలా పెట్టుబడి అవసరం; ఆపిమ్మట మార్కెట్టులు అవసరం. కాని, అమెరికా ఆర్థిక వ్యవస్థకుకూడా మార్కెట్టులే ప్రాతిపదిక. ఈకారణాన ఈ రెండింటికి వైరుధ్యం తప్పడంలేదు. బ్రిటన్ అడిగినఅప్పును అమెరికా యివ్వడంలో ఇంతగా విలంబనం జరగడానికేమి, చిక్కు తర్వాత చిక్కు ఏర్పడ్డానికేమి, ఈ వైరుధ్యమే కారణం.

కాగా, తాను అగ్రరాజ్యత్రయంలో భాగస్వామిగా వున్నా, తనస్థానం తక్కిన రెండు రాజ్యాల తర్వాతనేనని బ్రిటన్‌కు చక్కగా తెలుసు. ఒంటరిగా తాను యునైటెడ్ స్టేట్సు, సోవియెట్ రష్యాలతో తూగలేకపోతున్నందున, పశ్చిమ యూరోపియన్ రాజ్యాలకూటమిని నిర్మించి, దానికి నాయకత్వం వహించడానికి బ్రిటన్ ప్రయత్నిస్తున్నది. పశ్చిమ యూరోపియన్ రాజ్యాలలో ప్రధానంగా ఎన్నదగినవి ఫ్రాన్సు, హాలెండులే. ఈ రెండిటికి బ్రిటన్‌కున్నట్టే పెద్ద పెద్ద సామ్రాజ్యాలున్నాయి. ఈ మూడింటి మధ్య పరస్పర సహకారం ఏర్పడితే, పరస్పర సహకారంతో ఇవి తమ తమ సామ్రాజ్యాలను పదిలపరచుకొనగలిగితే, ప్రపంచంలో దాదాపు సగం వీటి అధీనంలో వున్నట్టే. అప్పుడు ఈ సామ్రాజ్య త్రయ నాయకత్వంతో గ్రేట్ బ్రిటన్ అగ్రరాజ్యత్రయంలోని ఇతర రెండు రాజ్యాలతో సరితూగగలదు.

పై విషయాన్ని దృష్టిలో పెట్టుకుంటే, ఇండోచైనాలో, ఇండొనీషియాలో ఫ్రెంచి, డచ్ సామ్రాజ్యాల పునరుద్ధరణకు బ్రిటన్ ఎందుకు కంకణం కట్టుకున్నదో బోధపడగలదు. ఇండియా, సింహళం, బర్మా, మల

యాలను తన ఇనుప గుప్పిటనుంచి అది ఎందుకు జారిపోనివ్వడం లేదో కూడా సువేద్యం కాగలదు.

"బ్యాలెన్స్ ఆఫ్ పవర్" లక్ష్యంగా గల అగ్రరాజ్యత్రయం ఆడుతున్న చదరంగంలో ఇండియా, సింహళం, బర్మా, మలయా, ఇండో-చైనా, ఇండొనీషియా, చైనా, మంచూరియా, కొరియా, పాలస్తీనా, సిరియా, లెబనాన్, పర్షియా, గ్రీసు, ఆస్ట్రియా, బాల్కన్ రాజ్యాలు, ఇటలీ, జపాన్ సామ్రాజ్యాలు, జర్మనీ—ఇవి అన్నీకూడా కేవలం పావులే!

ఈ ఆట ఏదో ఒక కొసకు రావచ్చు; "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" తిరిగి నెలకొనవచ్చు. కాని, తద్వారా ప్రపంచానికి విద్ధించగల శాంతి తాత్కాలికమైనదే కాగలదు.

బ్రిటన్, యునైటెడ్ స్టేట్సులతోపాటు నేను ఈ సందర్భంలో సోవియెట్ రష్యాను పూర్తిగా జత చెయ్యడంలేదు. వలసరాజ్యాల విషయంలో, పరాధీన జాతుల విషయంలో, ప్రజాప్రభుత్వాల సంస్థాపన విషయంలో అది న్యాయమైన, ధర్మమైన సూచనలనే చేస్తున్నది. కాని, వన్యమృగాలమధ్య సాధుజంతువు జీవించడం కష్టమని సోవియెట్ రష్యాకు తెలుసు. అంచేత అది ఆత్మరక్షణకై జాగరూకత వహించక తప్పడంలేదు.

సింహావలోకనంచేసినప్పుడు ఇదే నేటి కల్లోలిత ప్రపంచ సమగ్రచిత్రం.

## కాంగ్రెసుకే మీ ఓటు ఇవ్వండి

'గడచిన పాతిక సంవత్సరాల్లో స్వాతంత్ర్యంకొరకు కాంగ్రెసుచేసిన పోరాటపుగాథ చూస్తే, భారతదేశంయొక్క పూర్ణస్వాతంత్ర్యంకోసం, ఈ నలభయికోట్లప్రజల సుఖ, సంపత్తులకోసం, దేశంలో ఏ రాజకీయ సంస్థ పాటుపడుతున్నదీ తెలుస్తుంది.

కాంగ్రెసు దేనికై పెనగులాడుతోందో, ఆ స్వరాజ్యం దేశమంతది ఒక ప్రత్యేకవర్గంయొక్క గాని, పార్టీయొక్కగాని స్వరాజ్యంకాదది. భారతదేశంలో ప్రజలందరి స్వాతంత్ర్యమే కాంగ్రెసు అభీష్టం.

హిందువులు మహమ్మదీయులపై ఆధిపత్యం, నిరంకుశత్వం చెలాయిస్తారనుకోటం భ్రమ. ఆ మాటకువస్తే, ఏ ఒకవర్గమూ ఇంకొక వర్గముపై అలా చెలాయించటం అసంభవం.'

—పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ

# జయ్ హింద్

ఈనాడు ఆజాద్ హింద్ ఫౌజంటే తెలియనివారులేరు. ప్రతిరోజూ, ఒకొక్క కొత్త విషయం, ఒకొక్క సాహసకృత్యం వారి గురించి చెప్పబడుతూంది. ఢిల్లీ "రెడ్‌ఫోర్టు" లో ఈనాడు జరుగుతూన్న వారివిచారణలు గాంధీనెహ్రూల ప్రఖ్యాత అహమ్మదాబాద్, గోరక్‌పూర్ విచారణలంత పేరుగాంచినాయి. అనేకమంది మాజీహైకోర్టు జడ్జీలు, సర్ తేజ్ బహదూర్ సప్రూ, భూలాభాయ్ దేశాయి, అసాఫాలీ మొదలైన ప్రముఖ న్యాయవాదులు, వారినిసమర్థించిందికి సంసిద్ధులైనారు. ముప్పై యేళ్ళనుండి న్యాయవాది వృత్తినుండి విరమించుకున్న పండిత నెహ్రూకూడా తిరిగీ బారిష్టరుగౌను ధరించాడు. ఢిల్లీనుండి ధనుష్కోటివరకూ యావత్‌భారతదేశం, ఈ స్వాతంత్ర యోధుల్ని శిక్షించకూడదని తీర్మానించింది.

ఆజాద్ హింద్ ఫౌజు స్థాపించినవాడు నేతాజీ సుభాస్‌చంద్రబోసు. చిన్నవయస్సు నుండి బోసుకి, సైన్యమన్నా, దేశస్వాతంత్రం కోసం ఆయుధాలతో పోరాటమన్నా చాలా సరదా. కాంగ్రెసులోకూడా వాలంటీర్లకు, దేశసేవికలకు, కవాత్ చెప్పడమంటే అతనికి విపరీతమైన ఉత్సాహం. గుర్రంమీద నెక్కి కాంగ్రెసు వాలంటీర్లను పరీక్షిస్తూన్న వాలంటీర్‌దళ నాయకుడు సుభాస్‌బోసు, కాకినాడ కాంగ్రెసు చిరస్మరణీయ దృశ్యాలు అందరికీ తెలిసినవే. తరువాత బోసు, భారతదేశం విడిచి వెళ్ళికూడా, భారత స్వాతంత్రం గురించి తీవ్రంగా పనిచెయ్య దలచాడు. అతను జపాన్ సహాయాన్ని అర్థించటం, అంగీకరించక పోయినా కాంగ్రెసు, సుభాస్‌బాబు స్వాతంత్ర కాంక్షను కొనియాడింది. సింగపూరు, మలయా జపానువారి వశమైన తరువాత, వేలకొలది బ్రిటిష్ యిండియన్ సైనికులు జపానీయుల వశమైయ్యేరు. వారందరినీ, యుద్ధ ఖైదీలగా నుంచలేమని, వారికి కావలిసిన ఆహారపదార్థాలు తమ అందుబాటులో లేవని జపాన్‌వారు ప్రకటించారు. ఆ సమయంలో నేతాజీ బోసు ఆజాద్ హింద్ ఫౌజు స్థాపించాడు. లొంగిపోయిన బ్రిటిష్ ఇండియన్ సైనికులకు, ఆజాద్ హింద్ నాయకుడు మోహన్ సింగ్, ఆజాద్ హింద్ ఫౌజులో చేరి భారత స్వాతంత్ర్యాన్ని సాధించమని హెచ్చరించినప్పుడు, వారి ఆనందానికి మేర లేదు. ఇంతవరకూ స్వాతంత్ర్యంకోసం పోరాడడమంటే తెలియని వారిఆత్మలు, స్వాతంత్ర కాంక్షతో స్పందించాయి. ఆజాద్ హింద్ ఫౌజు పతాకం, మన జాతీయ త్రివర్ణ పతాకం. ఈ సేనకు జపాన్‌వారు ఆయుధాల నమ్మేరు. ప్రజలనుండి చందాల మూలంగా సుభాస్ బాబు కోట్లకొలది ధనం ప్రోగుచేశారు. ఒకసారి అతన్ని బంగారంతో తూచి, ఆ ధనం ఆజాద్ సేనకు అర్పించారట. ఒక స్త్రీల సైనికదళంకూడా, ఝాన్సీ రాణీ రెజిమెంటన్నపేర యేర్పరుపబడ్డాది. దానికి శ్రీమతి అమ్ముస్వామినాథన్ కుమార్తె లక్ష్మి ఆధిపత్యం వహించింది. ఈ వీరవనితలు, భారత స్వాతంత్ర్యంకోసం, తమ ప్రాణాలైనా

జి. సూర్యనారాయణ.

తెగించి పోరాడుతామని తమ నిశ్చయాన్ని తమ స్వంత రక్తంతో లిఖించి సుభాస్ బాబుకి పంపేరట.

జపాన్ ఓడిపోతూన్న సమయంలో, జపాన్‌వారు ఆజాద్ సేనను తమ స్వంత లాభంకోసం, బానిస సైన్యంలా ఉపయోగించ దలచేరు. ఆ సమయంలో జపాన్ ప్రభుత్వానికి ఆజాద్‌సేనకు భేదాభిప్రాయాలు, మనస్పర్ధలు కలిగేయి. జపాన్ ప్రభుత్వాన్ని స్థాపించటం కాదనీ, యిప్పుడున్న పరప్రభుత్వాన్ని తొలగించి, భారత దేశాన్ని స్వతంత్ర దేశంగా చేయటమే తమ ఆశయమని, ఆజాద్ సేన దృఢంగా చెప్పింది. తనకు బ్రిటిష్ వారెంతో, జపాన్‌వారూ అంతేనని సుభాస్ తెలియ చేశాడు. ఇవన్నీ జపాన్ వారికి రుచించలేదు. కొందరు ఆజాద్ హింద్ నాయకులను నిర్బంధించారు కూడా. ఆ సమయంలోనే ఆజాద్ సేన రద్దుచేయబడింది. సుభాస్ బాబుని, ఆజాద్ సేనను జపాన్ యేజంట్లన్న వారికి, యిదే జవాబు.

ఈనాడు, ప్రథమ విచారణలో, కేప్టన్ గుర్‌బక్ష్ సింగ్ ధిలియాన్, షానవాజ్‌ఖాన్, పి. కె. షేగల్‌ని, రాజద్రోహ నేరంక్రింద విచారిస్తున్నారు. ఈ విచారణ నవంబరుఅయిదు (గైఫాక్సు కుట్ర దినం) నాడు ఆరంభమయింది, 15 రోజులు ఆగి, తిరిగీ గత 21 నుండి ఆరంభమయింది. మొత్తంమీద దాదాపు 400 మంది దాకా విచారించబడతారు. ఈ సందర్భంలోనే వైస్రాయి వేవెలు, సేనాధ్యక్షులు అకిన్‌లెక్, జపాన్ సేనానాయకులు, కూడా సాక్ష్యమిస్తారు. ఇదిగాక మలయా, బర్మాల్లో అనేకమంది ఆజాద్‌సేనవారు నిర్బంధించబడియున్నారు. వీరందర్నీ సమర్ధించిండీకి కాంగ్రెసు యేర్పాట్లుచేస్తూంది.

కాంగ్రెసు వాదన యేమిటంటే, ఆజాద్ సేన భారతదేశానికి, భారతీయులకు శత్రువులు కారు. జపాన్‌కు సహాయార్ధం కాదు వారు పోరాడింది, భారతదేశాన్ని దాస్య శృంఖలాల నుండి తప్పించిందికి. వారు జపానునుండి అర్థించిన సహాయం, తప్పిస్తే వారుకూడా జాతీయవాదులే. జీతంకోసం కాదు వారు ఆజాద్ సేనలో చేరింది, ఉత్తమోత్తమ ఆదర్శాలకోసం.

బర్మాలోను, యితర జపాను ఆక్రమిత దేశాల్లోను శత్రువుతో కలిసి తమ నెదురించిన వారిని బ్రిటిష్‌వారు క్షమించారు. బర్మాలో బర్మాజాతీయ సైన్యాన్ని, తమ సైన్యంలో చేర్చుకున్నారు. కాని భారతదేశంలో, వీరిని విచారించి శిక్షిస్తామంటున్నారు. దీనికి కారణం, వీరు జాతీయవాదు లవడమో ఇతర శత్రు యేజంట్లవలె శత్రువుకు సహాయంకోసం కాక, తమ దేశ స్వాతంత్రంకోసం పోరాడటమే. ఇదీగాక యిటువంటి సేనను విచారించిందికి, ప్రజా సానుభూతిలేని, నేటిప్రభుత్వానికి అధికారంలేదు. జాతీయప్రభుత్వానికే ఆ అధికారం ఉంది. దేశంలో నున్న ప్రతిపార్టీ, చివరకు లీగు, జస్టిస్, కమ్యూనిస్టు పార్టీలు కూడా, వీరిని శిక్షించటం అక్రమమన్నారు. ఆసేతు మాచల పర్యంతం ప్రజానీకం, ఐక్యకంఠంతో వారివిడుదలని వాంచించింది. ఇటువంటి సమయంలో వారిని శిక్షించటం, భారత ప్రజల్ని పురిగొల్పటం అవుతుంది.

ఆజాద్‌సేన నినాదం "జయహింద్" "ఢిల్లీచలో" అన్నకేకతో వారు ఇంఫాల్ వద్ద పురోగమించారు. మొట్టమొదట, స్వతంత్ర భారతభూమిమీద జాతీయపతాకాన్ని ప్రతిష్ఠించిన వాడు, ముస్లిం యువకుడు కేప్టెన్ షానవాజ్‌ఖాన్. ఇదే బ్రిటిష్‌ప్రభుత్వానికి, జిన్నాగారికి తలనొప్పి. అంతేగాక లీగు సహాయం తనకవసరం లేదని, నిరాకరించేడితను.

# చాటువులు

కల భూలోకము చాల కింకఁ గుజలోకంబందుఁ గాల్వెట్ట త్రో
వలఁ దీయంగను సిద్ధమై యమెరికా వారుండఁగా నేడు తీ
తలపైఁ దీతలఁ దీయ నిద్దురల మీఁదన్ నిద్దురల్ దీయ చా
యల వీక్షింతె యొకింత రాటమునఁ దీయన్ లేక దారమ్ము నేన్.

ఎట్టుల్ వెన్కకు వెన్కకున్ జరిపి నిన్నిత్త్వాకు కాలానకున్
నెట్టన్ జూచుచు నున్నవో చదువు సందేల్ లోన గుర్తింపరా
కట్టుం బాటుల నెల్ల మార్చుకొనరా కాలానురూపమ్ముగా
జుట్టుం బొట్టెటు నున్న నేమి తెలివిన్ శూన్యమ్ము గానీకురా.

జవనాశ్వంబటు జాతులెల్ల పరుగుల్ సాగించుచుండంగ ము
న్నెవరుం జేరని దివ్య సీమలకు ఓరీ పంచకల్యాణి నీ
సవిధం బందున నుండిగూడ పయనించన్ నేరకున్నావురా
నవు పుట్టించుర తప్పకుండ నెవరైనన్ విన్న నా సోదరా!

సెంటుంజే నని యున్నచో నితర దేశీయుండు పండించు, ఆ
పంటన్ నీవె కరమ్ము నందునయినన్ పండింపఁగా లేక డీ
ల్బంటాయంచును దున్నకుండఁగనె నీవారమ్ము పండింపగా
వంటల్ వార్పులు లేక కూడు దినఁగా వాంఛించు చున్నాఁడవా.

గాయత్రింబలె వెన్ను గాచుకొని నిన్ గాపాడు కాంగ్రెస్సు మా
టే యీ వెత్తవె గాంధి తారకపు సూటిన్ సైతమున్ జూచుకో
వే యేమర్లుచు నున్నవాఁడవె పటేల్ వీరాంజనేయమ్ము నే
పాయంబోకుర పుణ్యమాయె జవహర్ జ్వాలా నృసింహమ్ము నేన్.

మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి

# సిరిసిరిమువ్వ శతకము

## ఇష్టదేవతా ప్రార్థనము

ధ్యానమున కోరి భజింతున్
తెనాలి రామున్, ప్రగల్భ ధీ నిస్సీమున్,
ధ్వనిరాజ్య సార్వభౌము, రు
చి నిరుపమ కవిత్వధాము సిరి సిరి మువ్వా!

ఏడీ కవిగాఁడీ భువి,
గాడిద యేడుపును పాడ గలిగిన వాడౌ
చౌదప్ప కీడు? కర ని
ష్పీడన కర్తృండు లేడు సిరి సిరి మువ్వా!

అట్టలకు నడుమ మాత్రమె
ద్రష్టవ్యుడు కాని మనకు తక్కొక్కయెడ చూ
పట్టు దెవ దట్టి టిట్టిభ
పెట్టి నెదన్ బెట్టి కొలుతు సిరి సిరి మువ్వా!

అమలిన మనస్కతన్ ధ్యా
న మొనర్తును గద్య పద్య నానా విధ లా
స్యములన్ హాస్య మొలుకు కూ
చిమంచి జగ్గకవి పలుకు సిరి సిరి మువ్వా!

శ్రీరంగం శ్రీనివాసరావు

నవ యువకులకు నమూనా
కవియైన గిరీశ మకటకట ! సంమోహ
ద్రవముల సవరణ కా సిం
చి వెల్లకిల బడుట దలతు సిరి సిరి మువ్వా !

జంఘాల శాస్త్రిఁ, మానవ
సంఘాల వ్రణాలపాలి శస్త్రిన్, స్తుత్యు
ల్లంఘన వాగ్రచనల మే
ఘ్రం ఘన భక్తిన్ స్మరింతు సిరి సిరి మువ్వా !

క్షితిలో బారిస్టరు పా
ర్వతీశమును చెప్పి పిదప పలుక వలెఁ గదా
కితకితల కితరులను భా
సిత సిత సుశ్లోకు దతడు సిరి సిరి మువ్వా !

అల కృష్ణశాస్త్రి వేమన
మెలకువ లాధునిక ఫణితి మెరపించుటచే
సులువయ్యెను నా కుభయుల
చెలిమి యొకే పద్యమందు సిరి సిరి మువ్వా !

"చుళుకీకృత కాఫీ టీ
జలనిధి" యనిపించుకున్న జల సూత్రం శా
స్త్రుల పాలాస్త్రులు కడు విల
సిలుత తెలుగు కురుపు మీద సిరి సిరి మువ్వా !

జీవిత మొక యాగముగా,
భావన మొక యోగముగ, స్వభావము భోగా
భోగముగ తిరుగు తిరుపతి
జేగురు గడ్డము నుతింతు సిరి సిరి మువ్వా !

(గమనిక: 3-10 పద్యాలలో ప్రాసపద్ధతి బుద్ధిపూర్వక ధిక్కృతి.
10. జేగురుగడ్డం ఎందుకంటే నాకళ్ళ కది ఎర్రగా కనిపిస్తుంది కాబట్టి.)




అనువృత్తము

"సాధుపుంగవ! పరుల కష్టాలు చూచి
ఓర్వజాలని కరుణాపయోధి నాదు
జనకు డతిబుద్ధిశాలి సజ్జనుడు కనక
గౌరవమ్ములు గలవాడు; వారి నెరుగ
నట్టివారలు నహి మిలన్ పట్టణమున.
ఏ ముహూర్తాన నేను జన్మించినానొ
అమ్మ కరువయ్యె చిన్నతనమ్మునందె
నాటినుత కన్నతండ్రి యంకమ్మునందె
ఆడుకొంటిని పదములు పాడుకొంటి
దేశమిప్పటి వలెనె విదేశ జనుల
ఘోర దౌర్జన్యముల క్రుంగి కుములుచుండె
నాదుజనకు డేవో ప్రయత్నములు చేసి
ప్రజల కడగండ్లు వాపి కాపాడుచుండె.
స్వార్థపరులైన రాజసేవకులు కడుపు
రగుల నేవేవొ లేని నేరములు పన్ని
న్యాయసభ కీడ్చి కూట సాక్ష్యములు చెప్పి
ఖైదు జేయింప జూచిరి. కాని వారి
ఆశలన్నియు తుద కడియాసలయ్యె.
న్యాయమార్గమ్ము విడచి న్యాయాధికారి
లంచము గ్రహించి రుజువుకు రాని నేర
ములను మా తండ్రి తలమోపి అలవిగాని
పెద్ద జరిమానవేసె-మా పెద్దరికము
మాసె - మా తండ్రి గుండెలు మండజేసె-
ఊరకొనలేక పై యధికారి జేరి
విన్నవించెను న్యాయమ్ము వేడుకొనియె.
గాని ఉద్యోగులంద రొక్కటియె గాద
అతడు క్రింది తీరుపె ఖాయమని వచించె
న్యాయమేటికి స్వార్థ పరాయణులకు:
రే బవళ్ళు విచారమే రేప కన్ను
కురికి యెరుగండు మా తండ్రి; కురుకలేదు
ప్రభుత మా తండ్రి సాధించుపనుల దగిలి.
యోజనలు సేయుచుండి కొండొక్క నాడు
ఎందులకొ గాని నను చంకనెత్తికొనుచు
తలుపు గడెవేసి మా తండ్రి తలకకుండ
నడచె మా పురిచెంతల నడవి బట్టి.
పోయి పోయి చేరితి మొక పూరిగుడిసె
దానిలో నుండె నొక జడదారి; వారి
పాదముల వ్రాలి మా తండ్రి పరమ గౌర
వమ్ము తొలుకాడ నిటు విన్నపమ్ము జేసె.
'ప్రజలు పొలవుచున్న దురంత నిరత
దుర్ణయమ్ముల కే నాటి కంతు గలదొ!
ప్రజల హాహారవమ్ము దుర్భరము నాకు
ప్రభుల దుర్ణయ గతినంటి ప్రజలలో వి
రోధ వైరాలు పెరుగుచు లోని మంచి
తనము నణచెడు నంత కంతకును మించి
ప్రజల పగబూని గెలిచిన వారు లేరు
కాని అదె కూటనీతికి కన్న తల్లి
ప్రజల వేష భాషా స్వభావములతోడ
చేరని ప్రభుత్వమున కా విచారమేల?
ఈకుతంత్రాల మ్రగ్గి కృశించు ప్రజలు
ఆగ రిక విప్లవం బవశ్యమ్ము వచ్చు
ఆ భయంకరరాత్యాచార మవల ద్రోసి
శాంతి నెలకొల్పు కొరకు నిశ్చయము గొంటి

ఆప్తులను సోదరులు గురులైన నాకు
మీరలేగాన ఈ నా కుమారుగూడ
ఆశిషింపుడు దేశహితైకసేవ.
శిష్యుడైన వీనికి స్వదేశీవ్రతంబు
బోధగావించి, తత్పరిపూర్ణ లక్ష్య
సిద్ధి కావశ్యకమ్మగు శిక్షణమ్ము
అలవరించుడు; పెద్దవాడై నవిదవ
స్వేచ్ఛయే నీ మహత్తర జీవితేచ్ఛ
యని వచించితినంచు మీరానతిండు"
అనుచు మాయయ్య నను మునికప్పగించి
చనియె. యెటకేగెనొ యెరుంగ సాధుమూర్తి
తనయ చెలిగాగ నా సహాధ్యాయగాగ
చదువు సంధ్యల గరప నచ్చటనెయుంటి
ఆటపాటల చదువులయందు కలిసి
మెలసి వర్ధిలుచుంటిమి మేనువేరు
గాని ఒకటె మామనసులు ప్రాణములును
కడవనిటు కొంతకాలము ఘనుడు పరమ
పదము గనునట్టి కాలము ప్రాప్తమయ్యె
తలచితిమి యెప్పుడో జ్యోతి మలగునంచు
నన్ను చెంతకు బిలిచి మా కన్నతండ్రి
దివ్య సందేశమునుజెప్పి దివ్యమూర్తి
తనయహస్తమ్ము నాదు హస్తమునుగలిపి
మంగళాశీస్సులొసగుచు మహినిబాసె.
సాధు నానతి నే శిరసాధరించి
కరము వట్టితినేగాని జరుపుచుంటి
బ్రహ్మచర్యవ్రతంబు. ఆపడతిపేరె
విజయ; ఏటిలో బడి నను వీడిపోయె
విజయ సంగంబు నాదు జీవితములోన
నూత్నవాసంతవేళ లెన్నో సృజించె
తండ్రి కోరికదీరుచు తలపుతోడ
బ్రహ్మచర్యంబు నింతకు వదలలేదు;
నా మనోభిలాషను తీర్చుకొనెదగాని
విజయకే తీరలే"దని వెచ్చనూర్చి
ఊరకొన్నాడతండు విచారరేఖ
మొగమునందోప, సాధువు ప్పొంగిపోయె.

కొన్ని క్షణములుగడచె ఆ చిన్నవాడు
మరల కథనందివలికె "నో మౌనినాథ
నా స్వదేశీవ్రతంబు సాంతమ్ముచేయు
బాటయెయ్యది? దాని కభ్యంతరమ్ము
లేవి. వానిని గడచుట యెట్లుతండ్రి ?"
అనుభవంబెల్ల మొగమున నావహిల్ల
మునివరేణ్యుడు పలికె "నో పుత్ర ! దేశ
కాలములు నీపనికి ప్రతికూలమోయి
నీస్వజాతి నానాటికి నీరసిల్లె
సౌఖ్యశాంతులు చెలరేగు స్వర్గసీమ
కాలుమోపెను రోగాలు కాటకాలు
నరకబాధకు మిన్నగా నకనకవడి
కూటికిని గుడ్డకును మాయు కోట్లప్రజకు
వ:ములోగూడ తలదాచుకొనెడు నెలవు
లేదు. వారికి సంతుష్టి లేదుతండ్రి.
జారచోరత్వములును వంచనము కపట
పాప పాషండతలుగప్పె ప్రజలమనసు
ఘోరదారిద్ర్యమే దీనికారణమ్ము
కూట తంత్ర.రాజ్యాంగము క్రుంగదీయు
భూమి నీక్షామములు విడిపోవు; జాతి
దుర్బలంబయి నష్టమై ధూళిగలయు
స్వేచ్ఛగలిగినగాని జీవించలేదు
అస్వతంత్రజాతులకు సౌఖ్యమ్మురాదు.
లలితపరిమళభరిత గులాబిసుమము
చూడముద్దవు. చుట్టును పాడుముళ్ళు
గలవు. దానిని ముద్దాడదలచువారు
ముందుతొలగించుకోవలె ముంటి బాధ.
సరళము దయాప్రపూర్ణమా జాతిమనది;
దీని దౌర్బల్య మెరిగిన మానవులు ని
రంకుశమ్ముగా తివిరి స్వార్థమ్ముపొందు
చుండిరి; కుమార! స్వప్రజాశోభనమ్ము
గోరి ముందంజవేసెడివారు కష్ట
ములకు పదనాశమునకును మ్రొగ్గవలయు.
సంశయభయమ్ములనువీడు, స్వాంతసుమము
ముడిగిపోనీకు. నిశ్చలబుద్ధి నిలుపు

మాత్మశక్తిపై-విఘ్నఝంఝానిలాలు
వీవ దుర్బల తరువులు వ్రీలిగూలు
గాని తలవంచి యెరుగవుగాదె గిరులు.

విఘ్నములకొడ్డి నిలచిన వీరవరులె
అభ్యుదయగాములై బలమావహించు
కొనుచు విజయమ్ముగాంత్రు; విఘ్నములుచన్న
నరుని ఉద్గతియును నాగి నాశమొందు.

నిరత విఘ్నాల కెదురొడ్డినిలచి నిశిత
బాణహతికోర్చి నిల్చిన మేనభేద్య.
మమరమైపోవు; ఏ జాతి మరణభయము
గెలుచు నదె విశ్వభువనాలు గెలిచి యేలి
ఈశ్వరానుగ్రహముగూడ నెనయజాలు.

ఈ రహస్యమ్ము మరువకు-మెపుడు నెవరి
సేవగించకు-చొరకు వృథా వివాద.
ఎదిరి యెత్తులెరింగి చరించు. మేది
ధాన ప్రమచెందకుము. సావధానివగుము.
చనుము. సంఘమ్ము చొచ్చి నిశ్శబ్దరీతి
నీదు కార్యమ్ము నెరపుము. నీవారులను
ఏవిధానవర్తింప వాంఛింతువటుల
నీవువర్తించి వారికి నేతవగుము.
దేశహితమొనగూర్చెడు తెరగులరసి
చేయుమికమీద. దేవుడాశీర్వదించు.
హతముగావించి ప్రజల మిథ్యాభయమ్ము
హృదయముల నున్నతపథాల నెగురఁజేసి.
సాహసబలాలు గల యువసంచయమ్ము
ప్రోగుగావించి విజయమ్ము బొందుమయ్య.
దేశభక్తుల మనమున దేజరిల్లు
శక్తి అతిలోక. మమ్ములశయ్యవారి
కతి మృదుల పుష్పశయ్య-మానావమాన
ములకు వారు చలించరు-కలగబోరు
ప్రేమనిధులకు కష్టాలు లెక్కరావు.
ఈ కుటీరమ్ము త్యజియింతు నేను నిపుడె
కలసికొందును మరల సకాలమందు
మంగళమయంబవుత నీదు మార్గ మీవు
విజయవంతుడవౌత ఓ వీర గలుగు
గాత విశ్రాంతి సద్యశోంకమున నీకు.”

* * *

ప్రేమ విభ్రాంత విజయ క్రొవ్వేడి యూర్పు
గాడ్పులను రొప్పి రోజు చేతడను విలక
చెట్టుదొక్కిన గతి వనసీమ యెల్ల
విరుల నేరుచు పాడుచు వెర్రిదాని
వోలె తిరుగాడి కొన్నిమాసాలు ప్రాణ
విభునికై విలపించుచు విస్మరించె
నీ ప్రపంచమ్మె. ప్రియుని దర్శించుకొనియె
పల్లవ లతానుకుమ్ముల; పంచుకొనియె
పశువిహంగమ్ములా యమ ప్రణయశోభ.
ప్రణయభిక్షిణి గ్రామైక రాత్రముగను
సంచరిలు చొక్కనాడు గమించుబాట
విడచి తెలతెలవారెడు వేళ కరిగె
నొక్క పల్లెకు; నానంద మొలుక దగిన
ముద్దు పల్లియ వెలవెల వోవుచుండె.
పులిని మరపించ జాలిన చలిదినాల
మాఘ మాసమ్ములోన మైమరువులేక
భయచకిత చిత్తులై గృహాభ్యంతరాల
వణకుచున్నారు గజగజ ప్రజలు; విజయ
కనియె చావునకును కొరగాక చివికి
చీలికల దాగుచున్న కంకాళ మొకటి.
కౌగిటను గ్రుచ్చి పట్టి ముంగాళ్ళు రెండు
గడ్డమును మోపికొనుచు మోకాళ్ళమీద
చలికి తాళగలేక దుర్భర శరీప
దెండ కాశించి ఉదయ మార్తాండు వైపు
వెన్ను చూపుచు కూర్చుండె; విధిని దాట
వశమె—దయమాలి జీమూత పాళిగ్రమ్మె
మధుర ప్రాభాత భాస్కర మండలంబు—
ఒడలు గరచెను చలితోడ వడకు నతడు
మంచుగాలికి పళ్ళు బిగించి-ముడిగి
“అయ్యో! యీలాటి బాధల ననుభవింప
నేమి చేసితి”నని విలపించె నతడు.
ఇంటిలో వానికంటె శుష్కించి పుల్ల
యైన యిల్లాలు సిగ్గునకైన గాని
మలిన వస్త్రమ్ముతో - బల్లివలెను తన్ను
కరుచుకొనుచున్న కొడుకు చంకను గదించె
పరమ దారిద్ర్యదేవతా ప్రతిమవోలె.

గడ్డిపయి మేను వాలిచి గడ్డిచాప
కప్పుకొని-ఉపవాసాల కమలి పోయి
బ్రతుకుచుండిరి ఆ కుటుంబమ్ము-అపుడె
ఎండకై చాప ముసుగెడలించె నతడు
విజయకూడ అతని సమీపించె-చిర్ర
బిగుసుకొని వలిగాలికి నగడుచెందు
నామె దయనీయరూపము నరసి యతని
మనసు కరగి నీరయి కనుగొనల జారె.

చూడజాలక ఇంటిలో జొచ్చి గడ్డి
చాప కొనివచ్చి కప్పి-ఆ సరస నెగడి
మంట గావించి కాచుకొమ్మంచుగోరె
పేదత్యాగమ్ము చూచి ప్రమోదమంది
విజయ - వాసిని సరసకు పిలిచి - ప్రేమ
మీర నాసీనుచేసి "ఓ మృదుల హృదయ!
ఇంతటి ఉదారమూర్తి వీ విట్లు దీన
జీవనము నేతు వేటికి చెప్పు"మనిన,
వెచ్చ నూర్పుచు నాతడు విన్నవించె
"నమ్మ! నే నొక రైతును, అన్న వస్త్ర
ములకు చాలిన భూములే కలవు మాకు;
వాని పండించు కొనుచు జీవనము సేయు
చుంటి మే జోలి జోక్యము వెంటబోక.
వచ్చె నెద్దడిమాకు - మా ప్రజల సౌఖ్య
మునకు పడరాని యిడుమల బొందు నొక్క
వ్యక్తిపై కూట సాక్ష్యమ్ము వలుకు మంచు
కోరి బెదరించినారు; నే వారి మాట
త్రోసి రాజంటి - ఆత్మ విద్రోహమునకు
జంకి; కాని రాజోద్యోగి కిక్కురూని
నన్ను నిరికించె వారి తంత్రమ్ములోన
నేనెరుంగనికుట్రలు నెత్తిగట్టి
ఇంటిలోనున్న గింజలు-వంటపాత్ర
లంబరమ్ములు సర్వస్వ మమ్మివేసి
నన్నిటు పకీరుగాజేసినారు-కూడు
గుడ్డలకుకూడ గతిమాలి-గడ్డిచాప
ముసుగులో నుపవాసాల మసలుచుంటి
మనుచు పొంగెత్తు దుఃఖము నాపలేక
వెక్కి-వెక్కి రోదించెను:విజయ తలను
వాల్చి లోలోన కుమిలి గుబ్బటిలి "ఔరః
ఇంతటి దరిద్రజీవిలో నెంతగొప్ప
మనసు, ధైర్యమ్ముగల"దని మదిని మురిసి
ఈ దరిద్రనారాయణ హితమె నాదు
ప్రియతముని జీవితాకాంక్ష; వీరిసేవ
కొరకె నే దేశమంతట తిరుగుచుంటి
అవరించి ప్రజాభ్యుదయము నెదురు
ధాయలు తొలంప నుద్గతి సాగు తానె.
దీనజన దర్శనమ్మున తెలిసికొన్న
దామె సత్యమ్ము లోకకల్యాణకరము
లైన కార్యముల్ నరులుచేయంగవలయు.
మనుజ సేవనుమించు ధర్మంబులేదు.

ప్రియవియోగవ్యధాసముద్విగ్న విజయ
ప్రణయవాహినికిని అడ్డువైచి యతడు
దీన సేవావిధాలకు ద్రిప్పె-అమె
ఆర్తజన సౌఖ్యకరణమ్మునందు భర్తృ
సేవగావించి బ్రదుకు బుచ్చికొననెంచె-
ప్రియతముడుకూడ మున్నొకవేళపలికె
"నరుల విలువలుదెలియును నరులయందె"
యనుచు, నాతని నోదార్చి ఆమె కదలి
తిరిగె నూరూరు జనపరిస్థితులు తెలియ.

అన్నపేదలై నవసెడు నస్థిపంజరాలె
అమెగనె.నెల్లచోట్ల, ప్రాణార్పణమ్ము
జేసియైనను దౌర్భాగ్యదేశమునకు
ముక్తి చేకూర్తునని దీక్షబూనె విజయ:
వంచనముచేసి ప్రజలు గడించుకొన్న
ధనముగైకొని-రోగాలు దండనములు
ప్రబల దారిద్ర్యమొసగుదురా? నిరక్ష
రాస్యులనుజేసి యేలెదరా! కటకట
అధమస్వార్థమ్ముమీద నే అశనిపాత
మో ఘటిల్లదేటికి ముక్కలై పోవదేల.
స్వప్రజానీక సేవానిబద్ధ దీక్ష
గొన్న మొద లామెకలరూపు గన్నవారు
లేరు; సన్యాసినీవేషధారిణియయి
దేశముల నలుమూలల తిరుగసాగె.
చేతను త్రిశూలమునుదాల్చి చేతమందు
దేశసేవావ్రతంబు సుస్థిరముచేసి
ప్రేమకరుణానిధానము, విజయ గ్రామ
గ్రామమునకేగి యింటింట గళమునెత్తి
పాడినది దేశభక్తి సంభరితగీత
ములు, ప్రజాహృదయమ్ములు కలకవారె,
తమ పురాభాగ్య సౌఖ్యసంతతులు, గౌర
వప్రపత్తులు తమ మనఃపథములందు
బొమ్మలనుకట్టి చూపు, నా బోటిపాట

వినని వారు, గగుర్పాటు గనని వారు
లేరు-రైతులలోన, నిట్టూరుపులను
మాపి సాహసోత్సాహముల్ రేపి దేశ
భక్తులనుజేసి ఆమె నివ్వాళిపట్టె.
పరప్రభుత్వములో సుఖపడగలేని
పశువిహంగాళి విజయమ్మ పాటవినగ
గోరె; రైతు లజ్ఞానవిమూఢులగుచు
నడుముగట్టిరి ప్రాణార్పణమ్ముకొరకు.
సాహసుల శూరులను సృష్టిసలిపి, జనుల
కొండొరులకున్న కలహాల నోసరించి,
దంభ విద్వేష దుఃఖాలు తరిమివేసి
ఆమెపాట లేకైకలక్ష్యమ్ముచూపె!
ఆమెగాన ప్రభావమారౌర! ప్రజల
దేశభక్తి ప్రపూర్ణులజేసె, వారి
దొక్కటే మాట, పాడునదొక్క పాట
ప్రజలపాలి కపూర్వదేవతయె విజయ.

విజయ గానామృతానేకవిధుల తేరి
పరమ దేశాభిమానాన పదును వారు
జనులలోన స్వాతంత్ర్యబీజములు నాటె
యువకుడరుదెంచి; స్వేచ్ఛానియుక్తి ప్రజల
హృదయములె మొక్కలను మొలిపించు
... కొనియె,

మునియును మిలన్నగరప్రాంతములకు జేరి
జనుల గుమిగూర్చి ధర్మబోధనము జేసి
"స్వమత దేశరక్షావసరము దరిసెను
తరలిరం"డని జాతీయ దళము గూర్చె.

దేశదాస్య విభంజనోద్రిక్త హృదయు
లైన జాతీయ వీరసేనా నివహము
కలకలము విదేశీయ భూపులు గ్రహించి
నారు, చతురంగబలముతో నడచినారు,
ప్రజల ఢీకొని చించి చెండాడినారు.
"బందిచేయుడు యువకుని, పట్టుకొనుడు
విజయను, మునీంద్రు గొంతుక పిసికివేయు"
డనుచు భూపాలసేవకు లరచుకొంచు
గ్రామములమీదపడి చూరకారులైరి.
నాటితో రాజగౌరవం బేట గలిపి,
శాంతి సహనమ్ములనువీడి ప్రజలుస్వీయ
నేతలనుగావ, జన్మభూమీతలాన
స్వేచ్ఛ నెలకొల్ప, చావుకు వెరవకుండ
ఇండ్లలోనుండి వెలికి లంఘించినారు

క్రుద్ధ సింహాలవలె; యువకుండు కలిసె
వారితో, జనోత్సాహము మేరమీరె
అఖిలహృదయమ్ము లందు దేశానురక్తి
కదలి పొంగెత్తి వెల్లువగట్టి పొరలె
పూర్వవైరాలు మరచి, యపూర్వమైత్రి
కలిసి స్వాతంత్ర్యదాయి ఖడ్గమ్ముదాల్చి
దరియుచున్న ప్రజాసైన్య దళము జూచి
"చించి మరలించు"డంచు కవ్వించినారు
శాత్రవులు సేనలను, జిగీషామనీష
ఉభయసైన్యాలు ఢీకొనె యుద్ధమునకు
మత్తమాతంగలీల నున్మత్తులగుచు
రాజసైనికుల్ గవిసిరి ప్రజలమీద
యువక నాయకోత్సాహ వాక్యోపదేశ
ముడుకులెత్తింప, వెనుకంజ నిడక, ప్రజలు
ఆగ్రహోదగ్ర సింహములట్లు పైకి
దుమికి గోరాడినారు శత్రువులబట్టి.

బహుళశస్త్రాది సైనిక బలముగల య
సంఖ్య శాత్రవబలమేడ, సాహసైక
మాత్రబల పౌరులేడ? సమరములోన
యువకునకు దెబ్బ తగిలెను—ఉచ్చిపోక
వెన కడుగులేక కవ్వించె వీరకోటి.
ప్రాణముల నొడ్డుచున్నారుగాని ప్రజలు
కాళ్ళుతేలి ధైర్యముతూలి కలగుచుండు
నంతలో నసంఖ్యాక సైన్యముబతోడ
ఊడిపడినాడు మునిరాజు యుద్ధభువిని.

చెలగి జాతీయ సేనలు సింహనాద
ములను గావించి, శస్త్రముల్ బూని మరల
విరుచుకొన్నారు శాత్రవ వీరకోటి

ఈ భయంకరాక్రమణమ్ము నెదిరి తట్టు
కొనగ జాలక పిరకారి వెనుక యడుగు
వేయ రిపుసేన తెన్నులు వెదకుచుండె.

తనదు వెన్నంటి సాయుధ జనులు గొలువ
వీరభైరవి వేషమువేసి విజయ
ఖడ్గధారిణియై రణాంగణము జేరి
వైరిసైన్యాలపై బడి వ్రక్కలించె
మూడుదెసల త్రేతాగ్నులటబోలె మువురు
గవియగా విజయాశకు నువులు నీళ్లు
వదలి ప్రాణాలపై నాశ వదలలేక
పోగులు నరుల జాతీయచమూవిభుండు

గాయపడి, నీరసించి, రక్తమ్ము ధార
గట్టుచున్నను విడువక కసమసంగె.
సోలితూలెడు యువకుని లీలగన్న
శత్రుసైనికు డొక డకస్మాత్తుగాగ
కత్తి నెత్తెను యువకుని గళమునేయ
తప్పుకొను దారిలేని యాతని యవస్థ
కులికి ముని తనకంఠము బలి యొసర్చె.
దెబ్బ తప్పించుకొని వాని ద్రెళ్ళనేసె
యువకుడును, కాని తాపసప్రవరు గాంచి
కనుల కన్నీరు కాల్వలు గట్ట వనరె.
వీర భైరవి మిగిలిన వైరి జనుల
తనదు కరవాలమున బలిగొనియె తుదకు
పగర బలగమ్ము బెగ్గిలి పారిపోయె.
ముని ప్రసన్నుడై కనుల ప్రమోదశోభ
జిమ్మ పలికెను "నా జీవితమ్ములోన
నేడె సుఖిని, స్వతంత్రుడ నేను, నాదు
కనులముందు నా శత్రువుల్ కలగి పరచి
చనిరి, స్వచ్ఛందతామహోషస్సు చూచి
అంతులేని యానంద మే ననుభవింతు;
దుర్జయుండైన వైరిని ద్రుంచినారు
ప్రజలు, ఇక వారికెప్పుడు విజయమె అగు,
నీవు నీ పూజ్యజనక సందేశములను
ఏమరక దేశసేవ గావించి, జన్మ
భూమిని స్వతంత్ర జేసితి పుణ్యమూర్తి!
నీ వదృష్టవంతుడవయ్య, నీదు జీవి
తము పవిత్రమ్ము, నీవంటి విమలచరితు
సంగమును బొంది యశము యశస్వియయ్యె.
ఇక విజయగూడి స్వస్థత నెసగ మెసగి
అతి యశస్వివిగమ్ము మాయయ్య; నీవు
దొరకుటకు ముందె విజయయు దొరకె నాకు
ప్రాణములతోడ, కాని ఆ పడతి చన్న
తెరువు నా 'కింతవరకును తెలియలేద"
టనుచు ఆనాటి వివరాలు వినిచి సాధు
సత్తముడు పల్కె నిట్లు "నిష్ఫలముగాదు
సుమి, మనఃపూర్వకప్రేమ, చూరవోక
వారివాంఛ సిద్ధించు ప్రపంచమందు.
దాచి యుంచిన నా జీవితమ్ము మరుగు
వింతు నీ కీ మహోత్సవ వేళ పుత్ర!
నే నెవండనో గానోయి, నీ జవకుడ
నాటి యెడబాటు ఫలమె యీనాటి జయము.
విజయతో లోక కళ్యాణ విధులు నడపి
కనుము సౌఖ్యమ్మనే పరాంగతికి బోదు"
అనుచు నాశీర్వదించుచు తనువు విడిచె
తాపసాగ్రణి, జయనినాదములు మిన్ను
ముట్టె, తండ్రీ యటంచును భూమిద్రావాలె
పితృ విధేయుడౌ యువకుడు ప్రేమజీవి.

* * *

అదె కుటీరము, నిర్జనమైన యావ
నమ్మె, అనురాగయుత కిరణాలు సాచి
ఉదయభానుడు జగముల కదిపె; గాని
విజయ తొడపయి తలమోపి విస్మృతుడయి
యువకుడు పరుండి నిద్రించుచుండె; విజయ
నవానవాశలు నయనాల నాట్యమాడ
అతని నెమ్మోము-గను తదేకాగ్ర దృష్టి.
మెలమెలగ మెల్లమెల్లగా మేలుకొనియె
అవతలించి మూర్ఛ మునుంగు యువకుడపుడు.
కలకల మధుస్వరాల కోయిలగళమ్ము
విప్పి మంగళ గీతమ్ము వినిచె విజయ;
వెలదికై చూచి మరల కన్నులను మూసె
నావలపు కాదు—చెంతల నామె మొగము
చందమామను గని మహానందమందె.
కలదు జడచేతనాలకు పలుకులేని
సహజనీరవభాష-ఆ సరళి నెరిగి
ప్రేమవిద్యాప్రవీణులే పిలిచి పలుక
గల రొకళ్ళొకరితొ-వాని కాంక్ష దెలిసి
కొన్న దాజవరాలు-క్రొంగ్రొత్త కెంపు
వన్నియలు గొన్న తీయని కన్నె మోవి
మోపె, నాధుని పెదవుల-ముద్దుగొనియె
మనసుదీరగ నతగాడు-మధురవిరహ
దాహమున కదే దివ్యౌషధమ్ము గాదె!

సంపూర్ణము.

రామనరేశ త్రిపాఠి రచన : సముద్రాల అనువాదం.

# ....వినుర వేమ

చెడెను ధర్మబుద్ధి చిల్లర లేమిచే
శేషవింగు ఇచ్చి లేదు భిక్ష
ధర్మమార్గ మెట్లు తప్పిపోవుచునుండు
విశ్వదాభిరామ వినుర వేమ!

ఆంగ్ల భాషవంటి ఆదర్శమగు భాష
ధరణి లేను అనెను తమ్ములార!
పొరుగు యింటి వారి పుల్లకూరయె రుచా!
విశ్వదాభిరామ వినుర వేమ!

కులము భేదమంచు గోత్రము వేరంచు
ధరణిలోన పెక్కు తగవులేల?
కులము వదలిపెట్టి గుణములు చూడరా!
విశ్వదాభిరామ వినుర వేమ!

శాస్త్రవిదులు చేయు శాస్త్ర శోధనమున
శాంతి శూన్యమయ్యె జగతిలోన
శాంతి కూర్పలేని శాస్త్రజ్ఞు లేలరా!
విశ్వదాభిరామ వినుర వేమ!

పుడమిలోని సకల పుణ్య తీర్థములలో
లక్షసార్లు మునుగ లాభ మేమి?
మానసమున నున్న మలినము పోవునా!
విశ్వదాభిరామ వినుర వేమ!

## పూ. భా.

కన్న తల్లికన్న కాంచనమే మిన్న
కాంచనమ్ముకన్న కాంత మిన్న
కాంతఁ జేయు కాంతకన్న మిన్నేదిరా!
విశ్వదాభిరామ వినుర వేమ!

తల్లి దండ్రు లన్న తగవైన మాటలు
భార్య మాటముందు పనికిరావు
కొసను వచ్చు నట్టి కొమ్ములు వాఁడిరా!
విశ్వదాభిరామ వినుర వేమ!

పదవి వచ్చు వరకు పలుకుదు రోర్మిగా
పదవి వచ్చు పిదప పలుక బోరు
నదిని దాటు వెనుక నావతో పనియేమి!
విశ్వదాభిరామ వినుర వేమ!

ఉప్పు, పప్పు, కూర, ఉదకంబు దొరకవు
పెరుగు, పాలు, వంటచెరకు లేవు
ఇల్లుకూడ దొరకక విధియేమి బాధరా!
విశ్వదాభిరామ వినుర వేమ!

ఇంతచేతునంచు అంతచేతునటంచు
పలుకువాడు తుదకు పనికిరాడు
ఉత్తరుండు పసుల నెత్తుకు వచ్చెనా?
విశ్వదాభిరామ వినుర వేమ!

# గూడెం పోకడ

మా గోఖలే

ఓలీల్ మొత్తం పెపంచమ్మీన దడీమని లెగిసింది యుద్దెం. యాడజూసినా మడుసులు వునిమీన నడుత్తుండారు.

పాలెం అదర్నించి యీదరికి, సీకట్లో రాయీ రప్పా తన్నుకుంటా, సిరసిల్లాడ్తా, బసవ పున్నయ్యగారు అంగలేసుకుంటా వొచ్చి, గూడెంలో నక్కాబూసాయి గుడిశ తలుపు నెక్కలమీన ధబదబ బాదాడు "భూషాయ్, భూషాయ్ ?'' అ నరుత్తా.

తలుపుదీసి, పంచె సరిజూసుకుంటా బెయిటికొచ్చాడు బూసాయి, కళ్లు నలుసు కుంటా.

"ఎవురూ ? మీరంటండి పున్నయ్యగారూ ! లోనకి రాండి మంచమ్మీన కూకుందురుగాని-ఏవేఁయ్, లెగూ.''

"యిక్కడికి చాల్లే తిరిగింది. యింకా మంచంమ్మీద కూచోటంగూడా, సిగ్గు లేక ! అవుతే ఏవిఁట్రా నీ వేషం భూషాయ్ ? యిహ నీ చుట్టూతా తిరగటమే నాకు పననుకున్నావా ఏమిటీ ?"

"పొద్దునొచ్చి పొయ్యారంటగా, యిది సెప్పింది లెండి."

"పొద్దున్నే ఏమిటీ ! మున్నూటరవై ఘడియలూ మీదేవిడీ కెదురుగానేగా నా రాంభజనా! నిన్నొచ్చి పొయినా, మొన్నొచ్చిపొయినా,దాం దుంపదెగిరి చావు అంత కనపడకుండాపొయినా ముట్రా ఎంత రోజులు మారినా ? ఆ మాత్రం విశ్వాసం వుండక్కర్లా, మనిషన్న వాడికీ ? పొయిలోకి పుడకలేక చస్తున్నాం. మొన్నటి నుంచీ ఆ కట్టెలు పగలేసి వెళ్ళమని మాటి మాటికీ చెప్పిపోతుంటే, యివ్వాల్టివరకూ తేలకపాయె ! పోనీ దగ్గిర్లో పిలుస్తే పలికే వాడుంటే, అనుకోవచ్చు. మా సొమ్ము ఎంత మంది తిన్నారో తింటున్నారో, ఎవడేడ్చాడు ! "ఏవిఁరా ?" అనంటే, "తొందర పనిమీద పోతున్నానండీ'' అని మొహం తప్పిచ్చే వాడే. మీ కుటుంబంమ్మీద వుండే నమ్మకం కొద్దీ, యిదుగో యిట్టా ఏడుస్తుంటా. పోనీ, యీ నాటికి వీళ్ల రోజుకు రూపాయో, రెండో సంపాదించుకుంటున్నారని సంతోషంగా వుంటుంది. నీకు రూపాయే కావాలో, రెండే కావాలో, ముందు పనిజేసి నీకు కావల్సినంతే పట్టుకుబో. నిన్న నేదేవయూ ?"

"అంతే లెండి పున్నయ్యగారూ.''

"అంతే నంటం కాదురా ! నా పరిస్తితేమిటో నీకు తెలుసుగా ? సొంతంగా యీడవ లేక ఆ వున్నదంతా, యిదిగో నీకూ, మీ గూడెంలో వాళ్ళకీ, తలా కొంచెం మక్తాకిస్తిని. సొంతంగా సాగించినన్నాళ్ళు, పిలుస్తే పలకటానికి మీలో ఎవరో జీతానికుండే వాళ్లా, వెళ్ళిపోతుండేది. అసలు యీ రోగాల్తోటిబస్తీలకు పోతుంటంలో యీ ఖర్మ పట్టింది. పిల్లలకేవోఁ ఎక్కడో చదువులు. యిదేవోఁ రోగిష్టిది. పాపం, మా అమ్మ బతికున్నన్నాళూ ఏదో యింత చేసి పెట్టుండేది. యిహ, నేను మడే కట్టుకునేదా, దాసింకిత గంజే కాసేదా, కట్టెలే పగల గొట్టుకుంటూ కూచునేదా, మాట్లాడవేరా భూషాయ్ ?"

"చనక్కాయలకి పోతుండావండీ."

"ఒక్కరోజు భాగ్యానికి ఆ కూలీ నే నివ్వ నన్నానుట్రా ?"

"పదెకరాలు నలుగురం వొప్పు కోటంలో సిక్కొచ్చిందండీ. యిగ యూడ్డిలెండి,.యియ్యాల్లో అదీ అవనే అయిపాయె."

"యిక్కడ నాకూ అయిందీ. తడిసి మోపెడు! తెల్లవార్ఝామున ఆవిడెగార్ని గుంటూరు తీసుకెళ్ళాలి. మధ్య మధ్య మనచేతిలో వున్న వైద్యమేమో చేస్తూ వొచ్చానూ—అది ఆవిడెగారికి చేదయింది! గుంటూర్లో లేడీడాక్టరు దగ్గిర తియ్యగా వుంటుందట. కానీ! యివ్వన్నీ మనకు అతీతం చూడూ! ఇందులో రేపు తెల్లవారే సుముహూర్తం. మరి నీ బండి కట్టుకొస్తావా. చుండూరు స్టేషనుకూ?"

"ఎట్టనండీ-"

"ఆఁ?"



"ఎట్టనండి పున్నయ్యగారూ, పెస్సుందర్రావఁయ్యగారి ఆదోరు యడ్డపల్లె ఎల్తాఁవంటే మాటిచ్చాను, ఎట్టనండీ!"

"వేళాకోళంట్రా భూషాయ్?"

"అబ్బె యంతొట్టు పడ్తే అం తొట్టండీ! యడ్డపల్లిలో అప్పయ్యగారి కూతురు సోబనమయితే, ఆదోరెల్లాలంటా, గెట్టిగా తెల్లారి బండికట్టక రామని సుందర్రామయగారు సెప్పి బొయ్యారండీ."

"భూషాయ్? మీరు చిన్నప్పుడు మా యింటో తిని పెరిగారు. మీ నాయన మా యింటో జీతానికి చేస్తూ దాటిపొయినాడు. యివాళ రోజులు మారినయ్యని నే నంటంలా. యిప్పటికీ మా తాటితోపులో, మీరే గాదు, వూళ్ళోవాళ్ళంతా మట్టల్దగ్గిర్నుంచీ సమస్తం తీసుకెల్తుంటే నాకు తెలిసికూడా పల్లెత్తుమాట అనలా. రెణ్నెల్ల కిందట నీ పెళ్ళాం చలిజ్వరంతో బాధ పడ్తుంటే నాకు తోచిన మందేదో యిచ్చి నయం జేశా. ఇహ ఎన్నో వున్నయి, ఎందుకొచ్చినట్టు. యీనాడు నా పెళ్ళానికి జబ్బుగా వున్నదని సిగ్గులేక నీ బండికి బతిమాల్తుంటే—వాళ్ల అయిదిచ్చినా పదిచ్చినా-నాకు మొహం తిప్పి చూపిస్తావుట్రా భూషాయ్?"

"అబ్బె అంత మాటండి పున్నయ్యగారూ! యడ్డపల్లినించి మద్దానం తిరిగొచ్చి, సందేల కట్టుకురామ్మంటే కట్టుకొత్తా—"

"నీ మొహానకొట్టుకో—ఛీ—తూ—" అని సీదరిచ్చుకుంటా, సీకట్లోకి గబగబ ఎల్లిపొయ్యాడు బసవ పున్నయ్యగారు.

కాసేపు అట్టనే నిలబడ్డాడు బూసాయి.

"ముంగల తలుపెయ్యి." అంది పెళ్లాం సుక్కమ్మ.

"యివె కాద మద్చి మాటినిపిచ్చుకోడేం!" అన్నాడు బూసాయి, సుక్కమ్మ పక్క కూకుంటా.

"ఏందయ్యా యినిపిచ్చుకునేదీ? మద్దెనా కెందుకని వూరుకుండా గాని, ఆవజాన పున్నయ్యగారు బతివిఁలాడ్తంటే కొయ్యకి మల్లే అటనే నిలబడి పోతివీ? మాట దక్కేయవారవేఁ నెట్టా యిదీ?"

"ఓడన్నాడు దక్కద్దనీ!"

"అయిదూ, పదీ, యిత్తాడెట్టా పెస్సుందర్రామయ్యగారూ?"

"పదా, యాబయ్యా ?"

"మరేంది పున్నయ్యగారావజానంటంటే?"

"అచలు--ముంగల మడ్చికి మాటిత్తిని గదంటే !"

"యిత్తే యిచ్చావులే,ఆరి సొమ్ము దిన్నాం. నాయం గుండదు ఎల్లిరా."

"ఆమాత్రం నాయం యీ యదవకు తెలుత్తేగా, నీకు తెల్చిందిగానీ ! ముంగలో పెద్ద మడ్సికి మాటిత్తినీ, మద్దానం ఎటనోతిరిగొచ్చి, కాత్తె ఆగి బండి కడ్తానంటుంటినీ, దుత్త పగలేసి ఎల్లెల్లిపాయె !"

"ఎన్నాలు బొయినా పీడ మన మీనకే వొచ్చుద్ది ! ఆయనేవోఁ ఆనాడు మీరు మా సొమ్ముదిన్నారు, యీనాడు మీకు మందు బోశాను, అనంటుండె ! ఓరుకాదన్నారూ ? లెగవరా, అంటే లెగవటానికి ఛువ కాడ మడిసి సిక్కాలు గమనియ్యక్కర్లా ?"

"అవకాడ బో సంబరమ్మీన, సోబనాని కెల్లాల్లబండి కట్టరా అంటే, కడ్తానంటిని !"

"కూలీ దొరకనన్నాలు కూడులేక సత్తా వుంటే, "గాడ్దెకొడుకులు పన్జేసిసావరు" అనంటిరి ! యియ్యాల కూలి గిరాకయి; ఆడీడకు బొయి నాలుగుడబ్బులు తంటాలు బడ్తంటే, "యిస్వాసం లేదీళ్ళకి" అనంటుంటిరి !"

"ఓ రోజు పేళ్ళు పగలెయటానికి పద్దినాల కూలి బోనూకమంటాడు. నాయం వుండక్కర్లా ?"

"............"

"............"

"ముంగల తను వొప్పందం జేసుకునుంటే, ఆనక పద్దినాలపని పోయిందని ఏడుత్తే ఏడ్సుకుండేవోళ్ళం."

"కాదులే !"

"ఏంది కాదూ ?"

"ఆ మద్దె రామయగారు "దడి బిగిత్తావంట్రా రూపాన్నరిత్తానూ ?" అనంటే, పని కొప్పుకున్నానండీ, అనన్నా. అన్నీవుత్తదే!"

"అవెందీ ! దబ్బు ఎక్కువై పోతుండదెట్టా ?"

"అనాల్చి అన్నా లేవే !"

"యిదేందీ ! యీ మడ్చికేంగుబు లెట్టా!"

"ఎవురికి నాకా ? నువ్వనాల్చిందే ! ఆమైన బామ్మనయ్యగారి సందులోకి ఎల్లేతలికి, అదిగో ఆ పద్దినాల రెడ్డెమ్మగారి కూలిదొరికింది."

"నీకు ముంగల తెల్చా, ఆఁజాన కలిసొచ్చుద్దనీ ? యింకానయం ! అట్టనెయిమాక ఎప్పుడూ."

"యిన్నాలమించి మన్ని ఏడిపిత్తే బాగుండదెట్టా ? నువ్వేగా యింతికి ముంగలంటివీ ?"

"నేనన్నానెట్టా ? ఏవోఁ. అయినా పెద్దోరితో కూడినెవారం. రేపు మనకి గడ్డు దినాలొత్తే, ఆరేగందా మనకి దిక్కూ ? కాత్తె కనిబెట్టి పోయ్యా, బాగుంటదీ."

"దిక్కూ ! ఓ రే మనకి దిక్కూ ? దిక్కంటే, పగలల్లా రేత్రల్లా వొళ్లు యిరుసుకుండా కడుపు కక్కుర్తిగుంటదేం ? యీపు మీన బత్తావెత్తుకుంటే కూలిడబ్బు లిత్తుండారు. యీ మయిన నువు ఎల్లి పట్టుకోక కావాలని అడుగూ, ఓడిత్తాడో సూద్దాం ? యియ్యాల నువురూపాన్నర సంపాయిత్తుండా, మరసనాడు పడకేత్తే దానికది చరిపోటం లేదంటే ? గడ్డు దినాలు యావో వుండయ్యంటావేందే ? రోజూ కూలిగిడ్తుండదీ. అదీ సావుగా వుంటే, యిగ ఎవురే నిన్ను కనిబెట్టుండేదీ ?"

"నీకేందో గుబులు మల్లింది !"

"పాయే !"

"సందుసూని యాడోపిసుకుతాళ్ళే పున్నయ్యగారు !"

"ఓకు కావన్నాడు శాతకాదనీ ? ఓకోపు నువుగూడా పట్టు."

"యిగ సాల్లే వూరుకో !"

"ఏమ్మా ?"

"యియ్యాలకి పొండుకో, తెల్లారి సోబనాని కెల్లాల గూడా."

"ఏందో అంటండావే--?"

"అబ్బోవ్--"

# కబుర్లు


క. స.

యుద్ధం ముగిసిపోయి. అధి కారరీత్యా. మూడునెలలు అయి పోయింది. కాని, శాంతిమాత్రం ప్రపంచంలో పూర్తిగా నెలకొన లేదు. జావాలో యుద్ధం జరుగు తోంది. చైనాలో యుద్ధం జరుగు తోంది. పాలస్తీనాలో పోరాటం జరుగుతోంది. జావాలో జరుగు తున్న యుద్ధం, దేశీయులు స్వా తంత్ర్యం కోసం, కొన్ని తరాలుగా తమను యేలిన డచ్చివారిమీద చేస్తున్నది. ఈయుద్ధంలో డచ్చివారికి, బ్రిటిషువారు సహాయంచేస్తున్నారు. ఈ సహాయం చెయ్యడంలో, భారతీయ సైన్యాలను నియోగిస్తున్నారు. చిట్ట చివరకు భారతీయులకు ఎలాంటి దుర్గతి వచ్చిందంటే, తమ దేశాన్ని పారతంత్ర్యంలో ఉంచు కోవడమే కాకుండా, ఇతర దేశీయుల స్వాతంత్రోద్యమాలను అణచి వెయ్యడానికి తోడ్పడం లోకి దిగింది. దీనికి కారణం, అసలు మన దేశానికి స్వాతంత్ర్యం లేకపోవడమే.

మనకు స్వాతంత్ర్యం ఎప్పుడొస్తుంది ? ఇదుగో వస్తుంది అని కొంతమంది నాయకులు అంటున్నారు. ఇదుగో. ఇస్తాము కొంచెం వుండండి, మీలో మీరు ముందుగా కొంత సర్దు బాటు చేసుకోండి, ఎన్నికలు అవనివ్వండి, అప్పుడు మీ దేశంలో ప్రజల విశ్వాసాన్ని పొందిన పార్టీ యేదో తేలుతుంది, శాసనసభలు ఏర్పాటయిన తరువాత, ఆ శాసనసభలలోనుంచి కొంత మంది ప్రతినిధులతో ప్రజా ప్రతినిధి సమితి (కన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీ)ని ఏర్పాటుచేస్తాము. ఆ సమితివారు ఒక రాజ్యాంగ విధానాన్ని తయారు చేస్తారు, అంటూ బ్రిటిషు ప్రభుత్వంవారు అంటున్నారు. "కొంచెం ఓపికపట్టు నాయనా, లేబరుపార్టీవారు పరిపాలన ప్రారంభించి కొద్ది కాలమే అయింది. మీ దేశాన్ని గురించి ఒక పంథా త్రొక్కడానికి వారికి కొంత వ్యవధి యియ్యి" అని పండిత జవహర్‌లాల్ నెహ్రూను వుద్దేశించి, స్ట్రాబోల్గి ప్రభువు యీమధ్య అన్నాడు.

పూర్వం ఒకరాజు వుండేవాడు. ఒకరోజున, ఒక సంగీత విద్వాంసుడు, ఆ రాజుగారి కొలువుకూటంలో పాటకచ్చేరీ చేశాడు. సభికులు ఆహా అన్నారు, రాజుగారు చాలా ఎక్కువగా ఆనందించారు. రాజుగారినీ, సభికులనూ మెప్పించాను గదా, రాజుగారు గొప్ప బహూమతి యిస్తారు అని సంగీత విద్వాంసుడు ఆశపడ్డాడు. పాటకుడికి రాజుగారు ఏ విధమైన బహూమతి యిస్తారో అని సభికులంతా కుతూహలంతో ఎదురు చూస్తున్నారు. రాజుగారు ప్రధాన మంత్రి వైపు తిరిగి "ఈ విద్వాంసుడికి ఒక లక్షవరహాలు యిప్పించ"మన్నారు. రాజుగారి నిర్ణయం గాయకుడికి బ్రహ్మాండమైన ఆనందాన్ని కలిగించింది. సభికులుకూడా రాజుగారి యీవికి మెప్పుదల చూపారు. ఆ నాటికి సభ ముగిసింది.

వారం రోజులైన తరువాత, రాజుగారు సభ చేస్తూవుండగా, ఆ సంగీత విద్వాంసుడు మళ్ళీ వచ్చాడు. "ఏమయ్యా, వచ్చావ్ ?" అని రాజుగారు ప్రశ్నించారు. "మహాప్రభూ, ఆనాడు తమరు నాకు లక్షవరహాలు యిప్పించమని పెద్ద మంత్రిగారితో సెలవిచ్చారు. రోజూ మంత్రి గారి దర్శనం చేసుకుంటున్నాను, ఇంతవరకు నాకు ఆ సొమ్ము అందలేదు" అని గాయకుడు మనవి చేసుకున్నాడు.





స్వర్గానికి ఎక్క ప్రయత్నించిన బోగం రంగసాని

—రాజుగారు ఫక్కున నవ్వి, "ఓయి పిచ్చివాడా, ఇదా సంగతి! ఆరోజు నువ్వు సంగీతం పాడి, మాకు రెండు ఘడియలసేపు శ్రవణానందం కలిగించావు. లక్షవరహాలు నీకు యిమ్మని చెప్పి, ఆడబ్బు వస్తుందనే భావం కలిగించి, నీకు వారంరోజుల ఆనందాన్ని మేమిచ్చాము. అంతేగాని, నీవు మాకు వస్తురూపంగా ఏమిచ్చావు గనుక, నీకు రొఖం మేము యివ్వడానికి! మాకు గలిగిన శ్రవణానందానికి ప్రతిఫలంగా, నీకూ శ్రవణానందం మేము కలిగించాము" అని సెలవిచ్చారు.

అలాగే, కన్సర్వేటివ్ పార్టీవారు అధికారంలో వున్నన్నాళ్ళూ, లేబరుపార్టీ పెద్దలమీద మనం ఆశపెట్టుకున్నాము. భారతదేశాన్ని గురించి, పార్లమెంటులో అప్పుడప్పుడు ప్రశ్నలు వేసే లేబరుపార్టీ నాయకుల్ని ప్రశంసించాము. అంతేగాని, కన్సర్వేటివులను ప్రతిఘటించడానికి లేబరుపార్టీవారికి ఏదో కారణం కావాలనీ, ఆలాటి కారణాలలో ఇండియా ఒకటనీ, అంతకు మించి, "అయ్యో, పాపం, ఇండియన్లకి స్వాతంత్ర్యంలేదే, ఇంతకన్న ఘోరం మరొకటి వుంటుందా" అనే పవిత్రాశయంతో లేబరుపార్టీవారంతా కొట్టుకులాడడం లేదనీ, మనం ఆట్టే గమనించలేదు.

స్వాతంత్ర్యం, ఎవరికి వారు కాపాడుకోవలసిన ఒక నిక్షేపం. ఆ నిక్షేపాన్ని మన పూర్వీకులు కాపాడుకోలేకపోయారు. కోరి కొందరు ఫ్రెంచివారినీ, కొందరు ఇంగ్లీషువారినీ నెత్తిన తెచ్చి పెట్టుకున్నారు. ఇంగ్లీషువారు ఫ్రెంచివారిని వెళ్ళగొట్టి, మొత్తం దేశంమీద పీఠంవేశారు. 40 కోట్ల ప్రజలు బానిసలుగా వున్నందున, 15,75,187 చదరపు మైళ్ళ వైశాల్యంగల దేశం తమ పరిపాలనలో వున్నందున, తమకు రాజకీయంగానూ, అంతకంటె ఎక్కువగా ఆర్థికంగానూ కలుగుతూన్న ప్రయోజనా లన్నిటికి హస్తోదకాలు వదలి, బ్రిటిషువారు




మంత్రిత్వంకోసం తంటాలువడ్డ రాజాజీ

---

మదరాసు రాజధాని అంతే విస్తీర్ణంగల తమదేశాన్నే నమ్ముకోని, అక్కడే కూచుంటారని మనం కలలోకూడా అనుకోవడానికి వీల్లేదు. స్వాతంత్ర్యం వారు మనకు యివ్వరు. అలా యిస్తారని మనం ఆశపెట్టుకొన్నట్లయితే, రాజుగారు లక్షవరహాలు యిస్తారని ఆశపెట్టుకున్న సంగీతపాటకుడి స్థితి మనకూ పడుతుంది.

స్వాతంత్ర్యం, మనం పట్టుపట్టి సంపాదించవలసిన వస్తువు. ఆయుధబలం మనకు లేదు. ఆయుధబలంతో స్వాతంత్ర్యాన్ని సంపాదించడం, నైతికంగానే కాక, ఇతర దృక్పథంలోకూడా మనకు లాభకరమైనది కాదని మన జాతీయనాయకులు నిర్ణయించారు. ఇక మన కొక్కటే మార్గం. "బానిసలుగా మేము వుండము, మమ్మల్ని బానిసలుగానే వుంచడానికి మీరు మీ దేశంలో ఆచరణలో పెట్టే ఏ రాజకీయ విధానంలోనూ మేము మీతో సహకారం చెయ్యము" అని బ్రిటిషువారికి మనం నచ్చచెప్పాలి. అలా చెప్పడానికి, తగిన ధైర్యము, ప్రజ్ఞ గల నాయకులు, ఎన్నికల అనంతరం ఏర్పాటు కాబోయే ప్రజా ప్రతినిధి సమితిలో వుండాలి. ఈ విషయంలో మనం యీనాడు తగిన జాగ్రత్త వహించాలి.

ఈ ఎన్నికలలో మనలో ప్రతి ఒక్క మనిషిఓటుకీ ఎంతో విలువవుంది. బిరుదుల కోసమూ, ఘనతకోసమూ, అలవెన్సులకోసమూ శాసనసభల సభ్యత్వానికి పోటీ చేసేవారికి మనం ఓటువేశామంటే, మన బానిసత్వాన్ని, ఆ మహనీయులు తమ బిరుదులతో మరింత స్థిరపరచగలరు. దేశాన్ని గంగలో కలిపి, తమ స్వార్థాన్ని పెంపొందించుకోగలరు.

దేశీయుల ఆశయాన్ని, అన్నిటికన్నా ప్రధానంగా యెంచుకొనే వ్యక్తులకే, అలాటి ఆశయాలతో పనిచేసి, ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగావున్న పక్షానికి చెందినవారికే మనం ఓటు యివ్వాలి.

ఈ నాటినుంచీ, రాష్ట్రీయ శాసన సభలకి ఎన్నికలు అయిపోయినదాకా మనం జ్ఞాపకం పెట్టుకోవలసిన ముఖ్యవిషయం ఇదే.




"ఏం బావా—ఎప్పుడొచ్చావు ?" అంది శాంత తల దువ్వుకుంటూ వూడివచ్చిన జుత్తును కాలి బొటనవేలికి చుట్టుతూ.

"ఇదే రావటం" అన్నాడు కాంతం వీధి వాకిలి తలుపేసి అక్కడే నిలబడి శాంతను చూస్తూ.

"నీకు వృధా శ్రమ అయింది. నేనిటు వచ్చాను-నువ్వు అటు వెళ్ళావు !" అంది శాంత. కాంతం మెల్లిగా ఆమెను సమీపించి పక్కన అరుగుమీద చతికిలపడ్డాడు. ఎదట తులసికోటలో మట్టిని పెల్లగించి పూడ్చి పెట్టిన అల్లం ముక్కల్ని శాంత కొడుకు తీసి అవతల పారేస్తున్నాడు.

"నీ కొడుకేనా-ఏం పేరు ?"

"నాన్న పేరే-వొరేయి వెధవా !" అంది శాంత కొడుకుతో లాంఛనంగా. ఇంతలో హనుమాయమ్మ భావిదగ్గిర మొహం కడుక్కుని కాగుతో నీళ్ళు తెచ్చింది, వొక చెయ్యి గాలిలో ఆడించుకుంటూ !

"అదీ ! నువ్వటు వెళ్లావు అదిటు వచ్చింది. వొరేయి వెధవా !" అంది హనుమాయమ్మ మనమడితో. శాంత కొడుకు ఏమిట్రా ఈ విధంగా చప్పుడవుతుందని అమ్మమ్మ వంక ఓ క్షణం చూచి మళ్ళీ మట్టిని కెలకటం ప్రారంభించాడు.

"పాపం నే వొస్తున్నానని తెలిస్తే బావ శ్రమపడి వెళ్ళేవాడు కాదు !" అంది శాంత.

"ఏం నువ్వు లేకపోతే వెళ్ళకూడదా మీ అత్తవారింటికి ?" అన్నాడు కాంతం.

"నే నుండగా ఎప్పుడొచ్చావేం ?"

"నువ్వు లేకుండా ఎప్పుడెళ్ళాను ?" అన్నాడు కాంతం. "అయినా నే వొస్తున్నానని తెలిస్తే నువ్వక్కడ వుండేదానివేగా ?"

శాంత ఏం సమాధానం చెప్పేదోగాని దభాలున తలుపు తెరుచుకుని వెంకట్రామయ్యా వచ్చాడు.

"ఏంరా వృధా శ్రమ అయిందే ! నువ్వు వచ్చినమాట వుత్తరం రాశానని నీతో చెప్పటమే మరిచిపోయినాను. తీరా నువ్వు వెళ్ళిం తరువాత జ్ఞాపకం వచ్చింది. నువ్వు తొందర పడి వెళ్ళావు కాని-అమ్మాయీ నీకు వుత్తరం ఎప్పుడందిందే ? రండి !" అంటూ వెంకట్రామయ్య లేచాడు. ఎవరో సులోచనాలు పెట్టుకుని లోపలికి వచ్చాడు. వెంకట్రామయ్యా ఆయనా అవతల వరండాలోకిపోయి ఏవో రాజకీయాలు మాట్లాడుకుంటున్నారు. హనుమాయమ్మ ఇంట్లోకి వెళ్ళింది.

"చాలా మారిపోయినావు బావా ?"

"నువ్వు మటుకు మారలా ?

"నామార్పు కేమిలే ! నీ చదువు పూర్తి అయినట్టేనా ?"

కొడవటిగంటి కృష్ణమూర్తి

"చదువెప్పుడూ పూర్తికాదు! పుస్తకాలం చదువు పూర్తి అవుతుందేమో గాని మనిషి చచ్చేటంతవరకూ గ్రహించటం పోయినా, చదువుకోవటం తప్పదు" అన్నాడు, కాంతం అనవసరమైన గాంభీర్యంతో. కాంత క్షణం కాంతంవేపు చూచింది అర్థం కాక.

"నువ్వు చాలా మారిపోయినావు?" అంది కాంత జడ అల్లుకుంటూ.

"అమ్మాయి-కానిని మంచి తీర్థం తెచ్చి పెట్టవే" అన్నాడు వెంకట్రామయ్య అక్కడి నించే.

"ఆ!" అంది కాంత జడ చివరభాగం దబదబా అల్లి పూలుచుట్టి, జడను విసిరి వెనక్కు పారేసుకుంటూ. "వెధవా నీకుకాదు చెప్పేది!" అంటూ లేచి కొడుకు పిర్రమీద చిన్న దెబ్బకొట్టి, కుర్రాడిని ఎత్తుకుని ముద్దు పెట్టుకుంటూ లోపలికి తీసుకుపోయింది. తను కాంగా అంత ఘనకార్యం చేశానని వాడు నవ్వుతూ వెళ్ళాడు. కాంతం అరుగుమీద చేర గిలబడి వరండావేపు చూచాడు. వెంకట్రామయ్య చెప్పే మాటలు వింటూ, కాంతం వేపు చూస్తూ ఆ రెండో ఆయన తలపూపుతున్నాడు.

కాంతం మారిపోవటం కాదు—అతనికి ప్రపంచం అంత మీదా కోపంగా వుంది కాంతను తనకు అందకుండా చేసినందుకు! ఇన్నాళ్ళనించి అతనికి అనుమానంగా వున్నది కాంతను చూచిన మరుక్షణంలో నిర్ధారణ అయిపోయింది. అతని హృదయం ఆడదాని కోసం ఆరాటపడటం లేదు. కాంతకోసం మసలుతున్నది. కాంత భార్యగా కావాలని నియమంకూడా లేదు! వివాహం లోకంకోసం కాని అతనికి అక్కర్లేదు. అతనికి కావలిసింది కాంత. ఆమె అతని భార్యగా ఏర్పాటయితే అతనికి అభ్యంతరం లేదు. కాని ఇప్పుడు కాంత అతనికి భార్యగా కాకుండా పోవటమే కాక ఏ విధంగానూ అతనికి లోకసమ్మతిని అందదు. లోకసమ్మతి లేకుండా ఏ ఆడదాని కోసమైనా కాంతం ఎప్పుడైనా ముందు పాల్పడుతాడేమో కాని కాంత విషయంలో—అసంభవం!

కాంతం వెంకట్రామయ్య మేనల్లుడు. కాంతం తల్లి అతని చిన్నతనంలోనే పోవటం వల్ల మేనమామ ఇంటోనే పెరిగాడు చిన్నతనంనించీ. అతనికీ కాంతకూ చిన్నప్పటి నించీ ఒక్కక్షణం పడేదికాదు. మేనమామ ఇంటో వుంటూ ఏమాత్రం ఆడకువగా వుండక మేనమామ తన ఇంటోనే వుంటూ తనకి నీతులు బోధిస్తే ఎంత ధిక్కారంగా వుండ వచ్చునో అంత స్వతంత్రంగా జీవించిన ప్రాణి కాంతం! అయితే అతని ప్రవర్తనలో ఏ విధమైన చిలిపితనం లేక చాలా పెద్దమనిషి వ్యవహారం వుండటంవల్ల ఏ వెంకట్రామయ్యా, ఏ లోకం ప్రత్యేకంగా గమనించ తగ్గ అవసరం లేకపోయేది. ఎవ్వరూ లేనప్పుడు కాంతా కాంతం కోతులకు మల్లే కీచులాడుకునే వారు. హనుమాయమ్మకు ఈ విషయం స్వల్పంగా తెలుసును కాని వెంకట్రామయ్యదాకా పోయేదో లేదో చెప్పలేం. ఒక వేళ పోయినా కాంతం సాధారణ మేనల్లుడిగా కాక, వున్నా లేనట్టుగా, లేకపోయినా వున్నట్టుగా తయారవటం వల్ల వెంకట్రామయ్య కాంతం విషయంలో విసుక్కోవటం బహు అరుదు. తల్లి బతికివుంటే కాంతం ఎలా తయారయ్యేవాడో కాని ఇప్పుడుమట్టుకు అతను తయారైన విధంగానే తయారవాలిసి వచ్చింది!

భార్యాభర్తలు లోలోపల ఏం తేల్చుకున్నారో గాని కాంతకు పరాయి సంబంధమే తెచ్చారు. ఫలితం ఎలావున్నా కాంతం తల్లి జీవించివుంటే కాంత పెళ్ళివిషయంలో కొంత

ఘర్షణ అయ్యేది. రివాజు ప్రకారం లోకం శాంతను మేనల్లుడికే ఇచ్చి చేస్తారని అనుకున్నారు కాని సంబంధం నిశ్చయం అయ్యే వరకూ ఎవరికీ తెలియదు. ఒక రిద్దరు ఈ విషయమై వెంకట్రామయ్యను ప్రశ్నిద్దామనుకుని వుండచ్చు. కాని సమ్మంధం నిశ్చయమైన తర్వాత ఏం ప్రయోజనం? ప్రయోజనం లేకపోయినా వారు ప్రశ్నించారో లేదో తెలియదు. ఏతావాతా ఫలితం శాంతను మరొకరికి ఇచ్చివేశారు. సమయానికి కాంతం తరపున మంచి వకాల్తీ లభించలేదని చెప్పక తప్పదు.

అప్పుడు కాంతానికి ఈ గొడవే లేదు. అతను వేరే వూళ్ళో చదువుకోవటంచేత శాంత పెళ్ళికే అతనికి రావటానికి పడలేదు. అతను పెళ్ళికైనా వచ్చివుంటే "అదేమిటమ్మా నిక్షేపమైన మేనరికం వదిలిపెట్టారు!" అని కొంతమంది విడ్డూరం పోయేవారేమో కాని అదికూడా జరగలేదు. కాంతం చిన్నతనపు జీవితం మామూలు కుటుంబాలకు ఆదర్శప్రాయంగా వుండకపోవచ్చును కాని ఏ మేనమామైనా కూతురివివాహ నిర్ణయంలో అడ్డుగా భావించాలిసినంత సమస్య కాదు. కాంతం అలా చదువులకే వుండిపోయినాడు. కాలక్రమాన శాంత రజస్వల కావటం, కాపురానికి పోవటం జరిగింది. శాంతను కాంతం పెళ్ళి అయిం తరువాత మాత్రమే ఒకసారి చూచాడు. తర్వాత మళ్ళీ చూడటం ఇదే.

ఇప్పుడు శాంతమీద అతనికున్న అభిప్రాయం ఒక్కక్షణంలో ఒక్కరోజున వచ్చిందికాదు. అది ఎలా జరిగిందో అతను చెప్పలేడు. యుక్తవయస్సులో మనమానసిక పరిస్థితి అనేక దొంకలు తిరిగి అనేక మార్పులు చెందుతుంది. ఒకక్షణాన ప్రతి ఆడదీ అమిత సౌందర్యంగా కనిపిస్తుంది. ఏగ్రామఫోనులోనించి వినిపించే సంగీతమైనా మనల్ని రంజింపచేస్తుంది. ఏనాటకాల డప్పుల చప్పుడైనా మనకు వుద్వేగం కలిగిస్తుంది. ఏ రంగుల చిత్రమైనా నేత్రానందంగా వుంటుంది. కాని పైనించి రాలేపండు అస్థిరమైన ఆకుల్నీ, కొమ్మల్నీ తప్పించుకుని భూమిమీద పడినట్లు ప్రతిమనిషీ దొంకలూ, చేలూతిరిగి రోడ్డు పట్టుతాడు. అవ్యక్తి పూర్వపుణ్య సుకృతం వల్లనూ, సాంఘిక వాతవరణంవల్లనూ అతను పట్టినరోడ్డు చిన్నదిగానూ వుంటుంది. విశాలంగానూ వుంటుంది. అప్పుడు ఒక ఆడది అందరికన్నా పైగావుంటుంది. కొన్ని ప్లేట్ల సంగీతమే పిచ్చిఎత్తిస్తుంది. రంగుల చిత్రాల కన్న మామూలు చిత్రాలే కొన్ని అసాధారణంగా కనిపిస్తయి. కొన్ని నాటకాలే వుద్రూతలూగిస్తయి. ఇది ఇలా ఎందుకయిందీ, ఏక్షణాన అయిందీ ఏవ్యక్తీ చెప్పలేకపోయినప్పటికీ ప్రతివాడూ అనుభవించేదే. అయితే కొంతమంది ఆక్షణంలో గుర్తించ లేకపోయినా ఆమార్పును జ్ఞప్తికితెచ్చుకో గలగటం జరుగుతూవుంటుంది. ఆమార్పు కలిగేటప్పుడు ప్రతివ్యక్తీ చాలా బాధపడినప్పటికీ అది జ్ఞప్తికి తెచ్చుకోవటం మహా అనందంగావుంటుంది. ఆ అనందం జీవితంలో ఒక్కసారే వస్తుంది కనక అమూల్యమయినది. మనిషి దేన్నైనా సాధించగల దేమోకాని అది మటుకు అసంభవం.

కాంతం హృదయాన్ని శాంతకూడా అలాగే ఆవరించుకుంది. శాంతకార్యం ఫలానాదినం అని అతనికి వుత్తరంవచ్చింది. అంతవరకూ శాంత విషయంలో అతనికెట్టి వికారమూలేదు. అతని విషయంలో ఎంత అన్యాయం జరిగిందీ, తత్ఫలితంగా ఆతనెంత బాధపడబోతున్నదీ అతనికి తెలియదు. అకస్మాత్తుగా అతనికి ఒకహోరు వినిపించింది—శాంత!

డాబాపైన వెన్నెల్లో అతను పుస్తకంమూసి. లాంతరు తగ్గించి, పైనించి కిందపడతానన్న గమనంకూడా లేకుండా పిట్టగోడమీద కూచుని, పక్కన రైలుపట్టాలమీద చంద్రుడి కాంతి వెన్నెల మెరవటంచూస్తే అతనికి మతిచెదరి పోయింది. ఎందుకు? ఎదురుగుండా చుట్టూ పూలచెట్లూ, తీగెలూ గల డాబాలోనించి వీచే అంత స్పష్టంగా అతనిహృదయంమీద మీటి నట్లుండటం దేనికి? ఆహోరుఅయినా సముద్రం వైపు వెళ్ళేవాడికి దూరంగా, కొద్దిగా, స్పష్టం గావినిపించినంత మాత్రంగానేవుంది. కాంతకూ అతనికీ ఇకనుంచి ఏమిటి సమ్మంధం? ఇది వరకున్న సంబంధమే ఇకనూ వుంటుందన్న సమాధానం అతనికి ఎందుకు నచ్చటం లేదో అతనికే అర్థం కావటంలేదు! చిన్నప్పుడు అతనూ కాంతా కీచులాడుకోవటం అతనికా క్షణంలో ఏవిధంగానూ చిలిపిగా కనిపించలేదు. పైపెచ్చు తలచుకుంటే అతని కారోజులు వో విధమైన గర్వం కలిగిస్తున్నయి. కాంతతో అతనే అలా కీచులాడగలిగాడు! అయితే ఇక వారిద్దరి మధ్యనుండే బాంధవ్యం ఆకీచులాట లకు తగిన ప్రతిఫలంగా కనిపించలేదు అత నికి. కాంత కీచులాడినవాడికి కాక మరొకడికి చెందటం అన్యాయం! ఇప్పటి భర్త ఒకవేళ కీచులాడేవాడు కావచ్చుకాని అంతమాత్రాన అతనికి కాంతభర్త కాదగిన అర్హతలేదు!

ఆరాత్రి కాంతానికా సముద్రపుహోరు విని పించిన క్షణంవరకూ కాంత అతనికి ఒకవిధ మైన అనవసరమైన మనిషే. సముద్రపువేపు వెళ్ళవలిసినవాడు ఆహోరునుబట్టి ప్రయాణం సాగించినా సముద్రపువొడ్డును చేరుకుంటాడు-లేక తెలియకుండానే సముద్రపువేపు వెళ్ళినా ఆవ్యక్తికి ఆహోరు అంతకంతకు పెద్దదిగా వినిపిస్తుంది! కాంతం విషయంలో ఈరెండూ జరిగినై. ఆక్షణం నించీ ఏ కారణంవల్లనూ అతను కాంతను సంస్మరించకుండా వుండ లేక పోయినాడు. స్మరించిన కొద్దీ అతని కాహోరు పెద్దదిగా వినిపించటం మొదలు పెట్టింది. అతనావిధంగా ఎందుకు బాధపడాలో అర్థం కాకపోయినా బాధపడక మాత్రం తప్ప లేదు! ఆహోరు అతన్ని పిలుస్తున్నది-కాంతా అతన్ని అంతదూరంనించి పిలుస్తున్నట్టుంది. అకస్మాత్తుగా అతనికి వక ఆలోచనతట్టింది. ఎప్పటి కప్పుడుతట్టే ఈకొత్త ఆలోచనలవల్ల మామూలు కార్యక్రమం అడుగంటుతుందన్న సంగతి అందరికీ తెలిసిన విషయం. కాంతానికి తట్టిన మహా ఆలోచన—అతనికి ఆహోరు ఎలా వినిపించిందో కాంతకూ అలాగే విని పిస్తున్నదేమో తన విషయమై! అంతవరకూ కాంత విషయమే తలచుకోనివాడు అతని విష యమై ఆమెకు ఎప్పుడైనా ఎటువంటి అభి ప్రాయంవుండేదో ఎలావూహించటం? పూర్వ కాలంలో అడవులలోవేటాడే మహారాజులకు, మహర్షులకూ ఏఆడదాని మీదైనా కోరిక కలి గితే ఆ ఆడది తప్పని సరిగా వారిజాతికి తగిన జాతి పుట్టుకకలిగినదిగానే ఆ ఆడది తేలేది-అందుకనే వారికి దానిమీద ఆకోరికకలిగేది! అటువంటిదే కనక ఈరోజులలో వర్తించేటట్ల యితే కాంత విషయం కాంతానికి ఎలావుందో, కాంతం విషయంకూడా కాంతకూ అలాగే వుండి తీరాలి! కాంతం ఇంత చిన్న చిటికెమీద ఆధారపడి ఈ నిర్ణయానికిరాలేదు. కాంత అంతదూరాన్నించీ అతనికి మేఘసందేశాలూ, వాయువాసనలూ, మనోరేడియోలూ పంపిస్తు న్నదని అతనికి స్పష్టంగా తేలిపోయింది. దానికి నిదర్శనం సముద్రం సమీపించేవాడికి హోరు ఎక్కువ ఎక్కువగా వినిపించటమే! కాంత ఎంతో బలవంతమైన మనస్సుతో ఏ వుద్దేశంతోనైనా కాంతాన్ని స్మరించటం జర క్కపోతే అతని కాహోరు అలావినపడి, దిన దిన ప్రవర్ధమానం కావటానికి కారణం వూహించుకో గలిగినంతవరకూ ఏదీలేదు. ఒకవేళ ఇదంతా కేవలం మనోవిభ్రమమే అయి కాంత అసలు అతన్ని గురించే తలచు కోకపోయినా అతని కెలాగూ ఓవిధమైన బాధ తయారైంది కనక, అతనే తన హోరు ఆమెకు వినిపించేటట్టు ఎందుకు చెయ్యకూడదు? దానికి అతను చెయ్యవలిసిందల్లా ఆమెను సంస్మరించటమే—ఇంకేమీ చెయ్యటానికి వీల్లేకపోవటం వల్ల!

ఈస్థితిలో కాంతం చదువు పూర్తిచేసి మేన మామ ఇల్లు చేరాడు. మేనమామ అతనువచ్చి నట్లు శాంతకు వుత్తరంరాస్తే కాంతం వూహించుకున్నట్లు ఆమె తనకోసం రావాలిసిందే! కాని అతనికి తెలియకపోవటంవల్ల అతనే ఆమెనుచూద్దామని వెళ్ళాడు. శాంత అక్కడ లేకపోగా తర్వాత శాంత అన్నట్టు అంతా వృథాశ్రమ అయింది. ఏకారణంవల్లనో శాంత భర్త కాంతాన్ని స్వీకరించాలిసినంత మర్యాద్యగా ఆదరించలేదు. చాలా ముభావంగా వున్నాడు. శాంత అత్తగారు కోడలివేపు బంధువులను ఏగ్రేడులో మర్యాద చెయ్యాలో అంత మర్యాదేచేసింది. దానికి కాంతం ఏవిధంగానూ సణిగి ప్రయోజనంలేదు—పిల్లనిచ్చిన వాళ్ళు చేసుకున్నవాళ్ళకి ఎప్పుడూ లోకువ కావటం రివాజే! అలాకాక పిల్లవేపు మొండిఘటాలు ఎవరైనా వరస హాస్యంచేసినా పిల్ల కణతలుపేలే పరిస్థితులు కలగటం మామూలే. పిల్ల ప్రాణాలు కాపాడటానికైనా పిల్లవేపువాళ్ల నోరుమూసుకోవటం మంచిది.

కాంతం ఆ సాయంత్రమే తిరిగివచ్చేశాడు. తలుపు తెరవగానే జడవేసుకుంటూ శాంత కనిపించింది. అతని అన్ని అనుమానాలూ ఒక్క క్షణంలోతీరినై. తన మనస్సులో ఎలా బాధ వుందో ఆమెలోనూ ఆలాగేవుందని ఆమె ముఖం చెప్పక చెప్పుతున్నది అతనికి. మేన మామ తనువచ్చినట్లు వుత్తరం రాశాడని తెలియగానే అతనికి స్పష్టంగా తెలిసిపోయింది శాంత తన్నుచూడటానికే వచ్చిందని. అతనికి హోరు వినిపించటంమాని మహాసముద్రమే అతనికి సాక్షాత్కరించింది!

కాంతం వుద్దేశ ప్రకారం ఇది మహా సముద్రమే. అతనేమి చేసినా ఆమె కాంతానికి కావలిసినట్లు లభించదు. ఆ పరిస్థితులలో ఆమె అతనిది కావటం కోరుకోతగినది అయినా, కాకపోయినా ఆటువంటి మార్పుకు అనుకూలమైన వాతావరణం సంఘంలో లేదు. ఇక శాంత లభించినంతవరకూ స్వీకరించటం—అసంభవం! అతనికి ఆడవాళ్ళతో పరిచయంవుంటే అతని మనస్సు ఎలా వుండేదో కాని అతని హృదయం ఆదో రకమైన అదవిలో పుష్పంలా వికసించింది. అది మనో విభ్రమం అయి అసహజం అయినా దాని పరిమళం, స్వచ్ఛత అపూర్వమైనదీ, అద్వితీయమైనదీ అని వొప్పుకోక తప్పదు. అతని ప్రవృత్తి అంత స్వచ్ఛమైనది కనకనే దానికి ఏమాత్రం ఏ విధమైన కల్మషం కలిగినా విషపూరితం కావటానికి సందేహం లేదు. శాంతను చూచినప్పటినుంచీ అతనికి భయం మరీ జాస్తి అయింది. అతను వూహించుకున్న రతిగా శాంత వున్నట్లయితే అతనిమాట అలా వుంచి శాంతే ఏమి చేస్తుందో! ఈ భయం ఆదివరకు అంతగా లేకపోయినా శాంతను చూచినప్పటినుంచీ మరీ ఎక్కువయింది. శాంత విషయంలో అతని బాధ కేవలం తృష్ణయే కాకపోవటంవల్ల అతని నిర్ణయానికి అష్టేశ్రమ అక్కర్లేకపోయింది. అతని సంస్కారమూ, నాగరికతా ఆ నిర్ణయానికి సహాయపడినై. ఏ విధంగా చూచినా శాంత అతనిది కావటానికి వీల్లేదు-కాకూడదు!

కాని కాంతం వూహించుకోగలిగిన దానికంటె బలమైన విషమ పరీక్షలకు గురి అయినాడు, "ఇది పట్టణంకాదు—పట్టుబట్ట కట్టుకో-నాన్నకు కోపం వస్తుంది!" అని శాంత అతనికి అతి ప్రమాదమైన దూరంలో నిలబడి మాట్లాడుతుంటే—!

"ఏంరా? నీ చదువు పూర్తి అయింది కనక-పెళ్ళిమాటేమిటి?" అన్నాడు వెంకట్రామయ్య భోజనాల ముందు, ఇది కాంతం ఇంతవరకూ వూహించుకోని సంగతి!

"ఇప్పుడా సంగతి దేనికి?" అన్నాడతను.

"ఎప్పుడైనా కావలిసిందేగా—లేక బ్రహ్మచారిగా వుంటావా-ఇప్పటి ఫేషన్ అదేలే!" వెంకట్రామయ్య నవ్వాడు.

"ఏమో! నేమీ నిశ్చయించుకోలేదు! ఎవరైనా పిల్లలున్నారా?"

"పిల్లలకేంలే. పెళ్ళి కావలిసిన వాళ్ళెప్పుడూ వుంటారు!" అన్నాడు ఆయన.

"వుంటే వుండనీ—మనకెందుకు?"

"మనకు పిల్లా కావాలి-పిల్లలున్న వాళ్ళకు పెళ్ళికొడుకూ కావాలి!" ఇందాక వచ్చాడే ఆయనకు సంబంధించిన పిల్లవుంది."

"అసలు వాడు కాదన్న మాట!"

"మనకిష్టం అయితే అసలు వాళ్ళే వస్తారు"

"ఏమో-ఇది ఆలోచించాలిసిన సంగతి!"

"నీకా పెళ్ళికూడా అయితే-నువ్వూ ఒక కుటుంబీకుడివవుతావు—అంతే!" అన్నాడు వెంకట్రామయ్య.

కాంతానికి నిద్రపట్టలేదు—ఎప్పుడు శాంత ఏం చేస్తుందో! ఒక్కరికీ తెలియకుండా కాంతం ఎటువంటి అభిప్రాయాల్ని వూహించుకుంటున్నాడు! కాని—కాంతానికి వేరే ఆలోచన వచ్చింది. శాంత భర్త అతనితో అంత ముభావంగా వుండటం దేనికి? కొంపతీసి అతను శాంత మనస్సునూ, తన మనస్సునూ పుస్తకం చదివినట్లు చదవలేదు కదా? ఒకవేళ సమీపంలో వుండే శాంత మనస్సు అతనికి అర్థంఅయి వుండచ్చు. కాని తన సంగతి ఎలా తెలుస్తుంది? అయితే ఒక్క శాంత మనస్సు తెలిస్తే చాలదూ అతను తనతో ముభావంగా వుండటానికి. అదీకాక అతను వచ్చాడని తెలియగానే శాంత ప్రయాణం కావటం! అతనికి నిజంగా శాంతమీద అలాంటి అభిప్రాయమే వుంటే అతను రేపు ఎలాగూ దిగుతాడు. కాబట్టి ఈరాత్రిగడిస్తే ఫర్వాలేదు. అదీకాక కాంతం విషయంలోనైనా శాంతభర్త వూహించుకోవటంఅసాధారణంగాకనిపించలేదు. అంత దూరాన్నించి శాంత విషయమే తనువూహించుకోగా లేనిది-! కాబట్టి కాంతం అనుకున్నట్టుగా తన విషయం వూహించుకున్నవాళ్ళు లేకపోలేదు. ఈ ఆలోచన శాంత విషయంలో గుండె రాయిచేసుకోటానికి కాంతానికి మరీ కారణం అయింది. ఎవ్వరూ కాక అసలు భర్తకే అనుమానం! దానికి కనీసం శాంత ప్రవర్తన అయినా కొంత సహాయం చేసివుండాలి. ఈవిధంగా తర్కించేవ్యక్తి కాంతం వచ్చిన నిర్ణయానికి రావటం సహజం!

తలుపు తీసుకుని శాంత బైటికివచ్చింది! కాంతం ఆరు బైటనే పడుకున్నాడు. అతని



పోలికలు

గుండె ఎన్నడూ ఎరగని దడతో కొట్టుకుంటున్నది. శాంత అతన్ని సమీపించింది-నక్షత్ర మండలం యానత్తూ చూస్తుండగా!

"బావా!" ఒక్కక్షణం-మళ్ళీ కాంతం వూరుకోవటం అసంభవం, లేచి ఆమె చెయ్యి పట్టుకుని "అటుపోదాంరా!" అన్నాడు. ఆమె అక్కడే నిలబడింది. ఆమె కొంచెం సందేహిస్తున్నట్టు తోచింది అతనికి.

"రావూ?" అతను ఆమెచేతిని గట్టిగా పట్టుకుని లాగాడు.

"ఎక్కడికో?"

"ఎక్కడ కేమిటి-నువ్విలావస్తావనితెలిస్తే నే నిదివరకే వచ్చేవాడిని—

"నన్ను ముందు వదలిపెట్టు!"

కాంతం వదిలిపెట్టలేదు. ఆమె చేతిని విడిపించుకోవాలని ప్రయత్నంచేసింది. గాజులు రెండుపగిలినై. అప్రయత్నంగా అతను వదిలిపెట్టాడు. ఆమె చరచరా తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది.

కాంతానికి ముచ్చెమటలుపోసినై. అతని మనస్సు పనిచెయ్యలేదు. అతనికి నిల్చునే

శక్తిలేదు. అతను మంచలో కూలబడి పోయి వాడు.

తెల్లవారినప్పటినించీ కాంతానికి ఒకటే భయం-శాంత తల్లితోచెప్పలేదు గదా అని! శాంత ఇన్నాళ్ళనుంచీ కాంతం వూహించు కున్నట్టే ప్రవర్తించింది కాని-నిజంగా ప్రవర్తించలేదు! ఇక ఇతరులకు తెలిసేమాట. అతనికి మొండిధైర్యం వచ్చింది. అంత అయింతరువాత ఎంతయినా ఫరవాలేదు. అతని నిర్మలత్వం ఎందుకనో కెలికిన మురికిగుంట మాదిరిగా మారిపోయింది. అతన్ని మనుష్యు లేకాక దేవతలుకూడా అన్యాయంచేసినట్టు తోచింది. అయితే అనుకున్నట్టుగా శాంత భర్త దిగాడు! భర్తరాకవల్లనో లేక్క దేనివల్లనో శాంత కాంతానికి అనుకున్నట్టుగా కనిపించ లేదు. శాంత భర్త అయినా, అతని కెదురు పడి "రాత్రి ఏంచేశావోచెప్పు!" అన్నట్టుగా చూడలేదు కాంతంవంక. అతని కొకవేళ అను మానమేవుంటే అది పరమరహస్యం!

సాయంత్రం భావిదగ్గిర కాంతం స్నానం చేస్తుండగా శాంత చిన్నబిందె తీసు కొని నీళ్ళు తోడటానికివచ్చింది. అతను అవ తలికివెళ్ళి బొక్కెన ఆమెకిచ్చాడు. ఇద్దరి చూపులూ కలుసుకున్నయి. అతనికి ఆశ్చర్యం వేసింది—శాంత బహు ప్రశాంతంగా వుంది.

"రాత్రి నువ్వు అలా చెయ్యకపోతే నేనేం అయే దాన్నో బావా! ఏ కారణం వల్లనో చెప్పలేను-నేను నిన్ను తలుచుకోని రోజు లేదు. మానాన్న నీకు చాలా అన్యాయం చేశాడు బావా! నిన్ను చూడాలని, ఆ సంగతి చెప్పాలని నేనెంత బాధపడేదాన్నో చెప్పలేను. కాని నువ్వు అలా ప్రవర్తిస్తావని నేనెప్పుడూ అనుకోలేదు. నాదే పొరబాటు? నన్ను క్షమించవూ? కాని అలా నువ్వు చెయ్యక పోతే నేనే ఏమయిపోయి ఏంచేశేదాన్నో చెప్పలేను—ఇప్పుడు తలచుకుంటే నాకు భయంగావుంది. నాకు నీమీద వక్కరవ్వ కోపంలేదు! మానాన్ననీ అని లాభంలేదు. నేనెంత అన్యాయం చేశానో ఇప్పుడు వూహిం చుకోగలను. నువ్వు దురదృష్టవంతుడివి బావా -నామీదకోపం?"

శాంత మొహం చూస్తే కాంతానికి నవ్వు వచ్చింది. ఆ నవ్వు శాంతకు మరీ భయంక రంగా తోచింది. ఆమె దబదబా నీళ్ళు తోడు కొని వెళ్ళిపోయింది.

తలుచుకుంటే కాంతానికి ఈ రోజుకూ ఆశ్చర్యంవేస్తుంది. ఆ క్షణంలో కాంతం తీర్మానించుకున్న నిశ్చయాలన్నీ అడుగంటి పోయినై. శాంత దగ్గిరికి వచ్చి "బావా!" అని పిలిస్తే కాంతం శరీరం వుడికిపోయింది. శాంతఅతని దృష్టిలో ఆక్షణంలో ఘమాయి స్తున్న మాగినఫలం. ఏ వ్యక్తి కోరకుండా వుండలేదు. కాంతం మామూలు వ్యక్తి అయి పోయినాడు. కాని అతని ప్రవర్తనే ఆఫలాన్ని అతనికి దక్కకుండా చేసింది! శాంత అన్నట్టు అతనలా ప్రవర్తించకపోతే, ఇంకో విధంగా జరిగేదేమోకాని ఆక్షణంలో కాంతా నికి,క్కవలిసింది శాంత వూహించుకున్నట్టు కాదు. దానికి విచారించాలో సంతోషించాలో కాంతానికి ఈరోజుకూ తెలియదు.

ఇప్పుడు శాంతను మళ్ళీ ఇదివరకులాగా కాంతం కావాలన్నా తలచుకోలేదు. ఆహోరు అతనికి అంతకంతకూ దూరం అయిపో యింది. శాంత స్వరూపమే మారిపోయింది అతని దృష్టిలో. ఆమె అతనివంక ఒకరకం గానే చూస్తుంది. మహాపరాధం చేసినట్టూ— దానికి ప్రాయశ్చిత్తం లేనట్టూ—వున్నా ఆమెకు చాతకానట్టూ-చేతనైనా ఆ ప్రాయశ్చిత్తానికి సరి యైన ఫలితం కలగనట్టూ! కాంతాన్ని "బావా!" అనే పిలుస్తుంది. ఆ పిలుపులో మార్పే వచ్చిందో లేక కాంతం వినటమే పొరబాటో తెలియదు—కాని ఇదివరకు లాగాలేదు. దానికి కారణం సృష్టో, సంఘంమో, కాంతో లేక కాంతమో—కాంతానికే తెలియదు!

# "లాల్ ఖిల్లా" — పన్యాల

ఇది వజవజ వణికించెడి మిడసరిలగ్నం
మది భుగభుగ మండించెడి కడసరియజ్ఞం.
కృత యుగ సారధ్యమ్మున ఖడ్గ బలప్రావీణ్యం
రుధిరజ్వాలల్లోపడి మండిమండి ఎండిఎండి
యుగయుగాల గాధావళి కబళించిన లాల్ ఖిల్లా
కిది భుగభుగ మండించెడి కడసరి యజ్ఞం
మది వజ వజ వణికించెడి మిడసరి లగ్నం.

అంతెరుగని వర్తమాన భూత భవిష్యత్కాల
స్మృతి పథాల జాతి వర్ణ మత భేదాలకు లొంగని
మయూరపీఠము పాలితప్రజా ప్రాతినిధ్యో మంట-
పమ్ము, పాలరాతివర్ణ శిల్పాల ప్రతిబింబం
రాణుల క్రీడామందిర రహస్యాల జాడల మే-
డల గోడల వాడల మూడిన కడు చిత్రాతి చిత్ర
వికృతాలకు నవ నగిషీ లందిచ్చే తిలాంజలుల
కిది వజవజ వణికించెడి మిడసరిలగ్నం
మది భుగభుగ మండించెడి కడసరియజ్ఞం.

యుగసంధ్యాస్ఫురణ బలోద్రిక్త మొగల్ దైనందిన
రణబీభత్సాల విజయపతాకాల ప్రాకారం
దేశాంతర దేశీయ విదేశీ బహు వర్తనాల
స్వాతంత్ర్య ప్రజావేశ మంతులేని గుండెబాధ
కిది భుగభుగ జ్వలియించెడి కడసరియజ్ఞం
మది వజవజ వణికించెడి మిడసరిలగ్నం.

సంధ్యా రుణ కాంతుల సంస్పందన జ్వాలా తోరణ
మహా రహా మీ బ్రహ్మాండ చరిత్ర క్షుదార్తికి హారము
వ్యథలోని సమాధుల రూపాలు దిద్దు లాల్ ఖిల్లా
కిది వజవజ వణికించెడి మిడసరిలగ్నం
మది భుగభుగ జ్వలియించెడి కడసరియజ్ఞం.



# మేడిపండు

కొలుంబరావు

ఇద్దరిలోనూ సుందరే అందగ్గత్తె. కాని సుశీలనుచూస్తే, సుశీలతో మాట్లాడితే కలిగే ఆనందం నాకు సుంధరి ఇవ్వలేదు. మళ్ళీ నన్ను సంతోషపెట్టటానికి సుందరే ఎక్కువ ప్రయత్నం చేస్తుంది. నేనంటే సుందరి కెక్కువ ఇష్టమనుకోను. అయితే నన్నాకర్షించటాని కెందుకు ప్రయత్నిస్తుం దంటే అది శుష్క విజయకాంక్ష. అందరూ సుందరి నారాధిస్తారు. ఆపిల్ల ఎదురుగాఉంటే కళ్ళతో ఆమెను గ్రోలుతారు. ఆవిడ ఏ చెత్త మాట్లాడినా చెవులు రిక్కించి వింటారు. ఆవిడకేం కావలిసినా ఒకళ్ళతో ఒకళ్ళు పోటీవేసుకుని తెచ్చిస్తారు....ఓనాడు నలుగురూ వినేటట్టు తనదగ్గిర మంచి దువ్వెన్న లేదని సుందరి అనుకుంది. మర్నాడావిడకు నాలుగు దంతపు దువ్వెన్నలు లభించినై!....

నేను సుందర్ని ఆరాధించలేను. సుశీల ఎదురుగా ఉంటే సుందరికేసి చూడలేను. సుందరీ సుశీలా ఒకేసారి మాట్లాడటం మొదలుపెడితే నాకు సుందరి చెప్పే ముక్కలు వినిపించవు. ఈ సంగతి సుందరికి తెలియక పోవటం అసంభవం. ఇది సుందరికి తీరని అవమానం....నన్ను జయించటం సుందరికి మతావేశంతో కూడుకున్న కర్తవ్యం అయిపోయింది.

నామీద విజయం సాధించటానికి సుందరి చేసే ప్రయత్నాలు చూస్తే చాలా జాలివేస్తుంది గాని, ఆ అమ్మాయి ఆప్రయత్నాలు మానితే గాని నే నామెకు ఏ మాత్రమైనా సుముఖుణ్ణి కావటానికి వీల్లేదు.

నాకు తనమీద సదభిప్రాయం కలగాలని సుందరి సుశీలతో పోటీ చేస్తుంది. అదృష్ట వశాత్తూ సుశీల నన్ను ఉబ్బెయ్యా లని చూడదు. చాలాసార్లు నన్ను నిర్మొహ మోటంగా విమర్శిస్తుంది. అటువంటప్పుడు సుందరి నన్ను వెనకేసుకొస్తుంది. సుశీలచేత విమర్శించుకోవటమే నా కెక్కువ ఇష్టమేమో నని సుందరి గ్రహించలేదు....స్వార్థంలోనే అరవై గడియలూ గడిపే ఇతర మనుషులల్లేనే సుందరికూడా ఆత్మవిమర్శ చేసికోవటానికి బొత్తిగా అసమర్థురాలు.

తన కెవరెవరిమీద ఎంతెంత ఇష్టమో సుందరి రోజూ చెబుతుంది. లిస్టువారిగా ఈ హెచ్చుతగ్గుల పట్టిక వేసినట్టయితే ఆవిడ

అతిశయాన్ని అధికంగా తృప్తిపరిచే వాళ్ళు ముందు వచ్చి, గ్రేడుగా మిగిలిన వాళ్ళు వస్తారు. ఏ మాట కామాటే చెప్పాలి; డబ్బున్న వాళ్ళని సుందరి లిస్టులో హెచ్చు స్థానం ఇవ్వదు.

తన భక్తులెవరైనా రాగానే సుందరి నాతో మాట్లాడటం మానేసి వాళ్ళ సేవలు స్వీకరించ టానికి పరిగెత్తి పోతుంది. వాళ్ళు వెళ్ళిపోగానే మళ్ళీ నా కెదురుగా వచ్చి కూచుంటుంది. ఇదంతా నేను చూసి గ్రహిస్తున్నాననీ, గ్రహించ గలననీకూడా తెలుసుకోక అందరి కన్నా తనకు నామీదే ఎక్కువ అభిమానం ఉన్నట్టు నటిస్తుంది. ("నా కబద్ధాలాడే వాళ్ళంటే మంట. నువు ఖచ్చితంగా నిజం చెప్పేస్తావు. అట్లా నిజం చెప్పేవాళ్ళంటే నాకు తగని యిష్టం.")

లోలోపల సుందరి నన్ను చూసి ద్వేషి స్తుందనుకుంటాను, స్వార్థంలో మునిగి తేలే వాళ్ళకి మనస్తత్వం తెలుసుకోగల వాళ్ళంటే భయమూ కోపమూ ఉండటంలో వింత లేదు. కాని నామీద ఉన్న ఈ కోపం సుందరి పైకి కనిపించనివ్వదు. అయినా నామీద ఉండే నిర్లక్ష్యం సుందరి అప్రయత్నంగా ఎప్పుడూ బయట వేసుకుంటుంది. నాకు కలిగే కష్టాలు గురించి చెబితే పరధ్యానంగా ఉండి విచారం అభినయించటంకూడా మరిచిపోతుంది. ఇత రులు మాట్లాడేది తనకు సంబంధించిన ప్రశంస కాకబోతే, పాపం, సుందరి శ్రద్ధగా ఆలకించలేదు.

సుందరి ప్రణయాలను గురించికూడా నేను చూస్తూ ఉంటాను. సుందరి హృదయంలో ప్రేమించే శక్తి లేదనుకోవటం పొరపాటు. ఆశక్తి యావత్తూ తనను తాను ప్రేమించు కోవటానికి వినియోగిస్తూనే ఉంటుంది సుం దరి. తనమీద తనకు జాలి కలిగినప్పుడు పుట్టెడు దిగులుతో ఎవరితోనూ పలక్కుండా కూచుంటుంది. తనమీద తనకు ప్రణయ కోపం కలిగినప్పుడు ఆత్మహింసన ప్రారం భించి, మంచి చీరె కట్టక, మొహానికి ఫేసు పౌడరు వెయ్యక, "నా బొంద ! నా శ్రాద్ధం !" అని తిట్టుకుంటూ కూచుంటుంది. తనమీద తనకాపేక్ష కలిగినప్పుడు పట్టరాని ఉల్లాసంలో ఉండి బెంగాలు కరువు గురించి చెప్పినా ఆకాశంనుంచి దిగివచ్చి ఒక నిట్టూర్పు విడవదు.

తన్ను తాను అంతగా ప్రేమించుకునే మనిషి ఒకర్ని సరిగా ప్రేమించలేదు. అందు చేత సుందరి అందర్నీ అంతో యింతో ప్రేమిస్తుంది. సూర్యారావయేది, సుబ్బారావ యేది, సుందరమ్మయేది, శోభనాద్రి అయేది— అందరికీ యెదురుగా కూచుని నిట్టూరుస్తుంది. రకరకాల వయసులవాళ్ళూ, వృత్తులవాళ్ళూ రోజూ వచ్చి సుందరికెదురుగా కూచుని నిట్టూర్చిపోతారు. అంతూ పొంతూ లేని ఈ "కోర్టింగు" ఆఖరుకెక్కడ అంతమవుతుందో ఊహించటం నాకు సాధ్యమయేది కాదు.

సుందరి ప్రేమను గురించి జాస్తి మాట్లా డేది. సౌందర్యం గురించికూడా మాట్లాడేది. వాటిలో విశ్వాసంగల మంచి ఆడపిల్లలకోసం "రెడీమేడ్"గా సౌందర్యమూ ప్రేమా ఎక్క ణ్ణించో వచ్చి పడతయ్యని సుందరి విశ్వాసం. వాటిని జీవితంలో సృష్టించుకోవాలనీ, అది ఎంతో శ్రమతో కూడినపని అనీ సుందరి ఎరగదు.

అనేకసార్లు సుందరిని అడిగాను: "ఒక తట్టెడు ప్రేమ వచ్చి నీ ఒళ్ళో పడితే అది ఖర్చుచేసి ఆనందంలో యీదులాడుదామని సూచిస్తున్నావు. ప్రేమను నిత్యమూ సృష్టించు కోవటానికే విధంగా నువు కష్టించబోతు

న్నావు? ఆ ఉత్తమ విలవకోసం ఏ చిన్న విలవలు త్యాగం చెయ్యబోతున్నావు?" అని.

"నువు వొట్టి ప్రోలిటేరియను మాదిరిగా మాట్లాడతావు. ప్రేమకు తద్దెడూ, బుద్దెడూ అనే లెక్క ఉందా ఏమిటి? అది అనంతం. ఎంత తీసినా తరగదు," అని సుందరి సమాధానం చెప్పేది.

ప్రేమ విషయంలో నేను ప్రోలిటేరియనునే. దానికోసం శ్రమించాలని నా విశ్వాసం.

"అంత అనంతమైన ప్రేమ గల మనిషి ఎవడు? వాడు నీ దగ్గిరికెందు కొస్తాడు? దాన్ని నీ కెందు కిస్తాడు?" అని నే నడిగాను.

"ప్రేమ ఇచ్చేవాడు కారణం తెలుసుకుని యిస్తాడా? అవ్యాజ ప్రేమ అంటూ ఉండదా?" అని అడిగింది సుందరి.

దురదృష్టవశాత్తూ సుశీలకి ప్రేమలో అసలే విశ్వాసంలేదు. ఎప్పుడన్నా నేను ప్రేమ గురించి మాట్లాడితే, "సెంటిమెంటల్ స్టఫ్!" అనేది.

"మరి నువునన్నెందుకు ప్రేమిస్తున్నావు?" అని ఎగతాళి చేసేవాణ్ణి.

"నాన్సెన్స్! నే నెవర్నీ ప్రేమించటం లేదు. నిన్నూ ప్రేమించటం లేదు. నిన్ను చూస్తే యిష్టం ఉంది. చాలామందిని చూస్తే యిష్టం ఉంది," అనేది సుశీల.

"అది అబద్ధం. నువు నన్నే ప్రేమిస్తున్నావు. నన్ను పెళ్ళిచేసుకోకపోతే నువు 'మిజరబుల్' అయిపోతావు. నీ మనసులో ఉన్న అందమంతా అడివిన కాసిన వెన్నెల అయిపోతుంది," అన్నాను.

మీ మొగవాళ్ళెంత అహంకారులు;.... నే నెవర్నీ పెళ్ళిచేసుకుని అయినా ఘమారుగా సుఖపడగలను. నా సుఖం సృష్టించుకునే శక్తి నామనస్సులో ఉంది." అన్నది సుశీల.

"మీ చెల్లెలు తన సుఖమంతా బయటనే ఉందనీ, ఏదోవిధంగా తన కందుతుందనీ అనుకుంటున్నది. నువ్వేమో అంతా నీ మనస్సులోనే ఉందనుకుంటున్నావు ఏది నిజం?" అన్నాను.

"నేనేం చెప్పగలను? నేననుకునేది నాకు నిజం," అన్నది సుశీల.

సుశీలా సుందరీ నాకు దూరంగా బంధువులు, దగ్గిరిగా స్నేహితులు. వాళ్ళింటో రోజు కెన్ని గంటలు గడపటానికైనా నా కధికారం ఉంది, నాకు పెళ్ళికాలేదు, వాళ్ళకి పెళ్ళిళ్ళు కాలేదు. నేనా యిద్దర్లో ఎవర్ని పెళ్ళాడుతానన్నా ఇంటోఉన్న పై వాళ్ళెవరూ పేచీ పెట్టరు. ఈ ఇద్దర్నీకాక మరో పరాయి పిల్లను చేసుకుంటే గుండెపగిలి బాధపడే వారెవరూలేనిమాటా నిజమేమరి. ఇదీఉన్న పరిస్థితి.

ఈ స్థితిలో లక్ష్మీకాంతంవచ్చి మా మధ్య పడ్డాడు. లక్ష్మీకాంతం ఎవరి మొదటిదృష్టినైనా బలంగా ఆకర్షించగలవాడు. అతను చూడటానికే సినిమాస్టారు మోస్తరుగా ఉంటాడు. సినిమాల్లో పాటలన్నీ జయప్రదంగా పాడతాడు. ఆధునిక కవిత్వం గంటల కొద్దీ వప్పగించగలడు. సరదాగా మాట్లాడతాడు. సినిమాతార లందర్నీ ఇంటర్వ్యూచేసి నట్టు కనిపిస్తాడు. ఆధునిక రచయిత లందరితోనూ అంతో యింతో పరిచయంఉన్నట్టు కనిపిస్తాడు. టెన్నిస్, పింగ్‌పాంగ్ మొదలైన ఆటలాడుతాడు, చాలా డబ్బున్నది. మామూలుగా ఈ అక్కచెల్లెళ్ళ చుట్టూ పరిభ్రమించే శలభాలకీ ఈగొల్లభామకీ తేడా ఏమంటే ఇతను ఒక్క సుందరితోనే ఆకర్షించబడక సుశీల

చేత ఆకర్షించబడినట్లు కనిపించాడు. పైపెచ్చు ఎవరితో మాట్లాడుతున్నప్పుడు వారి మనస్తత్వానికి అనుగుణంగా మారిపొయ్యేవాడు. ఈ మార్పు గమనిస్తున్న నాకు చాలా వింతగా ఉండేది. అతను ఇద్దర్నీ ఆకర్షించటానికి ప్రయత్నిస్తున్నట్టు నాకర్థమయింది.

సుందర్ని పట్ట పగ్గాల్లేవు. అనుక్షణమూ లక్ష్మీకాంతంగారి కేం కావాలో ఆలోచిస్తున్నట్టు కనపడేది. సుశీలకూడా అతను లేని సమయాల్లో అతన్ని అంచనా కట్టటానికి ప్రయత్నించసాగింది.

నా అంచనా నేను చెప్పాను.

ఇతను ఒకరకం సెకండు హేండు మనిషి. సొంతాన ఒకపాట పాడలేడు; ఒక గీతం రాయలేడు. అతని సంభాషణకూడా పూర్తిగా ఎరువు సంభాషణ మాదిరిగానే కనబడింది.

"నువతన్ని చూసి అసూయపడుతున్నావు!" అంది సుశీల.

"దేనికి అసూయ?" అని అడిగాను.

దేనికో సుశీల చెప్పలేదు. చెబితే నేను నొచ్చుకుంటా ననుకున్నదో, లేక ఫలాని దాని కని ఆమెకు తెలీదో నేను చెప్పలేను.

"లేకపోతే అతన్ని సెకండుహేండు మనిషని ఎందుకన్నావ్?" అన్నది.

"నిజమనుకుని అన్నాను." అని సమాధానం చెప్పాను.

"నువ్వనాలి!" అన్నది సుశీల.

ఈ సంభాషణ జరగ్గానే నేను సుందర్ని ఒంటరిగా పట్టుకుని, "సుందా, నీతో కాస్సేపు మాట్లాడాలి. బుద్ధి కలిగి వింటావా?" అన్నాను.

"వింటాను. చెప్పు." అన్నది సుందరి.

"మీ సుశీల ఎవర్నిచూసి గాని భ్రమసినట్టు నువు ఎరుగుదువా?" అన్నాను.



సమస్య?

[ప్రేయసిని సంపాదించగలిగితే పదిరూపాయలు ఖర్చు. మర్చిపోవటానికి ఇరవై!]

"చెప్పు!" అన్నది సుందరి.

"లక్ష్మీకాంతంమీద సుశీలకు చాలా మనస్సు తగిలినట్టుంది. వాళ్ళిద్దరికీ పెళ్ళయితే చాలా బాగుంటుంది కాదూ?" అన్నాను.

సుందరి కాస్సేపాలోచించి, "దానికి మగవాళ్లంటేనే మంట. అది లక్ష్మీకాంతంగార్ని పెళ్ళాడుతుందనుకోను." అన్నది.

"పెళ్ళాడకపోతే సరే. పెళ్ళాడే పక్షంలో మనం వాళ్ల కడ్డం రావటం మంచిది కాదు. ఏమంటావ్?"

"సుశీలని నువ్వెందుకు పెళ్ళాడవు?" అన్నది సుందరి విషయం మార్చి.

"ఇప్పుడా విషయం దేనికొచ్చింది? నా కిష్టముంటే నేను పెళ్ళాడనా?" అన్నాను.

"మీ యిద్దరికీ ఒకరంటే ఒకరు చాలా యిష్టమనుకున్నాను ? మరీ నీకు—"

"నేను నీకన్న తనను ఎక్కువగా చూశాను గనక సుశీల నన్ను ఎక్కువగా చూసింది. నా కన్న నిన్ను బాగా చూసిన వాళ్లను నువు అభిమానంతో చూశావు. ఇంతకన్న ఏ ముందీ ?"

"నువు చాలా పొరపాటు పడ్డావు. నేను నిన్నెప్పుడూ తక్కువగా చూడలేదు. వాళ్లంతా అనేమాటలు నే నెప్పుడూ నమ్మలేదు. నీ మాటలే నమ్మాను....నాకెంత యిష్టం లేక పోయినా నువు చెప్పేమాటలు గురించి ఎప్పుడూ ఆలోచిస్తాను."

"లక్ష్మీకాంతం గురించి ఏమిటి నీ అభి ప్రాయం ?"

"మంచివాడే గాని....సొంత డబ్బా జాస్తి. ఇంకోరు మాట్లాడేది వినిపించుకోడు."

నేను నవ్వాను. "నీ జబ్బే !"

"నా కా జబ్బున్నదని నువు చెప్పింతరవాత నేను వినిపించుకుంటున్నాను !" అన్నది సుందరి పోట్లాటకొస్తూ.

"చాలా మంచిదానివి కాని, వాళ్ళిద్దరి మధ్యా రాకు. సుశీలతో పోటీ చెయ్యకు. అతన్ని తప్పించుకు తిరుగు." అని సలహా చెప్పాను.

"నువూ సుశీలా పెళ్ళి చేసుకుంటారను కున్నాను. ఏమిటి నువు వాళ్ళిద్దరికీ పెళ్ళి చేనేస్తున్నావు ?" అన్నది సుందరి.

నేను చెప్పినమాట వేదవాక్యంగా స్వీక రించి సుందరి లక్ష్మీకాంతాన్ని తప్పించుకు తిరగసాగింది. అంతేకాక నామీద ఎన్నడూ లేని శ్రద్ధచూపసాగింది. ఆవిషయం నేనాట్టే సీరియస్‌గా తీసుకోలేదు.

ఈ సమయంలో సుశీల నాతో ఒక ఆశ్చ ర్యకరమైనమాట అన్నది.

"సుందరికి నీవంటి మొగుడు దొరికితే దాని చిలిపితనం కొంత బాగుపడొచ్చనుకుం టాను. మీ రిద్దరూ ఎందుకు పెళ్ళిచేసుకో రాదు ?"

"నాకు సీరియస్‌గా ఉండే మనుషులిష్టం. అయినా నువ్వన్నట్టు ఏమనిషితోనైనా కొంత వరకు సుఖంగా కాలంగడపొచ్చునని నేనూ నిశ్చయించుకున్నాను....ఇంతకూ నీ పెళ్ళి ఒకటి జరగనీ. సుందరి పెళ్ళి కేంతొందర?" అన్నాను.

లక్ష్మీకాంతం తప్పకుండా తనని పెళ్ళాడ తాడనే ధైర్యంతో ఉందనుకుంటాను సుశీల. ఇది నిజమయితే లక్ష్మీకాంతం సుశీలను పూర్తిగా "షాక్" చేశాడు. అతను అకస్మా త్తుగా వాళ్ళ నాన్నగారితో, "మీసుందరిని పెళ్ళాడాలని ఉంది. మీరు అంగీకరిస్తారా?". అని అడిగాడు.

సుందరినడిగి చెప్పాలి అన్నాడు వాళ్ళ నాన్న. సుందరి తనకు ప్రస్తుతం పెళ్ళి ఆలో చనలేదన్నది.

లక్ష్మీకాంతం మళ్ళీ కనిపించలేదు. అతను ఏ. ఆర్. పీ. లో చేరినట్టు తెలిసింది.

తనకు పెద్ద ఆశాభంగం అయిన సంగతి ప్రపంచానికి తెలియకుండా ఉండాలని చాలా ప్రయత్నించింది.

"లక్ష్మీకాంతం చాలా మంచివాడు. అతన్ని సుందరి పెళ్ళాడి ఉండవలిసింది. వొద్దనటం చాలా పొరపాటు." అన్నది సుశీల నిర్లిప్తత నటిస్తూ.

"అంత మంచివాణ్ని పెళ్ళాడి ఉండవలి సిన సుందర్ని నన్నెందుకు పెళ్ళాడమన్నావు. సుశీలా?" అని అడిగాను.

సుశీల ఇప్పుడు నాతో సరిగా మాట్లాడదు.




పక్క టాకీలోంచి ప్రతిరోజూ "కరుణా సింధో, కాంచనచేలా" అని పాటవినపడుతుంది సాయంత్రం.

ఈ కాంచనచేలా అర్థంకాదు నాకు. ఎవరినన్నా, జరీవుత్తరీయ్యం వేసుకున్నవాడా, అని స్తుతిస్తామా? అని ఆశ్చర్యపడతాను.

"నీ కాంచనచేలా, సరేలే, ఆ కరుణాసింధో ఏమిటిముందు చెప్పు," అన్నారు లీల.

"ఏం?"

"శ్రీరాముడు ఎవరిపైన కరుణ ప్రత్యేకం చూపాడూ?" అని అడిగారు.

యోచించాను – నిజమే. ఎవరికిచూపాడు కరుణ?

ఆలోచించి ఆలోచించి, నేను యీ absurdity చూడలేకపోయినాననే అగౌరవం తీసేసుకోడానికి—"అహల్య అంటారేమో?" అన్నాను బలహీనంగా!

"ఏంకరుణ! "నాతిని రాతినిగా!" అదేనా? చెయ్యమను, ఓరాతిని నాతినిగానో, కోతినిగానో, మంచి యింద్రజాలికుడందుము. కాని ఆరుషే ఆశాపంలోనే పెట్టాడు రాతినాతి కావాలని. ఈయన యరక్కుండా ఆతోవన పోయినాడు. ఏమిటా కరుణ!" అన్నారు.

ఇన్నికోట్లమంది ప్రతిరోజూ రామ భజన చేస్తారా, బాగా తెలివిగల వాళ్ళకే, అన్నీ జాగ్రత్తగా విడతీసి ఆలోచించేవాళ్ళకే, వాళ్ళ భక్తివల్లనో, ఏమో, ఏ సందేహాలూ కలగవు.

ఎవరియడల కరుణ చూపాడు? ఆంజనేయులా? మరి ఎవడు చూపడు అంత సహాయంచేసిన అతనిమీద! ఏ జీతం అడక్కుండా భక్తితో గంతులేసి, వీపుమీద మోసుకుపోయే కోతి దొరికితే; విభీషణుడా? అన్ననెదిరించి తనకి సహాయం చెయ్యవొచ్చినవాణ్ణి అసహ్యించుకుని తరమక, తన కార్యసాధనకోసం చాలా బాగా వుపయోగించుకున్నాడు విభీషణుణ్ణి. శబరినా; ఆ భక్తిలో అంతా శబరిఘనతేకాని శ్రీరాముడిది ఏముంది? పూజిస్తానంటే, ఆహా, బాగాపూజించు అన్నాడు. ఎవరిమీద చూపాడు కరుణ? ప్రతి మనిషికీ వుంటుంది, కరుణ. ఎప్పుడో ఒకప్పుడు! కరుణాసింధో అని ప్రత్యేకంగా అనడానికి ఏదో గొప్ప కరుణ కనిపించాలి.

దేవుడికింద కాకపోయినా, మనిషికిందైనా, నిలబడాలి; ఇందరు పూజించే విగ్రహం. రామాయణం మతగ్రంథంగా కాకపోతే రాముణ్ణి ఆదర్శంచేసుకోకపోతే, ఏదో పూర్వ కాలమప్పుడే ఎంత గొప్పకావ్యం వ్రాశారా అనుకోడానికి ఏం అభ్యంతరం వుండదు. ఆనాడే ఎంత ధర్మబద్ధుణ్ణి చిత్రించగలిగారో, ఏమైనా, శ్రీరాముడి sense of duty, struggle గొప్పవనిపిస్తాయి.

"అవన్నీ తీసిపెట్టు. ఇంకా పూర్వోత్తరం మాటలు మాట్లాడకు. Sense of duty ఎప్పుడు మెచ్చుకుంటాము? ఆ డ్యూటీ తనది

ఐనప్పుడు. తండ్రి ఇచ్చినవరం డ్యూటీ తనది ఎట్లా అయింది? వృత్త కీర్తులకోసం పడే తంటాలుగాని ఇవి? ముందు ఇట్లాంటి వివే కాలు నేర్పాలి పిల్లలికి.

"సత్యంవద" అని బడిగోడలమీద వ్రాశి ఏంలాభం? సరిగా, ఆలోచించి, వివేకంగా మాట్లాడటం నేర్పాలిగాని. తెలివి తక్కువగా మాట్లాడిన ప్రతిమాటా నిలబెట్టుకో చూస్తే హరిశ్చంద్రుడిగతే పడుతుంది, మనుషులకి. దేవతలు అతని రాజ్యం ఇప్పించిం తరవాత హరిశ్చంద్రుడు మారిపోయి వుండాలి. కాక పోతే ప్రతివాడూ వొచ్చి ఏదో అతనిచేత వాగించి రాజ్యం లాక్కుని వుండడూ? తండ్రి ధర్మాల్ని, తండ్రు లనే ప్రతి అవివేక పుమాటల్ని పరిపాలించమను కొడుకుల్ని.

"ఇంకా రామాయణంలో నయం శ్రీరాముడు, ఉత్తర రామాయణంలో మరీ అన్యాయం" అన్నారు లీల్.

"భవభూతి ఉత్తర రామాయణంలో, రాముణ్ణి చాలా గొప్పగా చిత్రించాడంటారు" అన్నాను.

"మీరేమంటారు?"

"నేను చదివాను తెలుగులో. ఎంతప్రయ త్నించినా ఆ మహా గొప్పతనమేమిటో కన పళ్లేదు నాకు. నాకు మరి అర్థంకాలేదో, తెలుసుకునే తాహతు నాకులేదో, అను కున్నాను."

"ఆమాట మీఅంతటివారు అంటున్నారా?"

"ఏమీ? నాకైనా సమస్తమైన కళా జ్ఞానం...."

"అట్లా క్రిందకి జారడమే మీలో ముఖ్య మైన లోపం. ఎక్కడ, ఏమూల లోకంలో, మనుష్యస్వభావాలలో, పుస్తకాల్లో, అందాలు గొప్పలు చూడగలిగిన మీకళ్ళకి, భవ భూతిలో అంత స్ఫుటంగా, చిత్రించిన అందం కనపడకపోయిందా?"

"కాని చాలామంచి రసజ్ఞులు........"

"ఎవరు వాళ్ళు?"

ఉత్తరరామచరిత్రకన్న గొప్ప గ్రంధం ఇంక లేదని అనే నామిత్రుల్ని తలుచుకున్నాను ఒక్కొకర్నే.

"అవును. నాకు కనపడేఅందాలు వాళ్ళకి కనపడవు."

"ఎవళ్ళకి?"

"ఆ భవభూతి రసజ్ఞులకి, తక్కినఅందాలకి చాలా సంకుచితం వాళ్ళకళ్ళు."

"మరి ఇంకేం? అనండి గట్టిగా, అనండి భవభూతి వృత్తడాబు, వృత్త సెన్టిమెంటు వుత్త చెత్త," అని. ఎందుకు భయపడతారు, అనడానికి! మీరు! మీరు! పదిమందీ మంచి దంటున్నారే, నేనే తప్పేనని ఇంకా అను కుంటోవుంటే, మీరు నేను రైటు అని ఎప్పు డంటారు ఇంకా?"

మంచి dose నా గర్వానికి, నా తిరగ బాటుకి, "కాళిదాసూ అంతే, ఆకణ్వుడి శ్లోకాలు ఒకటే చదువుకుంటారు, అంతకన్న అందంలేదని, ఇంతాచేస్తే అతను అన్న దేమిటి? ఈపెంచినపిల్లని విడవడం రుషికి నాకే ఇట్లావుంటె, సంసారులకి ఎట్లావుంటుం దని!" అన్నాను, సమర్థించుకోడానికి.

"అవును. నే ననేదీ అదే. వుత్తమామూలు సెన్టిమెంటుని కొంచెం అందంగా అన్నాడు. ప్రతివాడి మనసులోనూ, ప్రతిపిల్లయడలా అనుకున్నదాన్ని. ఎవరూ ఇదివరకు ఎన్నడూ చూడని విలువల్ని చూపనిఅందాన్ని ఎన్నో

తెలియచేశారు మీరు. ఇట్లాంటి చచ్చు. సెన్టిమెంట్లని ఎన్నింటినో నరికారు. మీరు కూడా వాళ్ళందరిమల్లే, కాళిదాసు, భవభూతి, అనిరెప్పలు తేలవేస్తారెందుకు? గొప్ప కావ్యాలే,అనాటికి, ఈనాటికీ తెలుసుకోతగ్గ అందాలున్నాయి వాటిలో. అంతేకాని...."

"ఈనాటి పుస్తకాలసంగతి........"

"ఈనాటి పుస్తకాలుమాత్రం; ఆ కన్యాశుల్కం........"

"అవునవును. ఈ ప్రపంచమాదిగా అంత నాటకం లేదనీ, ముందు వుండబోదనీ అంటారు. నాకుమాత్రం ఏదో amusing గా వుంటుంది. కొంత సత్యాన్ని, సంఘం..."

"వాళ్ళమల్లే మీరూ అట్లా మూలగకండి. అంతకుఘ్న నాటకం, కాదు, పుస్తకం కనపడదు. చత్తపుస్తకాలు లక్ష - అదికుఘ్న పుస్తకం - అంతా వెక్కిరింపు. ఒక్క గౌరవం, ఒక్కబరువు, ఒక్కలక్ష్యం, విలువా లేని పుస్తకాల్ని...."

"అవును. కాని గురజాడ అప్పారావు వ్రాసింది. ఆ కవిత్వం, లేఖలో ఆశయాలు."

"అవన్నీ తెస్తారెందుకు? ఆయన గొప్ప వాడే కావొచ్చు. ఆయన కవిత్వం గొప్పది కావొచ్చు. కాని ఈ నాటకం సంగతి నేను మాట్లాడేది. ఇదే మనుషులలో వొచ్చిన చిక్కు. గొప్ప మనిషైతే, కవిత్వం గొప్పదా? కవిత్వం గొప్పదైతే, నాటకం గొప్పదా? నాటకం గొప్పదైతే, పాత్రలు గొప్పవా? రామాయణంతో వొచ్చిన తగాదాకూడా అదే. రామాయణం గొప్పకావ్యమైతే, రాముడు ఆదర్శంకావాలా?"

"అవును. కావ్యాలకింద చూడక, ఆ పుస్తకాలకి మహిమల వివ్వడంవల్లనే వొచ్చింది యీ అనర్థం. దాంతో పాత్రలు ఆదర్శాలు కావడం."

"అనాటికి ఆదర్శాలుగా తోచినవి,ఈనాడూ ఆదర్శాలనడమే వొచ్చిన ఖర్మం. ఈనాటికి ఆపాత్రలలో లోపాలూ అన్యాయాలు ప్రజలకి కనబడకపోతే, ఇంక కొత్త గ్రంథాలకి విలవ కట్టి విమర్శనలు వ్రాయగలరా మరి? ఎంతో ముందుకు సాగాం, అనుకుంటారేగాని. ఆపాత పాత్రపట్ల ఏమాత్రమూ వొదలలేదు యీ పత్రికలగాళ్ళ మనసుల్లోంచి. అందుకనే ఏ కొత్త ఆశయాలూ, పాత్రలూ వాళ్ళకి అర్థం కావు. పైకి నీతీ, సంఘం, సభ్యతా, అని అరుస్తారు."

"మీ ఉత్తరరామాయణంలో శ్రీరాముడు సీతని అడివికిపంపించడం కఠోరం అని సందేహిస్తో అటూ ఇటూచూసి మూలగడం వరకు వొచ్చారు ప్రజలు. కాని అసలు నీచత్వం అందులోలేదు; ప్రజాక్షేమానికై, ఆదర్శరాచరికానికై, తనధర్మం అనుకొని.."

"ప్రేమించేభార్యకి. తనడ్యూటీకి ఆ స్ట్రగుల్ గొప్పగావుంది కదూ?"

"అవును. కాని చూడండి, తనధర్మమేదో రాముడికి తెలీదు. ప్రజలు అనుకున్నదాకా చరబడ్డ భార్యని స్వీకరించి గర్భవతినిచెయ్యడంలో ఏమి వికృతం కనిపించలేదు అతనికి. సీతని పరిత్యజించాలని వశిష్టుడు బోధించిందాకా అతనికి కర్తవ్యం తెలీలేదు, ఆ చక్రవర్తికి. (ఈయనా అవతారమున్నూ, యుగాలకియుగాలు కోట్లకొలది ప్రజలకి ఆదర్శమూనూ!) ఇన్ని శాస్త్రాలు చదివిన ఆ ధర్మస్వరూపుడికి. తన కర్తవ్యం తెలిపింతరవాతనైనా, సీతతో ఎదుటపడి మాట్లాడలేదు. అతనిబాధా, ధర్మనిష్టా, అంత మహాపతివ్రతా అర్థంచేసుకోదని భయం. ఎందుకంటే ఎంత



పతివ్రత ఐ మతిపోగొట్టుకున్నా. గర్భవతి, మాతృత్వ సహజాత్వం చావలేదు ఆమెలో. పిల్లలకోసమన్నా తగాదా పెడుతుంది. అందుకని ఆ అబద్ధం, వాల్మీకి ఆశ్రమం చూపిస్తామని. ఈ ఘోరాలన్నిటిలోనూ రాముడు ఎంత అల్పుడైనాడో ఈనాటికీ తెలీదు ప్రజలకి.

"స్త్రీని ఇంత చవకచేసుకుని, నశించింది ఎవరనుకున్నారు? పురుషులు. బాధపడ్డవాళ్ళు స్త్రీలు. నశించినవాళ్ళు పురుషులు, ఆనాటికీ, ఈనాటికికూడా. తాము అన్యాయంచేసిన స్త్రీముందు నిలబడడం మొగాడికి ఎంతభయం! శ్రీరాముడే తార్కాణం, ముందు అతని అంతరాత్మ అభ్యంతరం. ఆత్యాగం తనలోపల్నించి వొచ్చిందికాదు. ప్రజాభిప్రాయానికి లోబడడం, శాస్త్రానికి కట్టుపడడం—తరవాత ముఖ్యం తనలోపం. ఏంలోపమా? ప్రేమలోలోపం - సీత ఇచ్చే ప్రేమముందు తేలికపడే తన స్వభావంలో లోపం. చాలామంది మొగవాళ్ళు స్త్రీలయడల వుత్తదొంగ లవడానికి ఇదే కారణం. ప్రేమసంగతి వొచ్చేప్పటికి స్త్రీముందు ఎంత తేలిపోతాడనుకున్నారు పురుషుడు, అతనికి తెలీకండా అతని మనసులోనే!"

అందుకనే బైటివిలవలు కట్టుకుని మురుస్తాడుగావును పురుషుడు! అనుకున్నాను.

"అట్లా ధర్మానికీ హృదయానికీ మధ్య మధనపడే పాత్రనే సృష్టించాలనుకున్నాడేమో వాల్మీకి."

"అట్లా అంటే తగాదా ఏదీ! ఏ లోపమూ లేని ఆదర్శపురుషుణ్ణి సృష్టించాడనీ ఈనాటికీ అంటోవుండడంవల్లనేగా ఇంత ఘోష. శ్రీకృష్ణుడే అయితే, ఎవడివిరా? నాభార్యని ఎంచుతావా? అని వాణ్ణి హతమార్చివుండును. ఎన్నటికీ వసిష్టుణ్ణి అడగడు, నోరెత్తనీడు. అతనిభార్యని ఎవడూ సంశయించడు. సంశయించనీడు. పురుషుడంటే అతనూ. తన వంశ నీచత్వంలోంచి, తన కుయుక్తుల్లోంచి, మోసాలలోంచి, తనను తాను నిలబెట్టుకుంటాడు. ఒక్క సీతలో శ్రీరాముడికి ఇన్ని సమస్యలు. పదహారువేలమందితో ఏసమస్యా లేదు శ్రీకృష్ణుడికి. అతనూ పురుషుడంటే. తగాదాలు, ఈర్ష్యలు, అలకలు, శృంగార జీవితానికీ రంగునిచ్చేప్రతి హంశమూ వుంది. కాని ఎవరిదగ్గిర, వారికి అనునయంగా, రక్తిగా, యుక్తిగా, ఎవరికివారికే తనవాడే కృష్ణుడన్నట్టు మెలుగుతాడు."




# గుమ్మడి పదాల కధ

కైలాసరెడ్డి కట్టించిన ఏడు కోటలలోను పేరు ప్రతిష్టలలో అన్నిటినీ మించింది కోట కతారి.

కతారి రంగారెడ్డికి ఎనభై యేండ్లు. మొదటి భార్య భర్త వృద్ధు అయినా తాను వృద్ధుగా భర్తకు కనబడకూడదని వైకుంఠయాత్ర పోయింది.

కతారి రంగారెడ్డికి సేనా నాయకుడైన బాకుల వెంకారెడ్డికి జన్మించింది గొబ్బి. బాకుల మధ్య పెరిగింది. బాకుల మధ్య ఆడుకుంది. పదహారేండ్ల వరహా మూలైన గొబ్బిని కతారి రంగారెడ్డి పెండ్లాడాడు. వంశవృద్ధికి వేరుదారి లేక పోయింది.



వయస్సుకు వృద్ధయినా ప్రేమలో పసివాడు కతారిరెడ్డి. గొబ్బి తలిదండ్రులకు గొప్పగొప్ప బహుమానాలిచ్చాడు. గొబ్బి తండ్రిని ముఖ్యమంత్రిచేసి గొబ్బి మేనత్త కుమారుడ్ని సేనా నాయకుడ్నిగా నియమించాడు.

కోట కతారీ కానువాయి ప్రకారం వారాని కొకసారి రాజనివాసం దగ్గరా ఒకసారి రాణీ నివాసందగ్గిరా సేనా నాయకుడు ఉవిణీ వేయాలి.

మేనత్త కుమారుడు సేనానాయకుడు. సేనానాయకుడు గుమ్మానికెదురుగా వంచ కళ్యాణీ గుర్రాన్ని ఎక్కి ఉవిణీ చేస్తున్నాడు.

కిటికీలోనుంచుని జాబిలిని చూస్తున్నది గొబ్బి. ఉవిణీ చేస్తూ జాబిల్లిని చూస్తున్నాడు. కుమారి రెడ్డి. ఇద్దర్నీ చూస్తున్నది జాబిల్లి. నిముషాలు గడిచాయి. నిద్దర్లు పోయాయి. పగలుకూడా జాబిల్లి కనబడుతునే ఉంది. దీని కర్థం ఏమిటో ఎవరికీ తెలియలా!

రెండవవారం వచ్చింది. ఆకాశాన జాబిల్లి లేదు. గొబ్బిముఖం చూస్తూన్నాడు కుమారరెడ్డి. చుక్కల వికాసం చూస్తూన్నది గొబ్బి.

మూడవవారం ముఖాముఖీ చూచుకున్నారు మేనత్త మేనమామ బిడ్డలు. మూడవవారం మేనత్త మేనమామ బిడ్డలకు మన్మధుడు స్నేహితుడైనాడు.

గాలివానా విసురుతూ వచ్చింది నాలుగోవారం. గుమ్మానికెదురుగానున్న మామిడి చెట్టుకు గుర్రాన్నికట్టాడు కుమారరెడ్డి. కుప్పించి గంతుతో కోట కిటికీ ఎక్కాడు కోట సేనానాయకుడు.

శిష్ట్లా ఉమామహేశ్వరరావు



వానలో తడవకుండా మేడలోకు వెళ్ళ కుండా కిటికీలో కూర్చున్నాడు కుమార రెడ్డి. వద్దూ అనలేదు కద్దూ అనలేదు గొబ్బి. వెనక్కు పోలేదు ముందుకు రాలేదు. చుక్కలకు విసుగేసింది. చీక టికి చిన్నతనం తోచింది. తెల్లవారింది.

చెలియ జాబిల్లి చుక్కలకు మధ్యగా చేమంతి సింహాసనమీద కూర్చుంది.

"గొబ్బీ గొబ్బీ బావను పలకరిం చావా?" అన్నది జాబిల్లి.

"ముసాలిభర్తైనా ముద్దుగా చూసు కుంటున్నాడు. అర్ధమిచ్చాడు అర్ధ సింహా సనమిచ్చాడు. నమ్మకమిచ్చాడు నామ మిచ్చాడు. ఆయనే మనుకుంటాడు. బావతో మాటాడితే వదిలొచ్చిన పుట్టిం టితో సంబంధం మొదలేసినట్టుంటుంది. వద్దు! పలకరింపా వద్దు, పులకరింపా వద్దు జాబిల్లీ!" అన్నది గొబ్బి.

కుమారా! కుమారా! మేనమామ కూతుర్ని పరామర్శ చేశావా? అన్నది జాబిల్లి.

వీరనాయకుణ్ణి నేను ఈ కోటకు సేనానాయకుణ్ణి. రక్షణధారినిగానీ నేను యక్షవిహారిని గాదు. పరామర్శా వద్దు నాకు ఏ విమర్శావద్దు! అన్నాడు కుమారరెడ్డి.

అయిదోవారం పోయి ఆరోవారం వచ్చింది. అర్ధరాత్రి అర్ధంలేని తుపాను వాన కురుస్తున్నది. ఆరాత్రి కర్ధంలేదు ఆ తుపాను కర్ధంలేదు ఆ చేష్టల కర్ధంలేదు. ఆ గొబ్బి కర్ధంలేదు ఆ కుమారరెడ్డి కర్ధంలేదు.

అదంతా మిధ్య!

ఇదంతా సత్యం!

విన్నవాడెవరో కన్నవాడెవరో కూశాడు కూతలను కోటచుట్టూ. ఊదాడు ఊహ లను ఊరంతటంతా!

కోట కఠారిరెడ్డికి గుండెల్లో కఠా రియే గుచ్చుకుంది. ఈడుకూ చిన్నదే అనుభవంలో చిన్నదే, చిన్నతనాన క్షాత్రధర్మానికని గొబ్బి శిక్ష పొందటం అతని కిష్టంలేదు. కష్టం గుండెలో జష్టగా నొప్పేస్తున్నది. అవమానం అంతస్సులో అంకుశంగా దిగిపోతు న్నది. అయినా ఈడుకూ చిన్నదే అను భవంలో చిన్నదే గొబ్బి. గొబ్బి బలిద్దెట్టి పోవటం భర్త కోట కఠారిరెడ్డికి ఇషం లేదు.

ఇష్టానుసారాన్ని బట్టి లేదు శాస్త్రం
న్యాయ్యం ప్రజకేదో ప్రజాపతికీ అదే!
చిన్నదైనా అనుభవం తక్కువదైనా
న్యాయ్యం ఎదో తెలుసు గొబ్బికి.

ఆవేశుడైనా ఆధీనుడైనా విధ్యుక్త వ్యతిరేకిగాడు కుమారరెడ్డి.

నేరుగా తీరుగా రాజమందిరం పోయాడు కుమారరెడ్డి.


ఆ వంశంలో దారులు రెండే తప్పిన వారికి. కొండ కోనల్లోకు పోయి కుల భ్రష్టులవడమో—కోసిన శిరస్సు పరిహార మివ్వడమో.

దారులు రెంటిలోను రెండవది చూపాడు ఉదారుడైన కోట కతారి రెడ్డి.

రాజమందిరంలోకి పోయిన కుమార రెడ్డి బైటకు రాలేదు. కోట కతారిరెడ్డి సింహాసనాని కెదురుగా తివాచిమీదు కూర్చున్నాడు. వీరచిహ్నాలు ఒకటొకటే తీసి ముందుకూర్చాడు. బాకు మొనతో రక్తనాళం వ్యక్తపరిచాడు.

రాజమందిరంలో నట్టింట నేలమీద కూర్చున్నది గొబ్బి. నెత్తికి సూటిగా పైన పసుపూ బొట్టూ పెట్టిన గుమ్మడి వేలాడుతున్నది. గుమ్మడిని చూస్తూ ఈ పాట పాడింది గొబ్బి.

నేలమీద అల్లుకోవె గుమ్మడీ
విశ్వమంతా
రాలమీద అల్లుకోవే గుమ్మడీ!
శీలమెంతో కాపాడవె గుమ్మడీ!
సింహాసన
కాలమెంతో కాపాడవె గుమ్మడీ!
ధర్మమెంతో రక్షించవె గుమ్మడీ!
ఆడవారి
కర్మమెంతో రక్షించవెగుమ్మడీ
పెండ్లిండ్లెంతో ఉద్ధరించు గుమ్మడీ



చిన్నతనాల
తల్లిండ్లెంతో ఉద్ధరించు గుమ్మడీ
నేలమీద అల్లుకోవే గుమ్మడీ
విశ్వమంతా
రాలమీద అల్లుకోవే గుమ్మడీ!

హటాలున కతారితో గుండెమీద గుచ్చింది గుండెకు పిడికిలి అనేంత వరకూ గొబ్బి. వెనక్కు చేరగిలింది గొబ్బి. వేలాడు గుమ్మడి తటాలున ఊడి తలగడగా వచ్చింది. అనాటు పుట్టాయి గుమ్మడి పదాలు.



# రైతు సిరులకై

౧

ఆరికు పురుగుముట్టింది. వర్షాలు యెగబెట్టాయి. కంకులకు తెగులు తగిలింది. దానా, దీనా పంటపాడైంది. కళ్లంలో నూర్చగావచ్చిన పదిగింజలు, ఇయ్యవలసిన వాళ్ళందరికీ ఇయ్యగా, మిగిలినవి పాతకాలం పాటు 'స్వామి' కుటుంబానికి సరిపోతాయి.

స్వామి మోతుబరి రైతు. ఘరానా మనిషి, ఏదో రెండు ఎకరాలు పెట్టుకొని కాలక్షేపం చేస్తున్నాడు. సంవత్సరం పొడుగునా పశువులకు గడ్డి కావాలి. కుటుంబానికి తిండికావాలి. పంటలు చూడబోతే ఈవిధంగా ఉన్నాయి. ఏమిటి చేసేది. దాచుకొన్న కొద్ది గింజలు ఆ నాటికానాడు క్షీణిస్తున్నాయి. గాదె ఎప్పుడు నిండుకుంటుందో గదాయని స్వామికీ అతని భార్యకీ బెంగపట్టుకొంది.

తెల్లారడంతోనే బర్రె గొడ్డును విడిచి పెటుతుంది స్వామి భార్య. అది వచ్చేలోపుగా, పిల్లలకూ భర్తకూ అన్నంపెట్టి తాను తింటుంధి. బర్రె గొడ్డువచ్చాక దాన్ని చూచుకొంటుంది. తాను గంపా, తవ్వుగోలా పుచ్చుకొని గడ్డి దోకడానికి కొండ ప్రక్కకిపోతుంది. భర్తా పిల్లలూ పొలానికి ఎరువుతోలే పనిలో ఉంటారు. పొద్దు నెత్తిమీదికి వచ్చేసరికి ఆమె ఇంటికివచ్చి, ఇంత వండి, భర్తకీ పిల్లలకీ, అన్నం మూటకట్టి పొలానికి తీసుకుపోతుంది.

వారి కుటుంబంలో ధనం లోపించినా సంతుష్టి లోపించలేదు. భగవంతుడిచ్చిన కూడు గుడ్డతో కాలక్షేపం చేస్తూ ఇంతే మనకు ప్రాప్తం అనుకొని వాళ్లు సంతుష్టిగా ఉంటున్నారు. ఆసంతుష్టిని చెరిచే పరిస్థితులు నేడు కలుగబోతున్నాయి.

మధ్యాహ్నంపూట స్వామి తల్లి ఇంటిబయట కుర్చీపీట వేసుకొని రాటం ముందుపెట్టుకొని నూలుతీస్తూఉంటుంది. ఆనూలే ఆకుటుంబాని కంతటకీ ఒక సంవత్సరం పాటు గుడ్డనిస్తుంది.

గాదెలో గింజలు నిండుకొన్నాయి. స్వామి భార్యకు అభిమానం జాస్తి. అయిన ఇంటి ఆడబడుచు అవడంవల్ల కాబోలు, పొరుగింటికివెళ్ళి గింజలు బదులైనా తేదు. ఇక గింజలు సంపాదించే

చింతా దీక్షితులు

బాధ్యత స్వామిమీద పడ్డది. ఎలాగో తంటాలు పడుతున్నాడు. కొంతకాలం పాటునుంచి అర్ధాకలిమెతుకులతో ఆ కుటుంబం కాలక్షేపంచేస్తోంది.

౨

ధర్మపురంలో రైతులందరూ కలసి సభ చేసుకొంటున్నారని చుట్టుపట్ల గ్రామాలవారందరికీ తెలియచ్చింది. స్వామి కూడా చూచాయగా విన్నాడు. నీలాటి రేవున కూడే గ్రామమహిళా మండలిలో ఈవిషయం చర్చకు వచ్చినందువల్ల, స్వామి భార్యకున్నూ తెలియవచ్చింది. ఇంటికి వచ్చి "రైతు సభలు, ఏమిటి చెప్పండి," అని అడిగింది భర్తని. తన కేమి తెలియదన్నాడు స్వామి.

"అక్కడికిగానీ మీరుపోతే మంచిది కాదు? రైతులకేవేవో సదుపాయాలు చేస్తారుట. లాభాలిస్తారుట. కష్టాలు లేకుండా చేస్తారుట," అంది స్వామి భార్య.

"ఏమో ఏమిచేస్తారో నాకుతెలియదు. నేనుగానే వెళ్ళవలసివస్తే ఎరువు తోలడం ఆగిపోతుంది. ఇప్పటినుంచి జాగ్రత్తపడితేనే తప్ప వచ్చేయేడుకూడా ఈ అవస్తేపడుతుంది మనకు. నేనెట్లా పోయేదబ్బా?" అన్నాడు స్వామి.

"ఎప్పుడూ ఇంటిపట్టున కూర్చుంటే మనకు వచ్చేదేమిటి? లోకంలో రైతులందరూ ఏమిచేస్తున్నారో తెలుసుకోవద్దా? బీద రయితులకు భాగ్యవంతులు సహాయంచేస్తారు కాబోలు, లేదా మన కష్టానికి తగ్గఫలం వచ్చేమార్గంచూస్తారు కాబోలు, ఇంటి దగ్గర కూర్చుంటే ఏమి తెలుస్తుంది పోయిరారాదా?" అంది స్వామి భార్య.

"ఏమిటో నీ చాదస్తంగాని, పోతే మనకు వచ్చేదేమిటి? వెనక బట్టినవానలు కురవమంటే కురుస్తాయా! పురుగు ముట్ట వద్దంటే మానుతుందా! పంటకు తెగులు పట్టకుండా ఉండమంటే ఉంటుందా!" అన్నాడు స్వామి.

"అయ్యో అమాయకమా! పురుగు ముట్టకుండాను, తెగులు పట్టకుండాను మందులు వేస్తున్నారంటగా. అలాగే వర్షాలు కురిపిస్తారేమో" అంది స్వామి భార్య.

"ఎవరుచెప్పారే ఈ చాదస్తం మాటలన్నీ? రైతులందరూచేరి సభ చేసుకుంటే, వానలు కురుస్తాయా, పంటలు పండుతాయా? కష్టపడి పని చెయ్యాలి, భగవంతుడి దయఉండాలి." అన్నాడు స్వామి.

"వెళ్ళిచూస్తేగా ఏం జరిగేది తెలిసేది. పోనీ ఒకమారు పోయిరారాదు? ఈ ఏటికి గింజలు లేక ఇంత, తటపటాయిస్తున్నాము గదా! అక్కడికి గాని పోతే ఎవరైనా ఏదైనా సదుపాయం చేస్తారేమో కనుక్కోవచ్చుగా? ఇక్కడ అప్పులు చేసుకు తినే బదులు అక్కడికి పోతే మంచిదని నాకు తోస్తోంది. ఆ సభలో రయితుల నందరినీ బాగుచేస్తారంటగా" అంది స్వామి భార్య.

౩

ధర్మపురంలో రైతుల సభ వైభవంగా జరుగుతోంది. సభాభవనం బ్రహ్మాండంగా తయారయింది. అలంకరణాలు ఎంతో అందంగాచేశారు. రయితులకు



వారితో భోజనాలు చేశాడు. వాళ్ళతో సభావనం అలంకరించాడు. ఆనాటి సభాధ్యక్షుణ్ణి ఊరేగిస్తూ, సభకు తీసుకువచ్చారు. నూతన వస్త్రమాల్యాలంకృతుణ్ణి చేశారు. స్వామి చూచి ఉప్పొంగి పోయాడు. సభా భవనంనిండా జెండాలు ఎగిరిపోతున్నాయి. "రైతు విరులకీ జై" అనే కేకలు మిన్ను ముట్టుకున్నాయి.ఆనాడు పెద్దపెద్ద వక్తలు ఉపన్యాసాలు ఇచ్చారు, స్వామి చెవినిపడ్డ విషయాలు యివి:

వసతి గృహాలు ఏర్పాటుచేశారు. వ్యవశాయశాఖవారు ప్రదర్శనాలుకూడా చేశారు. హలాయుధము ధరించినబలరాముని విగ్రహమూ, గోవులను పాలించే శ్రీ కృష్ణుని విగ్రహమూ సభాభవనంలో గద్దె మీద ప్రతిష్ఠించారు. వివిధగ్రామాలలో పండే పంటలు ప్రదర్శనానికి వచ్చాయి, వ్యవశాయశాఖవారి ఆంబోతులువచ్చాయి.

నానా గ్రామాలనుంచీ వందలకొద్దీ రైతులు ధర్మపురం వేంచేశారు. స్వామి కూడా ధర్మపురంవచ్చాడు. సభా మంటపాలు చూసినా, వసతి గృహాలుచూసినా అతని కడుపు నిండుతోంది. అంతకన్న యెక్కువగా తనతోడి రయితులను చూచినప్పుడు ఆనందం అతిశయించింది. తనకు తటస్థపడ్డ వాళ్ళందరితోనూ స్నేహంచేశాడు. వారితో కాఫీలుతాగేడు.

సృష్టిలోకల్లా రైతుఒక్కడే ఉత్కృష్టుడు. రైతులేందే లోకమేలేదు. రయితులేందే లోకానికి తిండేలేదు. భూమి గోవువంటిది. రయితు గోపాలుడు, అతడు భూమినుండి పిండేపాలే పంటలు. అందువల్లనే మన పురాణాల్లో అవతార పురుషులుగా వర్ణింపబడ్డ రామకృష్ణులిద్దరూ, రైతులకు ప్రతినిధులవలె వెలుగుతున్నారు.

రయితులూడ్చిన చెమటే సృష్టిని సారవంతం చేస్తోంది. రయితుకంట నీరుకారితే లోకమే క్షోభిస్తుంది.

అట్టి రయితు నేడు దీనావస్థలో ఉండడం ఎంత సిగ్గుచేటు. రయితులకు కట్టగుడ్డా, తినతిండీ ఉన్ననాడే లోకానికి కల్యాణం. రయితు దుఃఖించిననాడు లోకానికి సంకటమే.

స్వామికి ఈ మాటలు వినడంవల్ల తనస్థితి జ్ఞాపకంవచ్చింది. ఈ సభకు వచ్చినందుకు ఎవరేమిసహాయంచేస్తారో, ఎట్టి లాభం ఉండబోతుందో ఇంకా అతనికేమీ తెలియలేదు. ఇంతమట్టుకు కలిగిన లాభం ఒక్కటే. అతనికి ఒక జెండా ఇచ్చారు. ఆ జెండా జాగ్రత్తగా పట్టుకొని సభలో కూర్చున్నాడు.

రయితు సభలు నాలుగు రోజులూ వైభవంగా జరిగాయి. ఒకనాడు బాజా భజంత్రీలతో బ్యాండు మేళాలతో రైతుల ఊరేగింపు ఉత్సవం జరిగింది. రైతులందరూ, ఆ ఉత్సవంలో రకరకాల దుస్తులతో, రకరకాల వేషాలతో జయ, జయధ్వానాలు చేసుకొంటూ పోతున్నారు. కొంతమంది నిక్కర్లు తొడిగారు. కొంతమంది లాల్చీలు, కొంతమంది షర్టు, కొంతమంది కోట్లు, కొంతమంది సూట్లు, అచ్చంగా రైతుకట్టుకొనే బట్టకు రైతు కట్టుకునేవిధంగా కట్టుకొని, రైతుపట్టుకునే కర్ర పట్టుకొని, రైతు పెట్టుకొనే బొట్టుపెట్టుకొని రైతు తొడుక్కునే కిర్రు చెప్పులు తొడుక్కుని, మూర్తీభవించి మూర్తులా రైతులాగ ఉన్నవాడు మన స్వామి రైతు ఒక్కడే. రైతులు ఛాలామంది స్వామినిచూచి ముచ్చట పడ్డారు. వలుగురు అమాంతంగా స్వామిని భుజాలమీదికి ఎత్తుకొన్నారు. "రైతు వీరులకీ జై" అని అందరు కేకలువేశారు. ఆక్షణంలో స్వామి రైతు స్వర్గఖండాన్ని రుచిచూచాడు. అతణ్ణి దింపారు. ఉత్సవం సాగిపోయింది.

ఆ నాలుగు రోజుల్లోనూ అవి బుర్రకథలుగావు. అవి బొబ్బిలి పదములుగావు. అవి గొల్ల సుద్దులుగావు. అవి నాటకాలుగావు. ఎక్కడచూచినా ఏదో ఒక వినోదము! ఎక్కడచూచినా ఏదో ఒక తమాషా!

వచ్చిన రైతులందరికీ నాలుగు రోజులూ భక్ష్యపరమాన్నాలతో భోజనాలుకూడా పెట్టారు.

౪

సభలు ముగిసినవి. స్వామి సుష్టుగా భోజనాలుచేశాడు. నాలుగు రోజులూ ప్రపంచాన్ని అంతా మరచి సుఖంలో లీనమయిపోయాడు. రయితు అంటే ఎంత గొప్పవాడో అతని కప్పుడు బోధ గట్టింది. తాను రైతుననే గర్వం అతనిలో మొలకెత్తింది. నాగలి బొమ్మ ఉన్న జెండా చంకనిరికించుకొన్నాడు.

రయితు లందరూ ఇళ్ళమొహం పట్టారు, స్వామికూడా ఇంటి మొహం పట్టాడు. తనకు పరిచితులైన కొందరు



రయితులతో ముచ్చటించాడు, తన కేదైనా సదుపాయం చేస్తారేమోనని. ఎవరూ మాట్లాడలేదు. సభలో కూడా అటువంటి సదుపాయాలను గురించిన చర్చవచ్చినట్టు అతనికి కనిపించలేదు,

సభా వైభవ దృశ్యాలు స్మరించు కొంటూ స్వామి ఇంటికివచ్చాడు. స్వామి భార్య బిడ్డలతోకూడా ఎదురు వచ్చింది. స్వామి చిరునవ్వునవ్వి తాను తెచ్చిన జెండా భార్యకు చూపించాడు, స్వామి పిల్లలా జెండానుపుచ్చుకొని వీధు లోనికి పరుగెత్తుకొనిపోయి దాంతో ఆడుకొంటున్నారు.

"వెళ్ళొచ్చారా" అంది స్వామిభార్య.

"ఆ," ఎంత వైభవంగా జరిగిందను కున్నావు, రయితుసభ, ఎంతెంత పెద్ద పాకలువేశారు, ఎంతెంత మంది భోంచే శారు. ఎన్నెన్ని వినోదాలు కమ్ను చెదిరి పోయేటట్టున్నాయి!....................."

"వైభవా లెలాపోతేయేం లెండి; మన కెవరైనా ఉపకారం చేస్తా మన్నారా?" అంది స్వామి భార్య.

"నాకు స్నేహితులైనవారిని కను క్కున్నాను, ఎవరూ మాట్లాడలేదు." అన్నాడు స్వామి.

"పోనీ: ఆసభనీ అడగలేక పోయా రా?" అంది స్వామి భార్య.


సభ నెలాగడగాలో తెలియలేదు స్వామికి. ఊరుకొన్నాడు.

"రయితు సభ, రయితు సభ, అంటే ఏమిటో అనుకొన్నాను. కడుపునిండా తిండి తినడంకోసమా మీరక్కడి కెడత? మీరు తినేటప్పుడు పిల్లలు జ్ఞాప కంవచ్చారా? నేను జ్ఞాపకంవచ్చానా? గాదెలో గింజలు లేవనేసంగతి జ్ఞాపకం వచ్చిందా? మీ రక్కడి కెందుకెళ్ళినట్టి? ఏం తెచ్చినట్టు?" అంది స్వామి భార్య.

"నన్నేం చెయ్యమంటావు? నువ్వెళ్ళ మంటే నేవెళ్ళాను! ఏం తెచ్చానంటావా? ఇదుగో తెచ్చిన జెండా నీకుచూపనే చూపాను" అన్నాడు స్వామి,

సభాదృశ్యం అతని మనసులో ఒక్కమారు తళుక్కుమంది "రైతు వీరులకీ జై" అనేమాట అప్రయత్నంగా అతని నోటినుండి బయటికివచ్చింది. పిల్లలు జెండా ఇంటిమీద కట్టి కంట్రి అన్నమాటవిని తాముకూడా "రయితు వీరులకీ జై" అన్నారు.

స్వామి భార్య మూతి ముడుచుకొని సజ్జగింజ లుడకపెట్టడానికి ఇంట్లోకి పోయింది.



# సారస్వత సేవ

[ఈ. ల.]

బ్రహ్మ చాలా శ్రద్ధతో సృష్టి కలాపం ముగించాడు. తన సృష్టిని చూచి ఆనందించాడు. చక్కని అంగసౌష్ఠవం సమకూర్చాడు. అతన్ని గొప్ప దేశభక్తునిగాసృష్టించాలని బ్రహ్మ తలచాడు. దేశభక్తునికి కావలసిన గుణాలను సమకూర్చాడు. దేశభక్తుడు తన మాతృభూమి కోసం పడాల్సినకష్టాలను సహించేందుకు దృఢకాయుణ్ణిగా తయారుచేశాడు. ఈ కార్యం ముగిసినపిదప ప్రాణంపోసేడు. వెంటనే ఆయనసృష్టించిన మానవుడు లేచి భక్తివినయాలతో ముందు నిలబడ్డాడు. అతనివుద్దేశం కనుగొనేటందుకు బ్రహ్మ "బిడ్డా! నీవు భూలోకములో ఏవిధంగా నీ జీవితాన్ని గడపదలచావు?" అని ప్రశ్నించాడు.

మానవుడు: ప్రభూ! నాకు వేరేవిధమైన కోర్కెలుఏమీలేవు. సారస్వతసేవ జేసి ఈ జీవితాన్ని గడపాలని వుంది. తన్మూలంగా జనసాహిత్యాన్ని సృష్టించి జనసేవ చేయాలనివుంది. ఈ ఏకైక లక్ష్యానికి జీవితాన్ని ధారబోసేందుకు తగినశక్తిని ప్రసాదించండి.

బ్రహ్మ ఈమాటలువిని ఆలోచనా మగ్నుడయాడు. ఏమీ పాలుపోలేదు. తను ఒకందుకు చేసినపని మరోవిధంగా పరిణమించింది. ఇలా పరిణమిస్తుందని అనుకుని వుండలేదు. ప్రేమతోఅన్నాడు, "బిడ్డా! నీవు సారస్వత సేవచేస్తే నాకేమీ అభ్యంతరము లేదు. ఎందుకంటే నీవు జనసాహిత్య నిర్మాణం చేస్తానన్నావు. అదికూడ ఒకవిధమైన దేశభక్తే. కాని అసలువిషయం ఏమంటే నేను నిన్ను అందుకుగా సృష్టించివుండలేదు. అలా అనుకునివుంటే దానికి కావలసినశక్తి సామర్థ్యాలను నీకు ప్రసాదించి వుండేవాడినే. అలాంటి సారస్వతసృష్టి చేసే శక్తి నీకు యిచ్చివుండకపోవటం విచారకరమైన సంగతి."

ఈమాటలు విని ఆ మానవుడు కంట తడిబెట్టాడు. . .తన సృష్టి ఈవిధంగా విలపించటంచూసి బ్రహ్మ దిగులుపడి అన్నాడు—"బిడ్డా! ఊరడిల్లుము. ఈవిషయంలో సరస్వతినికూడా పిలిచి సలహా తీసుకుంటాను. ఆమె ఏదైనా తగిన సలహా యివ్వగలుగుతుంది." అని సరస్వతిని పిలిచి బ్రహ్మ అన్నాడు—"దేవీ నేడు నేనొక చిక్కులోపడ్డాను. నాకేమీ పాలుపోకుండా వుంది. నీవు ఏదైనా తగినసలహా యివ్వవలసిం"దని జరిగిన వృత్తాంతం వినిపించాడు.

అప్పుడు సరస్వతి బాగా ఆలోచించిన మీదట "ప్రభూ! మీరు విచారింప బనిలేదు. ఈ మానవునికోర్కె నెరవేరటానికి ఏమీ అభ్యంతరము వుండదు. అతన్ని ఆంధ్రదేశానికి పంపించండి," అన్నది.

బ్రహ్మ "తథాస్తు" అన్నాడు.



# వాగ్దత్త

**...శరత్ బాబు...**

(గతసంచిక తరువాయి)

"అవిద్య పుస్తకాలు చదివితేనూ, నోటవల్లిస్తేనూ వచ్చేదికాదు. వాళ్ళఎదుట దున్ని చూపించవలసి ఉంటుంది—ఇలా చేస్తే మామూలుకంటే రెండురెట్లు—రెండురెట్లేమిటి? నాలుగురెట్లు పండుతుంది. దానికి పొలముండాలి, నీరుండాలి—తలఎత్తి మబ్బువంక చూడాల్సిన అవసరం ఉండదు! ఇప్పుడు అర్థమయిందా, అతను పాఠశాల చెట్టుక్రింద ఎందుకు పెడతాడో? ఒక్కమాటుగనక అతని స్కూలుకువచ్చి పైరు చూశారంటే కళ్ళునిండిపోతై—ఈ మాట నేను గ్యారంటీగా చెప్పగలను. ఇంకా పొద్దు ఉన్నది - ఇవ్వాళే పోదామా?—ఆ కనపడేదే."

విజయ ముఖభంగిమ క్రమంగ గంభీరమూ, కఠినమూ అయి—"ఊహుఁ. ఇవ్వాళకు ఆగండి," అన్నది.

"ఐతేవద్దు లెండి," అన్నాడు ఆ వ్యక్తి సహజంగా—"పదండి, ఇంకా కొంచెందూరం పంపించి వస్తాను." అని ఆమెవెంట నడవసాగాడు.

ఐదారు నిమిషాలు విజయ ఏమీ మాట్లాడలేదు. లోలోపల ఎందుకనో ఆమెకు సిగ్గు వేస్తున్నది. దీనికి కారణం ఎంత వెదికినా ఆమెకు కనిపించలేదు. ఆవ్యక్తి మళ్ళీ మాట్లాడాడు.

"మతకార్యంకోసం మీరతని ఇల్లు తీసుకున్నప్పుడు—ఈ కొద్ది పొలం - సత్కార్యానికే వినియోగపడుతున్నది కాబట్టి - మీరనాయాసంగా అది వదిలిపెట్టవచ్చు ననుకుంటాను?" అని అతను చిరునవ్వు నవ్వడం మొదలుపెట్టాడు.

దీనికి జవాబుగా విజయ గంభీరంగా—"మీ కేమి అధికారం ఉందీ, వారి తరుపున ఈ కోరిక కోరటానికి?" అని వోరగంట ఆ వ్యక్తిని చూసింది. అతని నవ్వులో మార్పు ఏమీ కనపడలే దామెకు.

"ఈ అధికారం ఇచ్చేవారిమీద ఏమీ ఉండదు. తీసుకునేవారిమీద ఉంటుంది. మంచి పనిచేయటానికి అధికారం మానవుడు భగవంతుని దగ్గరనించే పొందుతాడు - మరొకమానవుని దగ్గర చెయ్యి చాచనక్కరలేదు. ఏ అనుగ్రహం కోరినందుకు మీరు లోలోపల విసుక్కున్నారో, అదిగనక లభించినట్లయితే ఎవరికి చెందేదో తెలుసునా, ఈ దేశంలో అన్నంలేని రైతులకు. మనశాస్త్రాల్లో ఉంది, దరిద్రంకూడా భగవంతుని ఒక అవతారమేనని. అతన్ని సేవించటానికి మనకందరికీ అధికారముంది. దీనికోసం నరేంద్రుని దగ్గరకు ఎందుకుపోతానో చెప్పండి?" అని ఆ వ్యక్తి నవ్వటం మొదలుపెట్టాడు.

"కాని మీమిత్రుడు కేవలం దీనికోసం ఇక్కడ ఉండిపోడుకదా?" అన్నది విజయ నడుస్తూ నడుస్తూనే.

"ఉహుం. కాని, అతనాపని నాకు చెప్పి పోవచ్చు."

విజయ పెదవులమీద మందహాసం తొణికింది. కాని, ఆమె మహాగంభీరంగా— "ఆ సంగతి నేను ఊహించాను" అనిఅన్నది.

"తప్పక ఊహించవలసిన సంగతేగా. పూర్వం ఈ పనులన్నీ చేసే భారం జమీందార్లమీద ఉండేది. వాళ్ళు మాన్యాలు ఇవ్వవలసి ఉండేది. ఇప్పుడా బాధ్యత లేదనుకోండి; కాని ఆచారం మాత్రం పోలేదు. అందుకనే, మోసపుచ్చి ఎవరైనా రెండు మూడెకరాల పొలం గుంజుకోవాలని చూస్తే పూర్వ సంస్కారం ఉండడంమూలాన ఇట్టే పసికడతారు;" అని ఆ వ్యక్తి మళ్ళీ నవ్వటం మొదలుపెట్టాడు.

విజయకూడా ఈ నవ్వులో కలవాలని చూసింది. కాని కలవలేక పోయింది. ఈ నిష్కల్మషమైన నవ్వు ఆమె హృదయంలో ఎక్కడో పొడుచుకున్నట్టుగా ఉంది. ఆమె కొంచెం సేపు మాట్లాడకుండా నడిచి—"మీరైనా ఆశ్రయమివ్వవచ్చుగా మీ స్నేహితునికి?" అని అడిగింది.

"ఎందు కివ్వకూడదూ? కాని, నేనిక్కడ ఉండను కదా? బహుశా ఈ వారంలోనే వెళ్ళిపోతాను."

విజయ మనస్సులో చకితురాలయింది:—"కాని, మీ ఇల్లు ఇక్కడే కాబట్టి తరుచుగా వస్తూ పోతూ ఉంటారనుకుంటాను." అన్నది.

ఆ వ్యక్తి తల అడ్డంగా తిప్పుతూ - "ఉహుం. బహుశా, నేనిక రావలసిన అవసరం ఉండదనుకుంటాను." అన్నాడు.

విజయ హృదయంలో ఏదో కెలికినట్లయింది. ఇక ఈ విషయమై ప్రశ్నించటం ఏవిధంగానూ ఉచితంకాదని కూడా మనసులో అనుకున్నది. కాని, ఆమె తన కుతూహలాన్ని ఎంతమాత్రం అణచుకోలేక మెల్లగా అడిగింది:—"ఇక్కడ మీ ఇంటివారినీ, ఇంటినీ కనిపెట్టి ఉండటానికి మీ మనుషు లెలాగూ ఉన్నారనుకుంటాను; కాని—"

ఆ వ్యక్తి నవ్వుతూ—"ఉహుం. అలాంటివారెవరూ లేరు." అన్నాడు.

"అయితే మీ తల్లిదండ్రులు—"

"నాకు తల్లిదండ్రులూ, సోదరీ సోదరులు ఎవ్వరూలేరు—ఇదిగో మీ ఇంటిదాకా వచ్చేశాము. నమస్కారం, నేను వెళ్ళుతున్నాను." అని ఆ వ్యక్తి ఆగాడు.

విజయ ఇక అతని ముఖంవంక చూడలేకపోయింది. కాని మెల్లగా—"లోపలికి రారా?" అని అన్నది.

"ఉహుం. తిరిగి వెళ్ళేవరకు చాలా చీకటి పడుతుంది. నమస్కారం!"

విజయ చేతులెత్తి ప్రతి నమస్కారం చేసి, చాలా సంకోచిస్తూ మెల్లగా—"మీ మిత్రుణ్ణి ఒకమాటు రాసబిహారీబాబు దగ్గరకు వెళ్ళమని చెప్పలేరా?" అని అడిగింది.

అవ్యక్తి ఆశ్చర్యంతో-"వారిదగ్గర కెందుకూ?" అన్నాడు.

"వారేకదూ, మా నాన్నగారి ఆస్తి అంతా చూసేదీ?"

"ఆసంగతి నాకుతెలుసు, కాని వారిదగ్గరికి పొమ్మంటారెందుకూ?"

విజయ ఈప్రశ్నకు జవాబేమీ ఇవ్వలేకపోయింది. అవ్యక్తి ఒక్కక్షణం మెదలకుండా నుంచున్నాడు—బహుశా ఆమెజవాబు కనుక్కుంటాను. ఆతర్వాత-"నేను తిరిగి వెళ్లేవరకు చాలా పొద్దు పోతుంది-ఐతే వస్తాను" అని, తొందరగా అడుగులువేసుకుంటూ వెళ్ళిపోయాడు.

# 8

విజయ ఇంటికి ఆనుకునిఉన్నతోటలో ఈవైపుభాగం చాలాపెద్దది. పెద్దపెద్ద మామిడిచెట్లూ, పనసచెట్లూ, వాటిక్రింద చీకటి దట్టంగా వ్యాపిస్తున్నది. ముసలిదర్వాన్ - "అమ్మగారూ, కొంచెంచుట్టుఅయితే అయింది, రోడ్డున తిరిగిపోవటం మంచిదికాదా?"అని అన్నాడు.

ఇవన్నీ చూసేస్థితిలో లేదు విజయమనస్సు — ఆమె "ఉహుం" అని ఒక్కమాట అని ఆచీకటిలో తోటమధ్యగుండా త్వరత్వరగా ఇంటివేపుకు నడవటం మొదలుపెట్టింది. అన్నిటి కంటే ముఖ్యంగా రెండువిషయాలుమాత్రం ఆమె మనసును ఆవరించి కూచున్నవి. అందులో ఒకటి: అంతసేపు మాట్లాడినా స్త్రీలకు ఉచితంకాదనే ఉద్దేశంతో అతనిపేరు తెలుసుకోక పోవటం. రెండు: ఒకవారంలో ఆయన ఎక్కడికి వెళ్ళుతాడూ-అనేప్రశ్న వందసార్లు నోటి దాకావచ్చికూడా, వందసార్లూ సిగ్గుతో నోట్టిదగ్గర పట్టుకుపోవటం. ఇతన్నిగురించి విజయ మొదటే ఒకవిషయం గ్రహించింది: ఇతనెవరైనాకానీ, బాగా చదువుకున్నవాడనీ, పల్లెటూళ్లో పుట్టినప్పటికీ పరాయిస్త్రీలతో నిస్సంకోచంగా మాట్లాడగల శిక్షణా, చనువూ, అభ్యాసమూ ఉన్న దనీ, ఆమె తెలుసుకున్నది. బ్రహ్మసమాజీకుడు కాకుండా ఈశిక్షణ ఎక్కడపొందాడా ? అని ఆలోచిస్తూ ఆమె ఇంట్లో అడుగుపెట్టగానే పరేశునితల్లివచ్చి - "చాలాసేపటినించి విలాసబాబు కిందగదిలోకూచుని మీకోసం ఎదురుచూస్తున్నా"రని చెప్పగానే ఆమెమనస్సు ఆలసట తోనూ విరక్తితోనూ నిండిపోయింది. ఈవ్యక్తే ఆవాళ కోపంతో మండిపడిపోయి మళ్ళీ తిరిగిరానిది. ఇవ్వాళ ఇతను ఏపని ఉండిఅయినా రానీ - వీరిద్దరినీ ఒక్కమాటు పోల్చు కుని, వీరిద్దరికీ ఆకాశ పాతాళాలకున్నదూరం ఉన్నదని తేల్చకుండా విజయ ఉండలేక పోయింది.

"నే నింటి కొచ్చిన సంగతి ఆయనతోచెప్పావా?" అన్నది విజయ అలిసినగొంతుతో.

"ఉహుం, నేనిప్పుడే పరేశుణ్ణి పంపబోతున్నాను, అమ్మా!" అన్నది పరేశునితల్లి.

"ఆయన టీ త్రాగుతాడో లేదో అడిగావా ?"

"అమ్మో ! అదే అడగలేదనుకున్నావా ? - మీరురాగానే ఇద్దరంకలిసి తీసుకుంటామని చెప్పారు."

విలాసబాబే ఈయింటికి ముందు కాబోయే యజమాని అని, ఇక్కడ దాసదాసీలకీ, చుట్ట పక్కాలకీ, అందరికీ తెలుసు. అంచేతనే అతనిమర్యాదకు ఎవ్వరూ లోపం రానిచ్చేవారు కాదు.

విజయ ఇకనేమీ మాట్లాడకుండా పైన తనగదిలోకి వెళ్ళిపోయింది. దాదాపు ఇరవై నిమిషాలు గడిచినాక ఆమె క్రిందికి వచ్చి తలుపుదగ్గర నిలబడి చూసింది - విలాసుడేవో కాగి తాలు చూస్తున్నాడు. ఆమె కాళ్ళచప్పుడు విని అతను తలపైకెత్తి చిన్ననమస్కారంపెట్టి, ఒక్కమాటుగా గంభీరుడై - "నేను కోపంతోటే ఇన్నాళ్ళనించి రాలేదని నువ్వు అనుకుని ఉంటావు. నిజానికి నాకు కోపంరాలేదు - ఒకవేళ వచ్చినా నాపట్ల అది అన్యాయంకాదని ఇవ్వాళ నీకు ఋజువుపరుస్తాను" అన్నాడు.

విలాసుడు ఇంతవరకూ విజయను "మీరు" అని పిలిచేవాడు. ఇవ్వాళ హఠాత్తుగా "నీవు" అని అనటానికి కారణమేమిటో విజయకు అంతుపట్టకపోయినా ఆమె ఈపిలుపుకు ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బులుకాలేదనిమాత్రం ఆమె ముఖాన్నిబట్టి చెప్పవచ్చును. ఆమె దీనికి జవాబేమీ ఇవ్వకుండా గదిలోకివచ్చి ఎడంగాఉన్న కుర్చీఒకటి లాగి కూర్చున్నది.

విలాసుడు అది ఏమీ గమనించకుండా చెప్పుకుపోయాడు :

"నేను అన్నీ ఏర్పాటుచేసి ఇప్పుడే కలకత్తానించి వచ్చాను. ఇంకా మానాన్నగారినికూడా చూడలేదు. నీకేం, నీవేమీ పట్టించుకోనట్టు ఉండగలవు ; కాని నేనుండలేను. నాకు బాధ్యతా భారం జాస్తి - నేనొక పెద్దకార్యాన్ని నెత్తినవేసుకుని నిశ్చింతగా ఉండలేను. మన బ్రాహ్మ మందిర ప్రతిష్ఠాపన ఈ క్రిస్‌మస్ నెలవల్లో జరగాలి - అన్నీ సిద్ధంచేసివచ్చాను. ఆఖరికి ఆహ్వానాలవిషయంకూడా నేను వదిలిపెట్టిరాలేదు. అబ్బ - నిన్న ఉదయంనించి ఏమితిరిగాను, ఏమితిరిగాను ! సరే - ఇక ఆవిషయంలో మనం నిశ్చింతగా ఉండవచ్చు. ఎవరెవరువస్తారో వాళ్ళపేర్లుకూడా కాగితంమీద రాసుకొచ్చాను - ఒకమాటు చదివిచూడు." అని విలాసుడు ఆత్మానందంతో తృప్తిగానిట్టూర్చి, కాగితం విజయవేపుకు నెట్టి ఈజీచేరులో వేళాడపడ్డాడు.

అయినా విజయ మాట్లాడలేదు - ఆహ్వానింపబడ్డ పెద్దలవిషయంలోకూడా ఆమె ఏమీ ఉత్సాహం కనపరచలేదు. ఎలాకూర్చున్నది అలానే కూర్చున్నది. ఇంతసేపయినతర్వాత విలాసుడు, విజయ మాట్లాడటంలేదని గ్రహించి - "ఏమిటిసంగతి ! మాట్లాడవేం ?" అని అడిగాడు.

"నేను ఈ పిలిచిన పెద్దమనుషులకి ఏం సమాధానం చెప్పాలా అని ఆలోచిస్తున్నాను." అన్నది విజయ నెమ్మదిగా.

"అంటే ?"

"మందిర ప్రతిష్ఠాపన విషయమై నేనింకా ఏమీ స్థిరపరుచుకో లేదు."

విలాసుడు ఒక్క ఊపున తిన్నగా లేచి కూచుని, కొంచెంసేపు మహాతీవ్రంగా చూసి— "అంటే ఏమిటీ ? ఈ నెలవల్లో గనక జరగకపోతే ఇక ఇప్పట్లో జరుగబోతుం దను కున్నావా ఏమిటి నువ్వు ? వాళ్లెవరూ నీ మోచేతి క్రింది నీళ్ళుతాగేవారు కారు, నువ్వు పిలుచుకుని పిలిచినప్పుడు పరుగెత్తుకు రావటానికి ? ఇంకా స్థిరపరుచుకోలేదా ? అంటే ఏమిటి చెప్పు ?". అని అడిగాడు.

కోపంతో అతని కళ్ళు రెండూ చింతనిప్పుల్లాగా వెలిగినై. విజయ చాలాసేపు తల వంచుకునే మెదలకుండా కూచుని, తర్వాత నెమ్మదిగా—"దీని కింత గంద్రగోళం అక్కర లేదని అనుకున్నాను." అన్నది.

విలాసుడు ఆశ్చర్యంతో కళ్లు రెండూ పెద్దవిచేసి—"గంద్రగోళమా ! గంద్రగోళం చేయాలని నేనెప్పుడూ చెప్పలేదే ! మామూలుగా, స్వాభావికంగానే, గంభీరులూ, శాంతులూ అయినవారి పనులు నిశ్శబ్దంగా చేసుకుపోవటం కూడా నాకు తెలుసు. ఈ విషయమై నువ్వేమీ ఆలోచించవలసిన పనిలేదు." అన్నాడు.

"ఇక్కడ బ్రాహ్మ మందిరం ప్రతిష్ఠించినందువల్ల ఉపయోగమేమీలేదు. అది జరగదు." అన్నది విజయ, అలానే మెల్లగా.

విలాసుడు మొదట ఎంతగా స్తంభించి పోయాడంటే, అతనినోట వెంటనే మాటరాలేక పోయింది. ఆ తర్వాత అతను గుక్క తిప్పుకుని—"అసలు నువ్వు బ్రాహ్మ మహిళవు అవునో కాదో ముందు నేను తెలుసుకోవాలి ?" అని అడిగాడు.

విజయ ఈ తీవ్రమైన దెబ్బకు చకితురాలైనట్టు ఒక్కమాటు తలఎత్తి చూసింది. కాని ఒక్క క్షణంలో ఆమె తనను తాను సంబాళించుకుని—"మీరు ఇంటికిపోయి కొంచెం శాంత పడి వస్తే ఆతర్వాత మాట్లాడుకోవచ్చు - ఇప్పటికి ఆగండి." అని లేవటానికి ఉపక్రమించింది. కాని, నౌకరు టీసరంజామ తీసుకు రావటం చూసి మళ్ళీ కూర్చున్నది. విలాసుడు అవైపు చూడనేలేదు. బ్రహ్మసమాజంలో ఉండి కూడా అతను మర్యాదగా ప్రవర్తించటం నేర్చుకో లేదు. అతను ఆ నౌకరు ముందరనే ఉద్ధృతంగా—"మేము ఈ సంబంధం వదులుకోవచ్చు. తెలుసునా ?" అని అడిగాడు.

విజయ మాట్లాడకుండా టీ కలుపుతున్నది. సమాధానం చెప్పలేదు. నౌకరు వెళ్ళి పోయిన తర్వాత ఆమె మెల్లగా—"ఆ విషయం నేను కక్కాయితో మాట్లాడతాను - మీతో కాదు." అని ఒకకప్పు అతని ముందుకు తోసింది.

విలాసుడు అది అంటుకోకుండా మళ్ళీ వెనకటి ప్రశ్నే వేశాడు : "మేము ఈ సంబంధం వదులుకుంటే ఏమవుతుందో తెలుసునా ?"

"ఉహుఁ. అదేమైనా కానివ్వండి. మీకు కర్తవ్యతా జ్ఞానం అంత జాస్తి అయినప్పుడు నాకిష్టం లేకుండా పెద్ద మనుషులను పిలిచి వారిని ఇబ్బందిపెట్ట దలుచుకున్నపుడు, ఆపని కాస్తా మీ చేతిమీదుగానే కానివ్వండి. ఇందులో నన్ను పాలు పంచుకోమనిమాత్రం నన్ను కోరకండి." అన్నది విజయ.

విలాసుడు కళ్ళు రెండూ ఎర్రగాచేసి గర్జించాడు :—"నేను కర్మిష్ఠిని. పనిచేయటం నాకిష్టం—ఆటలాడుకోటం నాకిష్ట ముండదు - ఈ ఒక్క సంగతి మాత్రం మరిచిపోమాకు, విజయా."

"సరే, అలాగే మరిచిపోను." అన్నది విజయ స్వాభావిక శాంతంతో.

ఇందులో ఉన్నశ్లేష విలాసవిహారికి పిచ్చి ఎక్కించింది. అతను గొంతు అణచి చించు కుని—"సరే, నువ్వు మరిచిపోకుండా కూడా నేను చూస్తాను." అన్నాడు.

విజయ దీనికి జవాబివ్వలేదు. తలవంచుకుని టీ కప్పులో చెంచాపెట్టి కలపనారంభిం చింది. ఆమె మౌనం చూసి, విలాసుడు కూడా ఒకక్షణకాలం మౌనంగా ఉండి, కొంత సంబాళించుకుని—"సరే, ఇంతపెద్ద ఇల్లు ఇంకెందుకు ఉపయోగిస్తావో చెప్పు ? ఎటుతిరిగి ఊరక ఉంచము కదా !" అని అడిగాడు.

ఈ మాటు విజయ తలఎత్తి తొణకని గొంతుతో—"ఇంకా ఈ ఇల్లు తీసుకోటం స్థిర పడలేదు." అని అన్నది.

ఈ జవాబు విని విలాసుడు కోపంతో తనవొళ్ళు మరిచిపోయి, కాలితో నేలను గట్టిగా తన్నుతూ అరిచాడు:—"లక్షసార్లు స్థిరపడింది. నేను సమాజంలో పెద్దమనుషులను పిలిచి ఈ విధంగా అవమాన పరచలేను—ఈ ఇల్లు మాకు కావలసిందే. ఈ పనిచేసి గాని నేను వదలనని నీకు ముందుగానే చెప్పి పోతున్నాను !" అని జవాబుకుకూడా ఎదురు చూడకుండా పెద్ద అంగ వేసుకుంటూ గదిలోనించి వెళ్ళిపోయాడు.

# 9

ఆనాడు ఆ అపరిచిత వ్యక్తితో మాట్లాడినప్పటినించీ, విజయ మనసులో ఒక ఆశ దాహంలాగా పట్టుకున్నది—ఆ వ్యక్తి వెళ్ళిపోయే ముందు ఒక్కమాటు అయినా తన మిత్రుణ్ణి వెంట బెట్టుకు వస్తాడని. ఆనాడు వీరిద్దరి మధ్యా జరిగిన సంభాషణ అంతా విజయ మనసులో నాటుకున్నది—అందులో ఒక్కశబ్దంకూడా ఆమె మరిచిపోలేదు. రాత్రింబగళ్ళు అవే ఆమె జ్ఞాపకం చేసుకుని, తరచి చూచుకున్నది—ఆమె మాట్లాడినదాంట్లో నిరాశచెందటానికి తగిన మాట ఒక్కటి కూడా లేదు. పైగా నరేంద్రుడు తనతండ్రి స్నేహితుడని చెప్పిన గుర్తు కూడా ఉన్నది; గడువు గనక ఇస్తే తీర్చే సమర్థత ఉన్నదా లేదా అనికూడా అడిగింది. అయితే, ఎవరి సర్వస్వం పోవటానికి సిద్ధంగా ఉన్నదో ఆయన ఇంతమాత్రం ఆసరాచిక్కినప్పుడు నిలుపుకోటానికి ప్రయత్నించడా! ఎక్కడా ఆశలేని చోటకూడా మిత్రులూ బంధువులూ ఒక్కమాటు ప్రయత్నించి చూడమని చెప్పుతారు. అయితే, ఈ మిత్రుడు ప్రపంచానికి విరుద్ధమైనవాడా!

మళ్ళీ నదివొడ్డున ఎప్పుడూ అతను కనిపించలేదు. కాని, ఆమె ఉదయంనించి సాయంత్రంవరకు అతను ఎప్పుడో ఒకప్పుడు వస్తాడని ఆశతోనేఉంది. ఇలా రోజులు గడిచి పోతున్నై. - అతనూ రాలేదు, చిత్రమైన అతని డాక్టరుస్నేహితుడూ రాలేదు.

రాసవిహారి కనిపించాడు. కాని అతను ఈమధ్య విలాసుణ్ణి చూసినట్టుగానీ, మాట్లాడినట్టుగానీ ఏమీ కనపరచలేదు. పైగా ఇల్లుతీసుకోవటమూ, మందిరప్రతిష్ఠాపనా ఒకవిధంగా స్థిరపడినట్లుగానే సూచించాడు. ఈవిషయమై ఏదైనా రచ్చరావచ్చుననే సందేహం అతని మనసులో లేనట్టే నటించాడు. విజయకూడా సంకోచంతో ఈ ప్రస్తావన తేలేదు.

మార్గశిరం వెళ్ళిపోయింది. పుష్యశుద్ధ పాడ్యమినాడు తండ్రి కొడుకులిద్దరూ ఒక్కమాటుగా దర్శనమిచ్చారు. రాసవిహారి విజయతో - "అమ్మా! ఇంకా ఎక్కువ సమయం కూడాలేదు. ఈమధ్యనే అన్నీ సర్దుకోవలసీ, బాగుచేయించవలసీ ఉంటుంది." అన్నాడు.

విజయకు నిజంగానే చాలా ఆశ్చర్యంవేసింది:-"అదెట్లా? వారికైవారు వెళ్ళిపోంది ఏమిచెయ్యటానికీ వీలుండదు," అని అన్నది.

విలాసవిహారి పెదాలుబిగించి చిన్ననవ్వు నవ్వాడు. అతనితండ్రి - "ఎవరిసంగతి తల్లీ నువ్వు చెప్పేదీ? జగదీశుని కొడుకుసంగతేనా? అతను నిన్ననే ఇల్లు ఖాళీచేశాడు." అన్నాడు.

ఈవార్త విజయహృదయాన్ని చాలా బాధపెట్టింది. ఆమె విలాసుడిముఖం కనపడకుండా ఉండేందుకు వెనక్కుతిరిగి నిలబడింది. ఈవిధంగా ఒక్కక్షణం ఉండి, తనను కొంత సంబాళించుకుని నెమ్మదిగా - "వారిసామాను ఏమైంది? తీసుకుపోయారా?" అని రాసవిహారి నడిగింది.

విలాసుడు వెనకనుంచే హేళనగా - "ఏమున్నై సామాన్లు? మూడుకాళ్ళమంచం ఒకటిఉంది, దానిమీదే పండుకునేవాడు కామాలు - నేను అది కాస్తాతీయించి చెట్టుక్రింద పారవేయించాను. అతనికి అవసరముంటే వచ్చి తీసుకుపోతాడు. మనకేమీ నష్టంలేదు." అన్నాడు.

విజయ మాట్లాడకుండా ఊరుకున్నది. కాని ఆమె ముఖంమీద వేదనాచిహ్నాలు స్పష్టంగాచూసి రాసవిహారి తనకొడుకును మందలించాడు :-"అదేరా నీలోఉన్నతప్పు, విలాస్! మానవుడు ఎంత దోషిఅయినాకానీ, భగవండు అతనికి ఎంత శిక్షఅయినా విధించనీ - అతని కష్టాలకు దుఃఖపడటం, సానుభూతిచూపటం మనవిధి. నీవు అంతరంగంలో అతనికోసం బాధ పడటంలేదని నేను అనటంలేదు - కాని అది బయటికిచూపించటం కర్తవ్యమని నేను చెప్పు తున్నాను. జగదీశునికొడుకు నీకు కనిపించాడా ? అతన్ని నాదగ్గరికివచ్చి కనపడమని ఎందుకు చెప్పలేదూ ? చేసేవాణ్ణిగా, ఏమైనాసహాయం-"

తండ్రిమాటలు ఇంకా పూర్తికాలేదు - పుత్రుడు అతని ఉద్దేశాన్నంతా ధ్వంసంచేసి, తృణీకారంగా మాట్లాడాడు: - "అతని దగ్గరికి పోయిచూసి, ఆహ్వానించటంతప్ప నాకు వేరే పనులేమీలేవు, నాన్నా ! నువ్వు మరీ ఇదిగాచెప్పుతావు. అదీగాక నేను అక్కడికిపోయేవరకే పెట్టే బేడా యంత్రాలూ, గింత్రాలూ, అన్నీ సర్దుకుని ఎప్పుడో దాటిపోయాడు ; ఇంగ్లాండు డాక్టరట - ఎందుకూపనికిరాని హంబగ్ !" అని ఇంకేమో అనబోతూఉండగా, రాసవిహారి ఓరగంట విజయవంకచూసి, కుపితస్వరంతో - "ఆగవోయి, విలాస్ ! నీవిలామాట్లాడితే నేను క్షమించలేను. నీప్రవర్తనకు నీవు సిగ్గుపడటం ఉచితం - పశ్చాత్తాపపడటం ఉచితం." అన్నాడు.

కాని విలాసుడు వీసంకూడా సిగ్గుకానీ పశ్చాత్తాపంకానీ పడకుండా-"ఎందుకో చెప్పండి ? ఇతర్లకష్టాలకు ద్రవించటం, ఇతర్లదుఃఖం తొలగించటం నాకుతెలుసు. ఆశిక్షణ నేను పొందాను. కాని, ఇంటిమీదికివచ్చి అవమానించిపోయే దాంభికుణ్ణి నేను క్షమించలేను. అంత ఆత్మవంచన నేను చేయలేను." అన్నాడు జవాబుగా.

అతనిజవాబు విని ఇద్దరూ ఆశ్చర్యపోయారు. రాసవిహారి - "ఎవరూ ఇంటిమీదికివచ్చి నిన్ను అవమానించిపోయింది ? ఎవరిసంగతి నీవు మాట్లాడేది ?" అని అడిగాడు.

విలాసుడు గాంభీర్యం నటిస్తూ - "నేను మాట్లాడేది, జగదీశబాబు సుపుత్రుడైన నరేన్ బాబుసంగతి నాన్నగారూ ! అతను ఒకనాడు ఈ ఇంట్లోనేకూచుని నన్ను అవమానించి పోయాడు. అప్పుడతన్ని నేనెరగను. లేకపోతేనా -" అని విజయవంక చూపిస్తూ అన్నాడు. -"సరే, నన్నేకాదు, వీరినికూడా అవమానించకుండా వదలలేదు - మీకు జ్ఞాపకమున్నదా ఆసంగతి ?"

విజయ చకితురాలై ముఖం తిప్పి చూడగానే విలాసుడు ఆమెనే ఉద్దేశించి మళ్ళీ అన్నాడు!—"పూర్ణబాబు మేనల్లుణ్ణి అని చెప్పి, మిమ్మల్ని కూడా అవమానించి పోయెనే, అతను ఎవరనుకున్నావు ? అప్పు డతనికి బాగాతోమత్తు ఇచ్చావు ! అతనే నరేన్‌బాబు ! అప్పుడే గనక అతను తన అసలు పరిచయం బయట పెట్టటానికి సాహసించి ఉంటే, నిజంగా మగ వాడని వొప్పుకునేవాణ్ణి ! లుచ్ఛాకోరు ఎక్కడో !"

ఈ మాటలకు విజయముఖమంతా వివర్ణమై కట్టెబారి పోయింది, ఈ సంగతి గ్రహించి తండ్రి కొడుకు లిద్దరూ ఆశ్చర్యపడ్డారు.

—ఇంకా వుంది.

# ప్రజాపరిషత్తు

**1942** క్రిప్సు ప్రతిపాదనలు అమలులో నున్నవని, యుద్ధం ముగిసింది గావున వాటి ప్రకారం 1946 ఏప్రిల్‌లోగా రాష్ట్ర ఎసెంబ్లీ ఎన్నికలు జరుగునని, దామాషా ప్రాతినిధ్యం (ప్రపోర్షనల్ రిప్రజంటేషను) ప్రకారం భారత భవిష్యద్రాజ్యాంగ నిర్మాణానికి ప్రజాపరిషత్తు ఎన్నికలు జరుగుతవని ఆతర్వాత భారత స్వయంపాలనమునకు కావలసిన రాజ్యాంగాన్ని భారత ప్రజలే నిర్ణయించుకుంటారని లండన్ వెళ్ళి తిరిగి వచ్చిన తర్వాత లార్డు వేవెల్ సెప్టెంబరు 19 వ తేదీ ప్రకటించాడు.

అపుడే రాష్ట్ర ఎసెంబ్లీ ఎన్నికలు జరుగుటకు తగు సన్నాహాలు ప్రారంభించారు: ముందుగా రాష్ట్ర ఎసెంబ్లీల నన్నింటిని రద్దుచేశారు. ఓటర్ల అర్హతలు మాత్రమే కాకుండా జాబితాలుకూడా పాతపద్ధతినే ఉంచివేశారు. కొన్ని రాష్ట్రాలల్లో నూతన దరఖాస్తులు చేసికోవచ్చు నని అన్నా మొత్తంమీద పాతవిధానం, లిస్టులే అధికంగా అమలులో ఉంచారు. సంకుచిత ఓటింగు విధానంవల్ల ఎంతమందో ప్రజలు వోటు బడయ లేకపోవుచున్నారు.

1937 నాటి ఎన్నికలకున్న అర్హతలే నేటి అర్హతలుకూడా. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు వయోజన వోటింగు సౌకర్యం కల్పించండని ఏకకంఠంగా కోరినా వైస్రాయి, బ్రిటిషు ప్రధాన మంత్రి కాలవ్యవధి చాలదనే వంకతో ఆ కోర్కెను త్రోసివేశారు. 1937 నాడు భారత దేశంలో, ముఖ్యంగా బ్రిటిషు ఇండియాలోని రాష్ట్ర ఎసెంబ్లీలకు ఓటు అర్హులు జనాభా (1931) గమనించండి.

1937 లో ఎసెంబ్లీ ఓటరులు

| రాష్ట్రం | జనాభా | వోటర్లు |
|---|---|---|
| మద్రాసు | 44205000 | 6436760 |
| బొంబాయి | 17992000 | 2609457 |
| బెంగాల్ | 50116000 | 6695483 |
| సంయుక్త | 48409000 | 5335309 |
| పంజాబు | 23581000 | 2686094 |
| బీహారు | 32371000 | 2412229 |
| మధ్య | 15323000 | 1741364 |
| ఒరిస్సా | 8623000 | 815341 |
| సరిహద్దు | 2425000 | 246609 |
| ఓరిస్సా | 8260000 | 520225 |
| సింధు | 3887000 | 639043 |
| | 25590000 | 30137914 |

అంటే నూటికి దరిదాపుగా 12 మందికి మాత్రమే వోటింగు హక్కు లభించిందన్న మాట. ఇప్పుడు బ్రిటిషు రాష్ట్రాలల్లో 1941 లో 295827000 మంది జనసంఖ్య ఉన్నారు. 1941 లో జనాభా పెరిగినా ఓటింగు హక్కులో అభివృద్ధి యేమీ లేనందున 29 కోట్ల పైచిలు

వావిలాల గోపాలకృష్ణయ్య

కులో 3 కోట్ల మంది పదవవంతు మాత్రమే అవుతుంది. అంటే నూటికి తొంబది మందికీ ఈ యెన్నికలతోగాని, భారత భవిష్యన్నిర్మాణంతో గాని సంబంధం లేదన్నమాట!

ఇదే ప్రజాపరిషత్తు నిర్మాణం గురించి క్రిప్సు సూచనలలో ఈ విధంగా ఉంది. భారత దేశంలోని నాయకులు పరస్పర ఒడంబడికతో మరోవిధంగా నిర్ణయించిననే తప్ప "యుద్ధం ముగియగనే విధిగా జరుపవలసిన రాష్ట్ర శాసన సభల ఎన్నికల ఫలితములు తెలియగనే రాష్ట్రాల ల్లోని ఎసెంబ్లీ సభ్యులందరు ఎన్నికదారుల ముఠా (ఎలెక్టరల్ కాలేజీ) గా యేర్పడుతారు. అందులో దామాషా ప్రాతినిధ్యం (ప్రపోర్షనల్ రిప్రజంటేషను) ప్రకారం రాజ్యాంగ నిర్మాణ సంస్థ (కాన్స్టిట్యుయంట్ అసెంబ్లీ అనేమాటను వాడుటకు ప్రభుత్వానికిష్టం లేదు. సామాన్యంగా మనమే వాడుతున్నాం. దీనినే ప్రజాపరిషత్తు అని మనం అంటున్నాం.) రాష్ట్ర ఎసెంబ్లీ సభ్యులలో నూటికి పదిమంది వంతున కలిగియుంటుంది.

ఆ విధంగానే సంస్థానాలకుకూడా బ్రిటిషు ఇండియా దామాషా ననుసరించి ప్రతినిధులను పంపవలసినదిగా సంస్థానాధిపతులను ప్రభుత్వం కోరుతుంది. వారును బ్రిటిషు ఇండియా ప్రతినిధులతో సమానాధికారాలు కలిగి ఉంటారు"

ఇప్పటికి నూటికి పదిమందిచేత ఎన్నుకోబడిన ప్రతినిధులలో మరల నూటికి పదిమందిని ఎన్నుకోవాలె. ఎన్ని వడపోతలు. ఈ వడపోతలైనా రాష్ట్రాలల్లోనే.

సంస్థానాలల్లో పౌరసత్వహక్కులు లేవు. ప్రజాప్రతినిధి సభలు లేవు. ఎన్నికలు ఎరుగనే ఎరుగరు. ఆ సంస్థానాలనుండి వచ్చే ప్రతినిధులు ప్రజలచే ఎన్నుకోబడినవారు కానే కారు. నిరంకుశ సంస్థానాధిపతుల దయాధర్మమునకు లోనగువారు. వారు పేరుపెట్టి పంపుతే సరి అతడు సంస్థాన ప్రతినిధి అయిపోతాడు. సహజంగా ప్రజావిరోధులనే సంస్థానాధిపతులు పంపుతారు. క్రిందటి యుద్ధానంతరం యూరోప్ ఖండంలోని దేశాలలో యేర్పడిన ప్రజాపరిషత్తులు చాలావరకు ప్రత్యక్ష ఎన్నికలే! 1919-20 లో యూరప్ దేశంలో ప్రత్యక్ష ఎన్నికలతో ప్రజాపరిషత్తు లేర్పడితే ఇండియాలో 1946 లో కూడా పరోక్షపు ఎన్నికలు, సంకుచిత వోటింగు, అందులో అనేక వడపోతలు, సంస్థానాధిపతుల నామినేషనుదారులకు ప్రజా ప్రతినిధులతో సమానాధికారాలు. ఈ ప్రజా పరిషత్తులో ఎంతవరకు ప్రజాభిమతం ప్రస్ఫుటం కాగలదో యోచించండి.

## ప్రజా పరిషత్తు నిర్మాణం

ఇంక ఈ ప్రజా పరిషత్తు నిర్మాణం, సభ్యత్వం పరికించుదాం. బ్రిటిషు ఇండియాలోని రాష్ట్రాలల్లోని ఎసెంబ్లీల సభ్యత్వం రాష్ట్రాలవారీగా పరికించదగును.

| రాష్ట్రం | సభ్యులు | రాష్ట్రం | సభ్యులు | రాష్ట్రం | సభ్యులు |
|---|---|---|---|---|---|
| మద్రాసు | 215 | పంజాబు | 175 | సరిహద్దు | 50 |
| బొంబాయి | 175 | బీహారు | 152 | ఒరిస్సా | 60 |
| బెంగాలు | 250 | మధ్య | 112 | సింధు | 60 |
| సంయుక్త | 228 | అస్సాం | 108 | (ఆంధ్ర | 77) |
| | | | | మొత్తం | 1585. |

అందుచేతనే వేవెలు ప్రకటన మరుదినమే డిల్లీ ప్రభుత్వాధికారవర్గం ప్రజా పరిషత్తును 159 మంది సభ్యులు రాష్ట్రాలనుండి ఎన్నుకోబడవలెనని, మూడవవంతు మందిని సంస్థానాధీశులు పేర్కొంటారని సెప్టెంబరు 20 న అనధికార ప్రకటన చేశారు. ఇప్పటికి రానున్న ప్రజా పరిషత్తును మొత్తం 209 మంది సభ్యులుంటారని-రాష్ట్రాలనుండి 159 మందిని పంపవలెనని తేలిపోయింది.

ఇక ఈ 1585 మంది నుండి 159 మంది ఎన్నుకోబడడం ఎట్లా అనేది ప్రధానాంశం కాక తీరదు. దామాషా ప్రాతినిధ్యం ప్రకారం అని క్రిప్సు ప్రతిపాదనలో ఉంది. దామాషా ప్రాతినిధ్యం అనేది కులమతాలవారి ననుసరించియా, రాష్ట్రాలవారీ ననుసరించియా యని యొక యోచన తోచుట కవకాశం ఉంది. కులమతాలవారీ ప్రాతినిధ్యంపై ఆధారపడుతుందంటే అసలు ఈ 1585 మందిలో కులాల మతాల, మరి యితర నియోజకవర్గాలనుండి ఏ విధంగా వస్తారో పరికిద్దాం.

| | | | | |
|---|---|---|---|---|
| జనరల్ | 808 | | వ్యాపార పారిశ్రమలు | 56 |
| నిమ్నజాతులు | 151 | | భూస్వాములు | 37 |
| వెనుకపడిన జాతులు | 24 | | విశ్వవిద్యాలయాలు | 7 |
| ముస్లింలు | 482 | | కార్మికులు | 38 |
| సిక్కులు | 34 | | జనరల్ స్త్రీలు | 28 |
| ఆంగ్లో ఇండియన్‌లు | 11 | | మహమ్మదీయ స్త్రీలు | 10 |
| యూరోపియన్‌లు | 26 | | ఆంగ్లో ఇండియన్ స్త్రీ | 1 |
| ఇండియన్ క్రైస్తవులు | 20 | | భారతీయ క్రైస్తవ స్త్రీ | 1 |
| | | | మొత్తం | 1585 |

వీటినన్నింటిని ఇంకా సరిదిద్ది ఆయా నియోజకవర్గాలను కలిపి సరిచేస్తే కులమతాల వారీగా అసెంబ్లీ సభ్యులు—వారినుండి ప్రజా పరిషత్తు సభ్యులు ఈ క్రింది విధంగా తేలుతారు.

| నియోజకవర్గం | అసెంబ్లీ | ప్రజాపరిషత్తు |
|---|---|---|
| జనరల్ మొత్తం | 685 | 68 (?) |
| నిమ్నజాతులు | 151 | 15 |
| వెనుకపడిన జాతులు | 24 | 2 |
| సిక్కులు | 35 | 3 (?) |
| ముస్లింలు (స్త్రీలతో) | 492 | 49 |
| భారతీయ క్రైస్తవులు | 21 | 2 |
| వ్యాపార పరిశ్రమలు | 56 | 6 |
| భూస్వాములు | 37 | 4 |
| విశ్వవిద్యాలయం | 8 | 1 |
| కార్మిక | 38 | 4 |
| ఆంగ్లో ఇండియన్ | 12 | 1 |
| యూరోపియన్ | 26 | 3 |
| | 1585 | 158 |

ఈ విధంగా 159 అని ప్రభుత్వం అంచనా వేస్తే సవర్ణ హిందువులు, సిక్కులు 5 అంకెమీద ఉన్నందున వారిలో యెవరికో ఒకరికి అధికంగా ఉన్న సీటునిచ్చి యుండవచ్చు. నిమ్నజాతులు, సవర్ణహిందువులు ఎన్నికలలో కలిసే ఉంటున్నారు గావున యిరువురిది కలుపుతే ఆశేషం వస్తున్నందున అది హిందువులకే యివ్వబడి యుండవచ్చును. ఇది ఏనాటికైనా తగాదాకు అవకాశం ఉందనే భావిస్తున్నాను. ఇది ఇట్లాఉండగా న్యాయానికి ఆంగ్లోఇండియన్‌ల సంగతి అటుంచినా యూరోపియనుల కిప్పబడిన ఎసెంబ్లీ స్థానాలు వారి జనసంఖ్యను బట్టే కాకుండా వారికి అధిక సంఖ్యా ప్రాబల్యం యివ్వవలెనని యిచ్చిన వైఁజీ.

ఇంతవరకు దామాషా ననుసరించి మనం ప్రజా పరిషత్తు 159 సీట్లు సరిపుచ్చితిమె గాని ఇది దామాషాగా తలంప వీలులేదు. ఇది కులమతా దామాషా అయితే భూస్వాములు, వ్యాపార పారిశ్రమలు, విశ్వవిద్యాలయాలు కమ్యూనల్(కులమత) ప్రాతినిధ్యంక్రిందికి రానేరావు. అందు వలన భారతదేశం మొత్తంగా ఈ కులమతాల వారీగా అంచనావేస్తే హిందువులు (సవర్ణులు), నిమ్నజాతులు, ముస్లింలు, భారతీయక్రైస్తవులు, సిక్కులుగా మాత్రమే పరిగణింపబడుతుంది. ఆంగ్లో ఇండియనులు ప్రత్యేక కులమతంగా పరికించినా దానికి వారిసీట్లుకూడా యూరోపియన్ సీట్లు మ్రింగివేస్తున్నందువలన ఆ సమస్య ప్రస్తుతం ఆపి ఉంచుదాం. అందుచే ఈ భారతదేశం లోని కులమతాల వివరాలు, ముఖ్యంగా రాష్ట్రాలవారీ పరికించుదాం.

### కులమతాలవారీ జనాభా 1941 (వేలల్లో)

| రాష్ట్రం | సవర్ణహిందువులు | నిమ్నజాతులు | ముస్లింలు | క్రైస్తవులు | సిక్కులు | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| మద్రాసు | 34731 | 8068 | 3896 | 2047 | 0.4 | 49342 |
| బొంబాయి | 14700 | 1855 | 1920 | 375 | 8 | 20850 |
| బెంగాల్ | 17680 | 7379 | 33005 | 116 | 16 | 60307 |
| సంయుక్త | 34095 | 11717 | 8416 | 160 | 232 | 55021 |
| పంజాబు | 6302 | 1249 | 16217 | 505 | 3757 | 28419 |
| బీహారు | 22174 | 4340 | 4716 | 35 | 13 | 36340 |
| మధ్య | 9881 | 3051 | 784 | 59 | 15 | 16814 |
| అస్సాం | 3537 | 676 | 3442 | 41 | 3 | 10205 |
| సరిహద్దు | 180 | .... | 2789 | 11 | 58 | 3038 |
| సింధు | 1338 | 192 | 3208 | 20 | 31 | 4535 |
| ఒరిస్సా | 5595 | 1238 | 146 | 28 | 0.2 | 3738 |
| బ్రిటిషు ఇండియా | 150890 | 39921 | 79399 | 3482 | 4165 | 295809 |
| సంస్థానాలు | 55227 | 8892 | 12660 | 2834 | 1526 | 93189 |
| ఇండియా | 206117 | 48813 | 92058 | 6317 | 5691 | 388998 |

ఇంతవరకు ఉదహరించిన ప్రకారం కులమతాల వారీగా నిర్ణయం జరిగితే, దామాషా విభజించుటే మొదటి విధానం మార్చవలసి వస్తుంది. ఇతర వర్గాలను త్రోసివేస్తారని ఊహించ లేము. అదిగాక దామాషా అన్నచోట యే రాష్ట్రాని కా రాష్ట్రం దామాషా ననుసరించి ఆయా కులమతాలకు వర్గాలకు దామాషా సభ్యులనుబట్టి అనేదికూడా కావచ్చు. *అందుచే మొత్తంమీద కులమతాలకు ప్రాధాన్యం యిస్తూ ప్రత్యేక వర్గాల సంగతికూడా రాష్ట్రప్రయుక్తంగానే ఎన్ను కోవడం అవసరం. ఫెడరల్ ఎసెంబ్లీ ఎన్నికలలో (1) జనరల్ (2) ముస్లిం (3) సిక్కు స్థానాలు ఆయా రాష్ట్రాలలో ప్రాంతాలు నిర్ణయింపబడి నియోజవర్గాలు విభజిస్తారని కే. టి. షా సూచించారు. అందువలన ఆ పద్ధతినే ఇచ్చటకూడా అవలంబిస్తారని తలుస్తే ఈ మూడింటికి రాష్ట్రాలవారీగా ముఠాలు (colleges) యేర్పరుస్తారు. అందులో ఎన్నికలు జరగాలె. ఈ విధానం ఫెడరక్ ఎసెంబ్లీ ఎన్నికలను, స్టేటుకౌన్సిలు ఎన్నికలను 1935 ఆగస్టులో ఉదహ రింపబడియున్నవి. అందువలన మొత్తంమీద పరికిస్తే ఈ సామ్యాల నన్నింటిని అన్వయించు కుంటే కులమత దామాషాలను బట్టి ప్రాతినిధ్యం యేర్పడుతుందని, ఎన్నికలు రాష్ట్ర శాసన

* క్రిప్సు ప్రతిపాదనలలో ప్రత్యామ్నాయం చూపిస్తూ రాజాజీ ఆగస్టు 7, 1945 న భారతదేశంలోని రాష్ట్రి ఎసెంబ్లీ సభ్యులు ప్రజాపరిషత్తు ప్రతినిధుల నెన్నుకోవడం కాకుండా, యేరాష్ట్రాని కారాష్ట్రం కేంద్రంలో ఉండేది లేనిదీ తేల్చుకోవలసినసమస్యకూడా ఉన్నందున ఆయారాష్ట్రాలే తమ సభ్యులను తమ దామాషానుబట్టి ఎన్నుకోవడం అవసరం అన్నారు.

సభ్యులందరు నియోజక ముతాగా యేర్పడినా సభ్యులు యే రాష్ట్రాని కా రాష్ట్రం జనరల్ ముస్లిం, సిక్కు, నిమ్నజాతుల స్థానాలను ఎన్నుకోవడమే జరుగవచ్చునని తేలుతుంది ఫెడరల్ ఎన్నికలు డిస్ట్రిబూటివ్ (ఎన్ని సీట్లుంటే అన్నివోట్లు) కాకుండా సింగిల్ ట్రాన్సఫర్ బుల్ పద్ధతిన ఉండటంవల్ల దీనికికూడా తప్పకుండా ఆ వోటింగుపద్ధతే అమలుజరుపుతారు. ఈ కారణంగాకూడా రాష్ట్రాలవారి యెన్నికలు జరుగతవని తేలుతున్నది. అందువలన యావ ద్భారతంగా ఎన్నికలు జరిగినా రాష్ట్రాల ప్రాముఖ్యం, ప్రాధాన్యత, ప్రాతినిధ్యం పోజాలదు. అందుచే రాష్ట్రాలు తమప్రాముఖ్యతను ప్రస్ఫుటపరుస్తూ తమవిశిష్టతను ప్రదర్శించవలసి ఉంది.

ఈ ఎన్నికలు, వోటర్లు సంకుచితం అవడం, పరోక్షమవడం, ఆంగ్లోయిండియన్, యూరోపియన్‌లకు దామాషాను మించిన ప్రాతినిధ్యం యివ్వడం, అంతకన్న ప్రధానంగా సంస్థానాలనుండి ప్రజలు ప్రతినిధులుకాకుండా సంస్థానాధీశుల ప్రతినిధులు కావడం అన్నింటి కన్నా ఈ ప్రజాపరిషత్తును పరాయి ప్రభుత్వం పిలవడం మొదలగు అనేక లోపాలున్నవి. అయినా విధిలేని పరిస్థితులలో ఈ ప్రజాపరిషత్తులో పాల్గొనటానికే భారతదేశం నిర్ణయించింది.

అసలు స్వాతంత్ర్య నిర్ణయం చేయగలిగిన ప్రజాపరిషత్తు ఆయా దేశపు వివిధపక్షాల సంయుక్తప్రభుత్వం యేర్పడి మైనరువెళ్ళిన ప్రతివారికి స్త్రీ పురుషులకు వోటుహక్కు అర్హతతో భాషాప్రయుక్తంగాననండి జాతులపద్ధతిననండి అసలు సంస్థానాలు రద్దయి దేశపునర్విభజన జరిగి ప్రత్యక్ష ఎన్నికలతో ఆయారాష్ట్రాలు శాసనసభలకు కాకుండా ప్రత్యేకంగా ప్రజాపరి షత్తులకు సభ్యులనెన్నుకొని, వారు సమావేశమై నిర్ణయించిన నిర్ణయాలను మరల దేశంలో ఆయా పార్టీలు ప్రచారం, విమర్శనజరిగి, వాటిపై ఎన్నికలు జరిగి అప్పుడు యేర్పడిన ప్రజాపరిషత్తుద్వారా భావి భారత రాజ్యాంగ నిర్ణయం జరిపినదే నిజమైనప్రజాపరిషత్తు కాగలదు. అది నూటికి నూరుపాళ్ళ ప్రజానిర్ణయం కాగలదు.

పోనీ గత్యంతరంలేక జరిగే ఈపద్ధతి అని తలంచినా, యేరాష్ట్రానికారాష్ట్రం ప్రజాపరి షత్తుగా యేర్పడి భావి భారత రాజ్యాంగంపై, తమ రాష్ట్రరాజ్యాంగంపై నిర్ణయాలు తీసికొని దామాషా ప్రకారం భారతప్రజాపరిషత్తుకు ఎన్నికలు జరుపుకొని సమావేశమై రాజ్యాంగ నిర్ణయం జరుపుకోవాలె. ఏవిధంగా తగ్గించి యోజించినా స్థానికప్రాతినిధ్యం, ప్రాముఖ్యత లేనిచో ప్రయోజనం ఉండనేరదు.

ఆంధ్రులసమస్య ఇక్కడే ఉంది. మద్రాసు రాజధానినుండి రాష్ట్ర ఎసంబ్లీకి ఈ క్రింది విధంగా సభ్యులు ఎన్నుకోబడుతారు. అందులో ఆంధ్రజిల్లాల వివరం కూడా గమనించండి.

| ప్రాతినిధ్యం | రాజధాని | ఆంధ్ర జిల్లాలు |
|---|---|---|
| సవర్ణ హిందువులు | 116 | 45 |
| నిమ్నజాతులు | 30 | 12 |
| వెనకపడిన జాతులు | 1 | 1 |
| ముస్లింలు | 28 | 9 |
| ఇండియన్ క్రైస్తవులు | 8 | 3 |
| స్త్రీలు జనరల్ | 6 | 2 |
| భూస్వాములు | 6 | 3 |
| కార్మికులు | 6 | 2 |
| మొత్తం | 215 | 77 |

రాజధాని మొత్తంలో ఆంగ్లోఇండియన్‌లు 2, యూరోపియనులు 8, క్రైస్తవ స్త్రీ 1, ముస్లిం స్త్రీ 1, విశ్వవిద్యాలయం 1, అదనంగా ఉన్నవి. వాటి ప్రసక్తి అటుంచినా 77 మంది ఆంధ్ర ప్రతినిధులు ఎన్నుకోబడుచున్నారు. అసలు మొదటిలోనే చాలా అన్యాయం జరిగిన

మాట నిజం. మద్రాసు రాజధానిలోని 4,93,42,000 మందిలో ఆంధ్రులు 2,28,16,000 మంది ఉన్నారు. దామాషానుబట్టి 215 సభ్యులు గల ఎసంబ్లీలో 100 స్థానాలన్నా ఆంధ్రులకు లభించియుండవలసింది. పోనీయండి గతించిపోయింది. ఈ ప్రతినిధులు రాష్ట్రీదామాషా ననుసరించి ఆంధ్రులలోనుండి ఎన్నుకోవడం అయితే లాభం ఉంటుంది. కార్మికులు, భూస్వాములు, స్త్రీలు తదితరం భారతదేశం అంతా కలిపి ఎన్నుకోవలెనని తలంచినా జనరల్, ముస్లిం, నిమ్నజాతుల సీట్లల్లో ఆంధ్రులు 5,1,1 రాగలుగుతారు. మద్రాసీయులుగా కాకుండా ఆంధ్రులుగా—ఎన్నుకోబడుతారు. మద్రాసీయులుగా కాకుండా ఆంధ్రులుగా ప్రాతినిధ్యం చూపగలుగుతాం.ఆంధ్రప్రాతినిధ్యం చూపవలెనంటే నిజంగా ఈలోగానే ఆంధ్రరాష్ట్రం బడయవలసి ఉంది. అందువలన ప్రజాపరిషత్తులో ఎంతో ప్రముఖస్థానం వహించగలుగుతారు. ఈవిధంగా ఆంధ్రులు తమ విశిష్టతను ప్రదర్శించగలుగుతారు. అందుకు పూనుకోవలెనని సోదరాంధ్రులను అర్థించుచున్నాను.

---

# స్వీకారము

## చిరంజీవి పాటలు

ఖండకావ్యము. రచయిత : ఊట్ల కొండయ్య, పేరాల, చీరాల పోస్టు. వెల నాలుగు అణాలు.

## భానుమూర్తి భార్య

బృహత్కథ : రచయిత : చంధూరి నాగేశ్వరరావు. ప్రకాశకులు : ప్రతిమా బుక్సు, ఏలూరు. వెల 12 అణాలు.

## కమలా భాస్కరము

పద్య సంగీత నాటిక : రచయిత : శ్రీ సత్యనారాయణరావు (శ్రీవాత్సవ.) ప్రకాశకులు : ఆంధ్రా ఆర్టుప్రెస్, ఏలూరు.

## కన్నతల్లి

పద్యకావ్యము. రచయిత: జో. జనార్ధనశాస్త్రి, తెలుగుపండితుడు, మునిసిపల్ హైస్కూలు, తాడిపత్రి.

## జాముకోడి

పద్యకావ్యము, రచయిత : బెళ్ళూరి శ్రీనివాసమూర్తి, తలమర్ల (పోస్టు) అనంతపురం జిల్లా.

## అరవై సంవత్సరాల కాంగ్రెసు

కాంగ్రెసు గాథ. రచయిత : డా. భోగరాజు పట్టాభి సీతారామయ్య. అనువాదం: ఏడిద కామేశ్వరరావు. ప్రకాశకులు : దేశికవితామండలి, ఘంటసాల—బెజవాడ. వెల పది అణాలు.

## చలం వుత్తరాలు

(చింతా దీక్షితులుగారికి) ప్రతిమా బుక్సు, ఏలూరు. వెల 12 అణాలు.

★

## దీపావళి సంచికలు

ఢంకా. సంపాదకుడు : బి. టి. నరసింహాచార్యులుగారు. ప్రత్యేక రాజకీయ వ్యాసాలతో పత్రిక బాగాఉంది. వెల రూపాయి.

రూపవాణి. సంపాదకుడు : పి. సీతారామయ్యగారు. అనేక త్రివర్ణ చిత్రాలూ, కథలతో పత్రిక సుందరంగా ఉంది. వెల 2-0-0.


కథాంజలి. సంపాదకుడు: ఎ. యన్. రాఘవాచార్యులుగారు. చక్కని కథలున్నై. వెల 0-8-0.

# ఆంధ్రజ్యోతి పజిల్స్

## శ్రీ. శ్రీ.

[ ప్రస్తుతం వినోదంకోసమే. ఇంకా విత్తంమీద కాంక్షలేదు. ]

## పజిలు నెం. 5



### అడ్డము:

1. వెండి తెరమీద కర్ర చెప్పు.
4. ఎల్లుండి ఏకాదశి.
7. శిరస్సులేని తలగడ.
8. దొంగ నిద్రలో దొరికిపోతుంది.
10. ఇంగ్లీషులోఅయితే డబుల్ గ్రాడ్యుయేటు అనాలా ?
12. నోరులేని జీవం : బుద్ధిలేనిమనిషి.
14. (అడ్డు, నిలువు కలిసి) పౌత్రులు.
15. ఈ రాజ్యాలకోసమా యుద్ధం జరిగింది ?
17. 12 లో మూడోవంతు.
18. సప్రూ జయకర్ ప్రభృతులు.
19. ఆంజనేయుడు, భీముడు.
21. ఒక బురుజులో వార్త.
24. అరటి చెట్టులో ఉంది.
25. వ్యాకరణం వెన్నెల.
27. ఒక నాటకంలో నాయిక.
28. పిట్టతో కలిసి చేప.
29. సెనగపప్పులోఅలంకారం.
31. శిలా సుందరి ?
32. 25 అంతంతో ప్రారంభించే వార్ధక్యం.

## ని లు వు:

2. రెండు.
3. ఒక జిల్లా ద్వారం.
4. నాలుగు విధాల చేటు.
(5) అపూర్వమైతే భూమి కౌగల అరణ్యం.
6. వస్తాదే........
9. మనం మాట్లాడేది.
11. పిల్లల పత్రిక.
13. ఎల్లుండి ఆదివారము
14. (14 అడ్డు చూడాలి)
16. హద్దుతోకూడిన సంఘం
17. నరంలేని దంటారు.
19. హైదరాబాదు సోదరుడు.
20. ఒక నాణెం.
22. నాగుబాము భాష.
23. శత్రులు కావు,ద్యుతులు.
25. సీతాపత తల్లి
26. వదిన ముక్కులో 24 గంటలు.
28. ఈ హతాళునికి మొదట్లో కోరిక ఉంది.
30. సాగదియ్యడంలో కనబడుతుంది.

---

నవంబరు నెల సొల్యూషన్

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 అ | యి | 2 ద | 3 క్ష | 4 రా | లు | ■ | 5 నా | 6 రి |
| ను | ■ | 7 త్త | మ | జ | ■ | 8 ప్ర | వ | క్త |
| 9 కో | 10 ప | ము | ■ | 11 కీ | రి | తి | ■ | ము |
| ■ | సి | ■ | 12 మా | య | ■ | ■ | 13 ర | ■ |
| 14 పా | రి | జా | తా | ప | 15 హ | ర | ణ | ము |
| ■ | క | ■ | ■ | 16 రి | ల్లి | ■ | ఫే | ■ |
| 17 ర | ■ | 18 చ | రా | స్థి | ■ | 19 స | రి | 20 గ |
| 21 స | 22 వ | తి | ■ | 23 తు | 24 రా | యి | ■ | దు |
| 25 న | ల్లి | ■ | 26 నా | లు | గు | వ | దు | లు |

బి. ఎన్. కె. ప్రెస్, 43, ఆచారప్పన్ వీధిలో బి. నాగిరెడ్డిగారిచే ముద్రింపబడి
అదేచోట బి. ఎన్. గుప్తగారిచే ప్రకటించబడింది. ఎడిటర్: చక్రపాణి.




శాస్త్రయుక్తముగా
తయారుచేసిన వస్తువులు:

- మాంగో జామ్
- మాంగో రెలిష్
- ఆరంజ్ మార్మలేడ్
- టొమాటో సాస్
- లైమ్‌జూస్ కార్డియర్
- లెమన్ స్క్వాష్
- లెమన్ బార్లీ
- ఆరంజ్ స్క్వాష్

పెద్దవర్తకుల అందరివద్దనూ దొరుకుతవి

**THE INDIA FRUITS LTD., KADIAM**

ANDHRA JYOTI De[illegible] 45 Regd. No. M. 4690

